సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 165

గురువారం 5-9-2019

'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

ఫెడరర్ ఖేల్ ఖతం

యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోనే ఓటమి -స్పోర్ట్స్‌లో

రుణాలన్నీ ఇక 'రెపో'తో..

అనుసంధానం చేయాల్సిందేనని ఆర్‌బీఐ స్పష్టీకరణ - బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఇంటికొకరు

రాష్ట్రాన్ని వణికిస్తున్న జ్వరాలు

- ఆసుపత్రులకు బాధితుల తాకిడి
- ప్రబలుతున్న డెంగీ, మలేరియా, విషజ్వరాలు
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ వైద్యశాలలు
- రోగుల దురవస్థను 'క్యాష్'చేసుకుంటున్న ప్రైవేటు ఆసుపత్రులు
- జ్వరాల ప్రభావంతో పలుచబడ్డ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు
- హైదరాబాద్‌లో అధ్వానంగా పారిశుద్ధ్యం
- క్లోరినేషన్ లేకుండానే మంచినీటి సరఫరా

16 లక్షలు

వారం రోజుల్లో చేసిన డెంగీ పరీక్షలు

హైదరాబాద్ ఫీవర్ ఆస్పత్రిలో పరిస్థితి ఇదీ

సాక్షి ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

ఒక జిల్లా రెవెన్యూ అధికారి నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. మరో ప్రాంతీయ రవాణా అధికారి కూడా వారం నుంచి ఇదే పరిస్థితిలో ఆసుపత్రిలో ఉన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో జ్వరాల కారణంగా రోజువారీగా 20-25% మంది కార్మికులు, ఉద్యోగులు విధులకు హాజరు కాలేకపోతున్నారు. ఒక పని కోసం మండల స్థాయి నాయకుడు ఎమ్మెల్యేను కలిసేందుకు వెళ్తే తన మనవడికి జ్వరం వచ్చినందున ఆసుపత్రిలో ఉన్నానని, తాను ఇప్పుడు కలవలేనని చెప్పాడు. అనేక మంది ప్రజాప్రతినిధులు కూడా జ్వరాల బారిన పడ్డారు. సచివాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది జ్వరాలబారిన పడడంతో కుర్చీలు ఖాళీగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోనూ జ్వరాల కారణంగా సిబ్బంది విధులకు రావడంలేదు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులయితే ఆఫీసులకు రానవసరం లేదని, జ్వరం వస్తే విధులకు హాజరయినట్టే పరిగణిస్తామని ఆయా సంస్థలు సమాచారం ఇచ్చేశాయి. ఇదీ పడకేసిన తెలంగాణ తాజా పరిస్థితి. జ్వరపీడితులతో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. డెంగీ పాజిటివ్ వస్తేనే బెడ్ ఇస్తామంటూ ఆసుపత్రులు తేల్చేశాయి. అది కూడా నాలుగైదు రోజుల నిరీక్షణ తర్వాతే. విధిలేని పరిస్థితుల్లో ఒక్కో పడకపై ఇద్దరిని పడుకోబెట్టి చికిత్సనందిస్తున్నాయి. సందర్శకులుండే రిసెప్షన్ సెంటర్లు కూడా రోగులతో నిండిపోతున్నాయి. అనధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1.25 కోట్ల మంది జ్వరాలతో బాధపడుతున్నారని అంచనా. నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రిలో సోమవారం వచ్చిన ఔట్‌పేషెంట్ల సంఖ్య 2 వేల పైమాటే. వారం రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల మంది డెంగీ పరీక్షలు చేయించుకున్నారంటేనే పరిస్థితి తీవ్రత అర్థమవుతోంది.

ఎటు చూసినా రోగులే!

రాష్ట్రంలోని ఆసుపత్రులు జ్వరబాధితులతో కిటకిటలాడుతున్నాయి. మండల, జిల్లా కేంద్రాల్లో ఉండే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ రోగులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. దీంతో జ్వరం పేరుతో వచ్చిన వారందరికీ పరీక్షలు చేయాల్సి వస్తోంది. పరీక్షల అనంతరం డెంగీయా? మలేరియానా? అని తేలిన తర్వాతే ఆసుపత్రుల్లో ఉంచి చికిత్సనందించాల్సి వస్తోంది. దీంతో ఆసుపత్రుల్లో పడకలకు కూడా కొరత ఏర్పడింది. తీవ్రజ్వరంతో వచ్చిన రోగికి పడక కావాలంటే నాలుగైదు రోజులు పడుతోందని, రోగుల సంఖ్యకు అనుగుణంగా ఎక్కడా బెడ్‌లు లేకపోవడంతో ఈ పరిస్థితి తప్పడం లేదని బాధితుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు

మిగతా 2వ పేజీలో ▶

ముందు జాగ్రత్తలివే!

డెంగీ, మలేరియా, విష జ్వరాలొచ్చేముందు తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి వస్తుంది. కళ్లు తెరవడం కూడా కష్టంగా ఉంటుంది. ఒళ్లు కదిపితే నొప్పెడుతుంది. చర్మంపై దద్దుర్లు కనిపించడం, కండరాలు, కీళ్లనొప్పులు ఉంటాయి. అధిక దాహం, రక్తపోటు పడిపోవడం లాంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. డెంగీతో పాటు మలేరియా ఇతర జ్వరాల నిర్ధారణలో వైద్య పరీక్షలే కీలకం. కేవలం ప్లేట్‌లెట్ కౌంట్, డెంగీ స్ట్రిప్ టెస్ట్, సీరమ్ టెస్ట్ వంటి వాటితో నిర్ధారించడానికి శాస్త్రీయత లేదని వైద్య, ఆరోగ్యశాఖ చెబుతోంది. తప్పనిసరిగా ఐజీఎం పరీక్ష చేయించాలి. ప్లేట్‌లెట్లు 20వేలలోపు పడిపోతే అది ప్రమాదకరం. 15వేల కన్నా తగ్గితే డెంగీ షాక్, మరణాలు సంభవిస్తాయి. డెంగీ జ్వరం వస్తే తీవ్రతను తగ్గించేందుకు చల్లని నీటిలో స్పాంజీని ముంచి శరీరాన్ని తుడవాలి. ఎలక్ట్రాల్ పౌడర్, పళ్లరసాలు రోగికి ఇవ్వాలి. ఇంకా తగ్గకుంటే వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి. దోమలు కుట్టకుండా రోజూ జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి మాత్రమే కాకుండా పగటిపూట కూడా దోమల మందులు వాడాలి. స్కూల్ పిల్లలకు దోమలు కుట్టకుండా పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలి. కాచి వడబోసిన నీటిని తాగాలి. వైరల్ ఫీవర్ వస్తే మంచినీరు ఎక్కువగా తాగాలి. పండ్ల రసాలు తీసుకోవాలి.

కోటి ఎకరాల్లో ఖరీఫ్ సాగు

- రికార్డు స్థాయిలో 111 శాతం వరి సాగు..
- 105 శాతం పత్తి సాగు.. పప్పుధాన్యాల సాగు 88 శాతం

సాక్షి, హైదరాబాద్: ఖరీఫ్ పంటల సాగు కోటి ఎకరాలకు మించి సాగైంది. ఖరీఫ్‌లో అన్ని పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా, బుధవారం నాటికి 1.02 కోట్ల ఎకరాలకు చేరిందని వ్యవసాయ శాఖ వెల్లడించింది. రుతుపవనాలు చురుగ్గా ఉండటం, రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు గణనీయంగా కురవడంతో ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరి నాట్లు పడ్డాయి. ఖరీఫ్‌లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 24.11 లక్షల ఎకరాలు కాగా, 26.79 లక్షల (111%) ఎకరాల్లో సాగు కావడం గమనార్హం. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 43.12 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 45.32 లక్షల (105%) ఎకరాలకు చేరింది. మొక్క జొన్న సాధారణ సాగు విస్తీర్ణం 12.52 లక్షల ఎకరాలు కాగా, 9.46 లక్షలు (76%) ఎకరాల్లో సాగైంది. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 10.37 లక్షల ఎకరాలు కాగా, 9.18 లక్షలు (88%) ఎకరాల్లో సాగైంది. సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 5.25 లక్షల ఎకరాలు కాగా, 4.3 లక్షలు (82%) ఎకరాల్లో సాగైంది. 11 జిల్లాల్లో వంద శాతంపైగా విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. నారాయణపేట, మంచిర్యాల జిల్లాల్లో 122 శాతం విస్తీర్ణంలో పంటలు సాగవడం గమనార్హం. ఖమ్మం జిల్లాలో అత్యంత తక్కువగా 80 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి.

బుధవారం రష్యాలో ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ - వివరాలు 5లో

8న గవర్నర్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర కొత్త గవర్నర్‌గా నియమితులైన తమిళిసై సౌందరరాజన్ ఈ నెల 8న బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర ఎస్.చౌహాన్ ఆదివారం ఉదయం 11 గంటలకు రాజ్‌భవన్‌లో ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుత గవర్నర్ నరసింహన్ ఈ నెల 7న బాధ్యతల నుంచి వైదొలగనున్నారు.

ఆ నలుగురు

- వివరాలు 5లో

అమ్మ కాబోతున్న బామ్మ!

- 73 ఏళ్ల వయసులో గర్భం
- దేశంలోనే మొదటిసారి అంటున్న వైద్యులు
- నేడు గుంటూరులో సిజేరియన్

గుంటూరు మెడికల్

తల్లి కావాలన్న ఆమె కల ఎట్టకేలకు నెరవేరే రోజొచ్చింది. 73 ఏళ్ల వయసులో గర్భం దాల్చిన ఆమెకు గురువారం వైద్యులు సిజేరియన్ చేసి పురుడుపోయనున్నారు. ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణుడు, గుంటూరు అహల్యా హాస్పిటల్ అధినేత డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా నెలపర్తిపూడికి చెందిన యర్రమట్టి రామరాజారావుతో మంగాయమ్మకు 1962లో వివాహమైంది. రైతు కుటుంబానికి చెందిన రామరాజారావు దంపతులు వివాహమైన నాటి నుంచి సంతానం కోసం ప్రయత్నించారు. మంగాయమ్మకు 73 ఏళ్లు రావడంతో పిల్లలు పుట్టడం లేదన్న బాధతో వారు గతేడాది చెన్నై వెళ్లి ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) ద్వారా సంతానం పొందాలని చేసిన ప్రయత్నం విఫలమైంది. 2018 నవంబర్‌లో ఆ దంపతులు గుంటూరు అహల్యా ఆస్పత్రిని సంప్రదించగా.. ఐవీఎఫ్ పద్ధతిలో భార్య గర్భం దాల్చింది. దీంతో ఆమెకు ఆస్పత్రిలోనే ప్రత్యేక గదిని ఏర్పాటుచేసి వైద్యసేవలందించారు. బీపీ, షుగర్ లేకపోవడంతో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా గర్భంలో బిడ్డ ఆరోగ్యంగా ఎదిగింది. గుండె వైద్య నిపుణుడు పీవీ మనోహర్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణుడు శనక్కాయల ఉదయ్‌శంకర్ పర్యవేక్షణలో రోజూ వైద్య పరీక్షలు నిర్వహిస్తూ తల్లి, గర్భంలో ఉన్న బిడ్డ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. గురువారం ఉదయం 10.30 గంటలకు మంగాయమ్మకు ఆపరేషన్‌చేసి పురుడుపోయనున్నట్లు డాక్టర్ ఉమాశంకర్ చెప్పారు. 73 ఏళ్ల వృద్ధురాలు గర్భం దాల్చడం దేశంలో ఇదే మొదటిసారని వివరించారు.

మంగాయమ్మను పరీక్షిస్తున్న డాక్టర్ ఉమాశంకర్

ఇంజక్ట్

బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

- పంజాబ్‌లోని బటాలాలో 23 మంది దుర్మరణం
- పేలుడు తీవ్రతకు పేకమేడల్లా కూలిపోయిన భవనాలు
- ఫ్యాక్టరీపై స్థానికులు ఫిర్యాదుచేసినా పట్టించుకోని అధికారులు - 5లో

శివకుమార్‌కు 13 వరకు కస్టడీ

- మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన కర్ణాటక సీనియర్ కాంగ్రెస్ నేత డీకే శివకుమార్‌ను సెప్టెంబర్ 13 వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి అనుమతిస్తూ ఢిల్లీ కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

- వివరాలు 5లో

గురుపూజోత్సవం - 2019

విద్య మా హక్కు - పర్యవేక్షణ అభియాన్ AP

జీవితాన్ని తీర్చిదిద్దే ప్రత్యక్ష దైవాలు-గురుదేవులు...
అటువంటి మహనీయులని పూజించుకునే పండుగ రోజు
ఉపాధ్యాయ దినోత్సవం.
భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతి, విద్యావేత్త, తత్వవేత్త, 'భారతరత్న'
డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని
'జాతీయ ఉపాధ్యాయ దినం' గా పాటిస్తూ ప్రతి సంవత్సరం
గురువులను సత్కరించుకుంటున్నాం

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

ఈ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి
శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి
నేతృత్వంలో
గురుపూజోత్సవ వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం
తేది: సెప్టెంబర్ 5, 2019, సమయం: ఉదయం గం॥ 10-30 ని॥లకు
వేదిక: ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్, మున్సిపల్ ఎంప్లాయిస్ కాలని, విజయవాడ

అమ్మఒడి పథకం అమలు తేది: 26-01-2020
లబ్దిదారులు: 43,03,872 మంది
బడ్జెట్ కేటాయింపు: రూ 6,455.81 కోట్లు
- పేదింటి పిల్లల చదువులకు ఏ తల్లీ భయపడనవసరం లేకుండా, పిల్లలను బడికి పంపిన ప్రతీ తల్లికి సంవత్సరానికి రూ.15,000/-లు అందజేయబడతాయి
- 1వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థుల తల్లులకు ఈ పథకం వర్తింపు

మౌలిక సదుపాయాల కల్పన
- ప్రస్తుత పాఠశాలల పరిస్థితులను ఫోటోలు తీసి మౌలిక సదుపాయాలు మెరుగుపర్చి రెండేళ్ల తరువాత అవే పాఠశాలల ముఖచిత్రాలను ప్రదర్శించి మార్పును తెలియపరచడం
- ఈ విద్యా సంవత్సరంలో 12 వేల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు మరియు 3 వేల ఉన్నత పాఠశాలల్లో 1500 కోట్ల రూపాయలతో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం

వై.ఎస్.ఆర్. విద్యా నవరత్నాలు
- అమ్మఒడి
- మౌలిక సదుపాయాల కల్పన
- విద్యా ప్రమాణాల పెంపు
- ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు
- మాతృభాష వికాసం
- మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, సమరూప దుస్తులు మరియు పాదరక్షలు
- ప్రైవేటు విద్యా సంస్థలపై రెగ్యులేటరి కమీషన్
- పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల మరియు అధ్యాపకుల నియామకం
- నైపుణ్యాభివృద్ధి

డా॥ ఆదిమూలపు సురేష్ గారు
విద్యాశాఖామంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

గురువుల మాట - విద్యార్థుల భవితకు రాచబాట
పాఠశాల విద్యాశాఖ మరియు సమగ్రశిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

క్లుప్తంగా...

రంగాల వారీగా కార్మికులెందరు?

రాష్ట్ర కార్మిక శాఖను వివరాలు కోరిన బీసీ కమిషన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంతమంది కార్మికులు పనిచేస్తున్నారనే దానిపై రంగాల వారీగా స్పష్టమైన వివరాలు అందించాలని కార్మిక శాఖను బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు ఆదేశించారు. సంఘటిత, అసంఘటిత రంగంలోని కార్మికుల వివరాలను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. అలాగే బీడీ కార్మికులు, ఆసరా పొందుతున్నవారు, రిజిస్టర్ కాని బీడీ కార్మికుల వివరాలను కూడా వివరంగా అందించాలన్నారు. బుధవారం బీసీ కమిషన్ కార్యాలయంలో కార్మిక శాఖతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కార్మిక శాఖ ద్వారా నమోదైన కంపెనీలు, వాటిలోని కార్మికులు, వారిలో సామాజిక వర్గాల వారీగా ఉన్న వారి వివరాలను సమర్పిస్తే బీసీల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వానికి సూచించవచ్చని తెలిపారు. ప్రభుత్వం ద్వారా రాయితీ పొందిన పారిశ్రామికవేత్తల వివరాలను కూడా ఇవ్వాలన్నారు. బీసీ కులాల ఆవాస ప్రాంతాల్లో కార్మిక శాఖ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు ఆంజనేయగౌడ్, కృష్ణమోహన్, గౌరీశంకర్, కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్, జాయింట్ కమిషనర్ శ్రీనివాస్, డీసీఎల్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

నేడు అమెరికా విద్యపై సదస్సు

సాక్షి, హైదరాబాద్: అమెరికా విద్యపై గురువారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో సదస్సు జరగనుంది. 'స్టడీ ఇన్ యూఎస్ ఫెయిర్'పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ ఆధ్వర్యంలోని 'ఎడ్యుకేషన్ యూఎస్ఏ'నెట్‌వర్క్ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో అమెరికాలోని 45 అక్రెడిటేటెడ్ వర్సిటీలు పాల్గొని తమ సంస్థలు అందిస్తోన్న కోర్సులు, ఇతర సమాచారాన్ని ఔత్సాహిక విద్యార్థులతో పంచుకోనున్నాయి. యూఎస్ కాన్సుల్ జనరల్ (హైదరాబాద్) జోయెల్ రిఫ్‌మాన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

డ్రోన్లతో అత్యవసర ఔషధాల సరఫరా

ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు అత్యవసర పరిస్థితుల్లో ఔషధాలు, రక్తం సరఫరాకు డ్రోన్లను వినియోగించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టుగా త్వరలో ఈ సేవలను ప్రారంభించనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే డ్రోన్ టెక్నాలజీని విస్తృతంగా వినియోగించుకుంటోందని తెలిపారు. అక్రమ గనుల తవ్వకాలపై నిఘా, శాంతి భద్రతల పరిరక్షణ, అటవీ సంరక్షణ అవసరాలకు డ్రోన్లను వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. యాదాద్రి ఆలయం మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు సైతం డ్రోన్లను వినియోగించామని చెప్పారు. రాష్ట్రంలో ఐటీ రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ఆయన ఆలిండియా రేడియో హైదరాబాద్ కేంద్రానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివరాలు వెల్లడించారు.

నేడు, రేపు భారీ వర్షాలు

సాక్షి, హైదరాబాద్: వాయవ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్ప పీడనంతోపాటు ఉపరితల ఆవర్తనం కూడా కొనసాగుతోంది. దీంతో రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో అనేకచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు తెలిపారు. ఇదిలావుండగా గత 24 గంటల్లో బెజ్జూరులో 6 సెంటీమీటర్ల అధిక వర్షపాతం నమోదైంది. భీమిని, దహేగాం, వర్నిలలో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. కాగజ్‌నగర్, కోటగిరి, వంకిడిలలో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సెర్ఫా చైన్ దందాపై కదలిక

'సాక్షి'కథనంపై పోలీసు విచారణ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: మల్టీ లెవల్ మార్కెటింగ్ కంపెనీ సెర్ఫాపై పోలీసులు విచారణ ప్రారంభించారు. ఏడాదిలో లక్షాధికారి కావచ్చు అంటూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తోన్న తీరుపై 'చైన్ దందా'పేరిట సాక్షిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన సైబరాబాద్ పోలీసులు విచారణ ప్రారంభించారు. సంస్థ కార్యకలాపాలు, అందులో చేరిన ఖాతాదారుల వివరాలను సేకరించే పనిలో పడ్డారు. బుధవారం పలువురు బాధితులు కూడా సెర్ఫాపై సైబరాబాద్ కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం ఉదయం నుంచి సెర్ఫా సంస్థ వెబ్‌సైట్ పనిచేయకపోవడం గమనార్హం.

'గీతవృత్తి పరిరక్షణకు చర్యలు చేపట్టాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత వృత్తి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, వారికి మెరుగైన ఉపాధిని కల్పించాలని కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. వారానికి రెండు రోజులు లిక్కర్ డ్రైడేగా పాటించడంతో గీత వృత్తికి సహాయపడాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అనుమతుల్లేకుండా ఎలా తవ్వారు?

- తెలంగాణలో ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్జీటీ ప్రశ్న
- ఈ నెల 26కి విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: నదీ పరీవాహక ప్రాంతాల్లో 4.10 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుకను అనుమతులు లేకుండా ఎలా తవ్వారని తెలంగాణ ప్రభుత్వాన్ని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ప్రశ్నించింది. తెలంగాణలో ఇసుక అక్రమ తవ్వకాలపై బుధవారం కేసు విచారణ సందర్భంగా రాష్ట్రంలో ఇసుక తవ్వకాలపై కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర శాఖ ఇచ్చిన నివేదికలను పరిశీలించిన జస్టిస్ ఏకే గోయల్ బెంచ్ పలు అంశాలపై వివరణ కోరింది. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను చూస్తుంటే నిబంధనలు పాటించలేదని అర్థమవుతోందని బెంచ్ పేర్కొంది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది సంజీవ్ కుమార్ స్పందిస్తూ పూడికతీత పనులకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని చెప్పగా.. ఈ స్థాయిలో పూడికతీతకు అనుమతులు అవసరం లేదంటారా? అని వ్యాఖ్యానించింది. ఇటీవల పూర్తయిన అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టుల్లో అప్పుడే పూడికతీత ఎలా తీస్తారని ప్రశ్నించింది. అనంతరం విచారణ ఈనెల 26కి వాయిదా పడింది.

తాండూరు కాలుష్యంపై నివేదిక కోరిన ఎన్జీటీ..

పురపాలక వ్యర్థాల దహనం, భవన నిర్మాణ వ్యర్థాలు, నాపరాతి పరిశ్రమల వల్ల తాండూరులో చోటుచేసుకుంటున్న వాయు కాలుష్యంపై నెల రోజుల్లో నివేదిక సమర్పించాల్సిందిగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర శాఖ, వికారాబాద్ జిల్లా మేజిస్ట్రేట్‌లతో కూడిన బృందాన్ని ఎన్జీటీ ఆదేశించింది. వాయు కాలుష్యంపై తాండూరు సిటిజెన్స్ వెల్ఫేర్ సొసైటీ గతంలో దాఖలు చేసిన కేసులో ఎన్జీటీ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

మింగేసే మృత్యువులా.. అంతెత్తున ఓ అల.. అది ఎగసి..పడేలోపే.. తన కెమెరాతో ఆ అద్భుత చిత్రాన్ని ఒడిసిపట్టేశాడో ఫొటోగ్రాఫర్.. అందుకే ఈ ఫొటో వేలాది చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. బ్రిటన్‌కు చెందిన కంట్రీ ఫైల్ వార్షిక క్యాలెండర్ కోసం 42 వేల ఎంట్రీలు రాగా.. చివరగా 12 ఫొటోలను ఎంపిక చేశారు. అందులో ఇది కూడా ఒకటి.. సీహాం హార్బర్ వద్ద నీల్ అనే ఫొటోగ్రాఫర్ దీన్ని తీశారు.

ఇంటికొకరు

▶ మొదటి పేజీ తరువాయి

ఇదే అదనుగా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు సొమ్ము చేసుకుంటున్నాయనే ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. జ్వరమనగానే అన్ని రకాల పరీక్షలు రాస్తుండడం, వాటికి వీలున్నంత ఎక్కువగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. అవసరమున్నా లేకపోయినా ఎడాపెడా మందులు రాస్తూ భారీగా దండుకుంటున్నాయి.

24 గంటల ఓపీలేవీ

రాష్ట్రంలో జ్వర తీవ్రత దృష్ట్యా జిల్లా కేంద్ర ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రుల్లో 24 గంటల పాటు ఓపీ సేవలు అందించాలని ప్రభుత్వ వర్గాలు ఆదేశించాయి. కానీ, ఎక్కడా ఈ సేవలు కనిపించడం లేదని జ్వర పీడితులు, వారి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రభుత్వ ఆసుపత్రులకెళ్తే పట్టించుకునే వారే లేరంటున్నారు. వేల రూపాయలు ఖర్చు పెట్టి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లినా అక్కడా ప్రయోజనం ఉండటం లేదని బాధితులు, వారి కుటుంబసభ్యులు వాపోతున్నారు. చేతి చమురు వదిలించుకోవడం తప్ప పెద్దగా ప్రయోజనం ఉండటం లేదంటున్నారు.

విద్యార్థులకే ఎక్కువ

జ్వర పీడితుల్లో అన్ని వయసులు వారున్నా అందులో విద్యార్థుల సంఖ్యే ఎక్కువగా కనిపిస్తోంది. ఈ జ్వరం వల్ల చనిపోతున్న వారిలోనూ ఎక్కువ మంది చిన్నారులే ఉండడం బాధాకరం. దీంతో తల్లిదండ్రులు.. పాఠశాలలు, విద్యాసంస్థలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో పరిశుభ్ర వాతావరణం లేకపోవడం, కొన్ని పాఠశాలల్లో కనీసం వెంటిలేషన్ కూడా లేకపోవడంతో విద్యార్థుల్లో ఎక్కువగా జ్వరాలు ప్రబలుతున్నాయని మండిపడుతున్నారు. చాలాచోట్ల వాటర్ ప్యూరిఫయర్లు కూడా లేకపోవడం, ఫాగింగ్ అసలే జరగకపోవడంతో పాఠశాలల్లోనే జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయనే ఫిర్యాదులు అందుతున్నాయి.

అన్ని చోట్లా ఇదే పరిస్థితి

ఒక్క పాఠశాలల్లోనే కాదు. రాష్ట్రంలోని అన్ని చోట్లా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, సినిమాథియేటర్లు, షాపింగ్‌మాల్స్.. ఇలా ప్రతిచోటా.. పనిచేసే సిబ్బంది జ్వరం బారిన పడుతుండటంతో ఆయా ప్రాంగణాలు బోసిపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది పలుచబడటంతో పారిశుధ్యం జరుగుతోంది. అయితే, గత మూడేళ్లతో పోలిస్తే రాష్ట్రంలో డెంగీ కేసులు పెరగ్గా, మలేరియా కేసులు తగ్గాయని గణాంకాలు చెబుతున్నాయి. జూన్-ఆగస్టు మాసాల్లో 2017లో సగటున 135 డెంగీ కేసులు నమోదు కాగా, 2019లో అది 149కి పెరిగింది. అదే మలేరియా విషయానికి వస్తే 2017లో 206 కేసులు నమోదు కాగా, 2019లో 47కు తగ్గిపోవడం గమనార్హం.

12 జిల్లాల్లో హైరిస్క్

రాష్ట్రంలో పరిస్థితిని బట్టి మొత్తం 12 జిల్లాలను ప్రభుత్వం హైరిస్క్ జిల్లాలుగా గుర్తించింది. ఇందులో హైదరాబాద్, భద్రాద్రి జిల్లాల్లో మరింత ప్రమాదకర పరిస్థితులున్నాయని, ఆయాప్రాంతాల్లో తగిన చర్యలు వేగవంతంగా చేపట్టాలని ఆదేశించింది. ఒక్క హైదరాబాద్‌లోనే 309 డెంగీ హైరిస్క్, 151 మలేరియా హైరిస్క్ ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఫాగింగ్, యాంటీ-లార్వా ఆపరేషన్లు, నాలాలు, మురుగు కాల్వల్లో డ్రోన్‌ల ద్వారా స్ప్రేయింగ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే, ఈ నివారణ చర్యలేవీ క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోలేదు. గ్రేటర్‌లో వర్షాల కారణంగా మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయినా పట్టించుకున్న అధికారుల్లేరు. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. క్లోరినేషన్ చేయకపోవడంతో మంచినీటిని ముట్టుకునే పరిస్థితి లేదు. తాగునీరు కూడా జ్వరాలకు కారణమవుతోందనే ఆందోళన నగర ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే హైదరాబాద్ నగర పరిధిలో ఎటుచూసినా అపరిశుభ్రతే దర్శనమిస్తోంది.

అక్టోబర్ 14 నుంచి ఎస్సైలకు శిక్షణ!

సాక్షి, హైదరాబాద్: కొత్త ఎస్సైలకు శిక్షణ తేదీ ఖరారైంది. అక్టోబర్ 14 నుంచి ఎస్సైలకు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్రంలోని అన్ని పోలీస్ ట్రైనింగ్ కాలేజీ (పీటీసీ)లకు తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ ఎల్‌పీఆర్‌బీ) గతేడాది మేలో 18 వేల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 1,270 ఎస్సై, దాదాపు 16,500 కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయి. అభ్యర్థులందరికీ దేహదారుఢ్య, రాత పరీక్షలను బోర్డు పూర్తి చేసింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత ఎస్సై మెరిట్ లిస్ట్ కూడా ప్రకటించింది.

వెబ్‌సైట్లో గ్రూప్-2 ప్రొఫిషియెన్సీ హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-2 పోస్టుల భర్తీలో భాగంగా వివిధ శాఖలలోని అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొఫిషియెన్సీ టెస్ట్ హాల్‌టికెట్లను అందుబాటులోకి తెచ్చినట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ప్రొఫిషియెన్సీ టెస్ట్ ఇన్ ఆఫీస్ ఆటోమేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు గురువారం సాయంత్రం 5 గంటల తర్వాత కమిషన్ వెబ్‌సైట్ నుంచి తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. ఈ పరీక్షను ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొంది.

ఎన్‌టీఎస్ఈ ఫలితాల్లో శ్రీచైతన్య హవా

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 2018-19 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన ఎన్‌టీఎస్ఈ ఫైనల్ పరీక్షలో తమ విద్యార్థులు 112 మంది స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ డా.బి.యస్.రావు తెలిపారు. ఒకే సంస్థ నుంచి ఇంత మంది విద్యార్థులు దేశంలో మరెక్కడా ఎంపిక కాలేదని ఆయన పేర్కొన్నారు. తమ సంస్థ తరపున ఉపకార వేతనానికి ఎంపికైన మొత్తం విద్యార్థుల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 62 మంది, తెలంగాణ నుంచి 18 మంది, తమిళనాడు నుంచి నలుగురు, కర్ణాటక నుంచి 28 మంది ఉన్నారని వివరించారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి బి.యస్.రావు అభినందనలు తెలిపారు.

మరోసారి ల్యాండర్ కక్ష్య తగ్గింపు

జాబిలమ్మకు మరింత చేరువగా విక్రమ్ ల్యాండర్..

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చేపట్టిన చంద్రయాన-2 ప్రయోగంలో మూడో ఘట్టాన్ని కూడా శాస్త్రవేత్తలు విజయవంతం చేశారు. చంద్రయాన-2 మిషన్‌లోని విక్రమ్ ల్యాండర్‌ను జాబిలమ్మకు మరింత దగ్గరగా చేర్చేందుకు బుధవారం తెల్లవారుజాము 3.42 గంటలకు ఇస్రో శాస్త్రవేత్తలు రెండోసారి కక్ష్య దూరాన్ని తగ్గించారు. దీనికోసం ల్యాండర్‌లో నింపిన ఇంధనాన్ని తొమ్మిది సెకన్లపాటు మండించారు. బెంగళూరు సమీపంలోని బైలాలు మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు.. ఈ ప్రక్రియను నిర్వహించారు. ప్రస్తుతం ల్యాండర్ చంద్రుడికి దగ్గరగా 35 కిలోమీటర్లు, చంద్రుడికి దూరంగా 101 కిలోమీటర్ల ఎత్తులో దీర్ఘ వృత్తాకారంలో పరిభ్రమిస్తోంది. ఈ నెల ఏడోతేదీ అర్ధరాత్రి 1.30 గంటల నుంచి రెండున్నర గంటల్లోపు ల్యాండర్‌ను చంద్రుని ఉపరితలంపై మృదువుగా దించనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ల్యాండర్ తలుపులు తెరుచుకుని రోవర్(ప్రగ్యాన్) చంద్రుడి మీదకు దిగి 14 రోజుల పాటు తిరిగి వివిధ పరిశోధనలు చేసి సమాచారాన్ని సేకరించి భూ నియంత్రిత కేంద్రానికి పంపిస్తుంది. మరోవైపు.. ల్యాండర్‌ను వదిలిపెట్టిన ఆర్బిటర్ చంద్రుడి కక్ష్యలో చంద్రుడికి దగ్గరగా 96 కిలోమీటర్లు, చంద్రుడికి దూరంగా 125 కిలోమీటర్లు ఎత్తులో వృత్తాకార కక్ష్యలో పరిభ్రమిస్తూ ల్యాండర్ కదలికలను తెలియజేసే పనిలో నిమగ్నమై ఉంది.

పల్లెసీమల్లో ప్రత్యేక కార్యాచరణ

- 30 రోజుల ప్రణాళికకు సర్వం సిద్ధం
- పంచాయతీరాజ్ శాఖ అధికారులతో మంత్రి ఎర్రబెల్లి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: పల్లెసీమల్లో పచ్చదనం, పరిశుభ్రత సాధన ప్రధాన లక్ష్యంగా చేపడుతున్న 30 రోజుల ప్రణాళికకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మొదలుకానున్న ఈ కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఈ కార్యాచరణ ప్రణాళిక అమలుకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్, కమిషనర్ రఘునందన్‌రావు, సెర్ప్ సీఈవో పౌసమిబసు, ఇతర అధికారులతో పీఆర్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ప్రజాప్రతినిధులతో బుధ, గురువారాల్లో మంత్రి విస్తృత సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో 30 రోజుల ప్రణాళికతో పాటు కొత్త పీఆర్ చట్టం అమలుకు సంబంధించి పీఆర్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో 30 రోజుల ప్రణాళిక అమలు నేపథ్యంలో ప్రతి గ్రామానికి ప్రత్యేకాధికారిని నియమించారు. బుధవారం నుంచే ఆయా గ్రామాల బాధ్యతలను అధికారులకు అప్పగిస్తూ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. మండల పరిధిలోని ప్రతి గ్రామానికి ప్రత్యేకాధికారులు వెళ్లనున్నారు. ఆ గ్రామాలకు సంబంధించిన పనులన్నీ ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తారు.

చింత మొక్కలకు ప్రాధాన్యం: ఎర్రబెల్లి

హరితహారంలో భాగంగా గ్రామాల్లో విరివిగా చింత మొక్కలు పెంచాలని నిర్ణయించినట్లు ఎర్రబెల్లి తెలిపారు. గతంలో చింతపండు మన రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారని అన్నారు. చింతపండును కూడా కొనాల్సిన పరిస్థితి రాకుండా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో 1.20 కోట్ల చింత మొక్కలు పెంచాలన్న నిర్ణయాన్ని కచ్చితంగా అమలు చేస్తామని వెల్లడించారు. ప్రతి ఇంటికీ పండ్లు, పూల మొక్కలు, కరివేపాకు మొక్కలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఇళ్లలోకి దోమలు రాకుండా ఉండేలా ప్రతి ఇంటి యజమానికి అవగాహన కల్పించి, ఇందుకోసం 'మస్కిటో రొడెంట్' మొక్కలు అందిస్తామని పేర్కొన్నారు.

106 మంది ఉత్తమ ఉపాధ్యాయులు

- రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక చేసిన ప్రభుత్వం
- పాఠశాల, ఇంటర్, డిగ్రీ, యూనివర్సిటీ కేటగిరీల్లో ఎంపిక
- నేడు రవీంద్ర భారతిలో పురస్కారాల ప్రదానం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 106 మంది ఎంపికయ్యారు. జిల్లాల నుంచి అధికారులను పంపించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం.. 106 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఈ అవార్డులను అందజేయాలని నిర్ణయించింది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో వారికి పురస్కారాలు అందజేయనుంది. అవార్డు కింద రూ.10 వేల నగదుతోపాటు గోల్డ్ కోటెడ్ సిల్వర్ మెడల్, సర్టిఫికెట్ ప్రదానం చేయనుంది. పాఠశాల కేటగిరీలో 43 మందికి, జూనియర్ కాలేజీల్లో 10 మందికి, డిగ్రీ కాలేజీల కేటగిరీలో 20 మందికి, పాలిటెక్నిక్ కాలేజీల కేటగిరీలో ముగ్గురికి, వర్సిటీ కేటగిరీలో 30 మందికి అవార్డులు ఇవ్వనుంది.

అవార్డుకు ఎంపికైంది వీరే..

పాఠశాలల హెడ్‌మాస్టర్లు:

ఎం.దత్తాత్రేయ-తూప్రాన్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, కె.గంగాధర్-జెడ్పీహెచ్ఎస్ చౌట్‌పల్లి, ఎ.సైలా-జెడ్పీహెచ్ఎస్ ఎంకూర్(ఖమ్మం), బి.పద్మాకర్-జీహెచ్ఎస్ ఓల్డ్ జగిత్యాల, బి.శ్రీనివాస్-జెడ్పీహెచ్ఎస్ హయత్‌నగర్, ఎం.వేణుగోపాల్-ఎంపీపీఎస్ రంగంపేట్, ఎన్.మనోహర్‌స్వామి-జీహెచ్ఎస్ శాయంపేట్‌జాగీర్, కిషన్-పీఎస్ శ్రీసాయినగర్(మేడ్చల్ మల్కాజిగిరి), ఎన్.శ్రీధర్‌రెడ్డి-జెడ్పీఎస్ఎస్ లింబా(నిర్మల్), ఆర్.ఉదయ్‌రావు-జెడ్పీఎస్ఎస్ ఇచ్చోడ

స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, పీజీటీలు, టీజీటీలు:

ఎం.అరుణ-గురుకుల పాఠశాల బాలానగర్(మహబూబ్‌నగర్), డీజే డేనియల్-గురుకుల పాఠశాల బోరబండ, టి.సతీష్-జెడ్పీహెచ్ఎస్ మర్పడగ, పొట్రు రామకృష్ణ -ప్రభుత్వ రవీంద్రమోడల్ పీఎస్ సదాశివపేట్, బొమ్మ నగేష్-ఎంపీపీఎస్ నాగంవారిగూడెం(యాదాద్రి), పి.మహేందర్‌రెడ్డి-జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ శివనగర్(రాజన్న సిరిసిల్ల), ఎన్.అర్చన-ఎంపీపీఎస్ రెబ్బన్‌పల్లి(మంచిర్యాల), ఎస్.సుజాత-జెడ్పీఎస్ఎస్ ఎంకూర్(ఖమ్మం), పి.గంగామోహన్-జెడ్పీహెచ్ఎస్ పిల్లకొండ(నిజామాబాద్), సుందిల్ల రమేష్-ఎంపీపీఎస్ ఎర్రగట్టుపల్లి(మంచిర్యాల), కె.సైదయ్య-జెడ్పీహెచ్ఎస్ గన్నవరం(ఖమ్మం), జీబీ బదరీనారాయణ-జీబీపీఎస్ ఓల్డ్ మలక్‌పేట్, జె.సుదర్శన్-ఎంపీయూపీఎస్ దత్నూర్, పడాల మోహన్‌రావు-జెడ్పీఎస్ఎస్ లింగాపూర్(నిర్మల్), జి.శంకర్-ఎంపీపీఎస్ పోతారం(సిద్దిపేట్), ఆర్.యాకయ్య-ఎంపీపీఎస్ కోమటిపల్లి(మహబూబాబాద్), ఆర్.మల్లికార్జున్-ఎంపీపీఎస్ రాగడిమైల్వార్(వికారాబాద్), బడేపల్లి వెంకటయ్య-జెడ్పీహెచ్ఎస్ వాస్పుల(మహబూబ్‌నగర్), పి.బస్వంత్‌రావు-జెడ్పీహెచ్ఎస్ జుక్కల్(కామారెడ్డి), జి.కుశల్వరెడ్డి-జెడ్పీహెచ్ఎస్ కాసనగోడె(నల్లగొండ), ఐ.సుదర్శన్‌రావు-జెడ్పీహెచ్ఎస్ మాదన్నపురం(వనపర్తి), సీహెచ్ మల్లయ్య-జెడ్పీహెచ్ఎస్ చల్వాయి(ములుగు), కె.సురేందర్‌ప్రసాద్-జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ పెద్దపల్లి, ఎల్.దేవరాజు-జెడ్పీహెచ్ఎస్ పాలవరం(సూర్యాపేట్), కె.రామయ్య-జెడ్పీహెచ్ఎస్ తాటికొండ, కె.జగదీశ్వర్‌రెడ్డి-జెడ్పీహెచ్ఎస్ గర్షకుర్తి(కరీంనగర్), జి.రఘుపతిరావు-ఎంపీపీఎస్ మల్యాల(రాజన్నసిరిసిల్ల), సీహెచ్ శ్రీనివాస్-జెడ్పీహెచ్ఎస్ కట్టంగూర్, టి.అజయ్‌సింగ్-జెడ్పీహెచ్ఎస్ సమన్‌గుర్తి(వికారాబాద్), ఎ.సాగర్-జీహెచ్ఎస్ న్యూకాగజ్‌నగర్, సాదత్‌అలీ-జెడ్పీహెచ్ఎస్ ధర్మాజీపేట్(సిద్దిపేట్)

ఐఏఎస్ఈ/సీటీఈ/డైట్ లెక్చరర్లు, సీనియర్ లెక్చరర్లు..

ఎస్.లియాఖత్‌అలీ-గవర్నమెంట్ డైట్(మహబూబ్‌నగర్), ఎస్.ముండయ్య-గవర్నమెంట్ డైట్(కరీంనగర్)

ప్రిన్సిపాళ్లు..

ఎం.ఎస్.శ్యామలాదేవి-జీజేసీ మాడుగుల, గుండి రామానుజాచారి-జీజేసీ యాదగిరిగుట్ట, కొల్లు గోవిందరాజులు-జీజేసీ గాంధారి, ఎ.చిన్నయ్య-జీజేసీ బాల్కొండ

జూనియర్ లెక్చరర్లు..

ఆశాశర్మ-జీజేసీ జనగాం, కె.పర్వతాలు-జీజేసీ రాజేంద్రనగర్, మహ్మద్ జహంగీర్ అలీ-జీజేసీ మహబూబ్‌నగర్, మహ్మద్ ఇస్మాయిల్-కేపీఎం జీజేసీ బాయ్స్ నల్లగొండ, ఫరీసా ఆస్మా-బీజేఆర్ జీజేసీ గోల్కొండ, ఎస్.పద్మావతి-జీజేసీ మహేశ్వరం

ఓయూ పరిధిలో డిగ్రీ లెక్చరర్లు..

కె.ఆర్.రాధిక-సెయిట్ ఆన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్, కె.సిల్మానాయక్-సారస్వత పరిషత్తు, పి.రాజ్యలక్ష్మి-ఏఎంఎస్ కాలేజీ ఫర్ వుమెన్, విప్లవ్‌దత్ శుక్లా-సిటీ కాలేజ్, షేక్ యాకూబ్-సిటీ కాలేజ్, సీహెచ్ కాంచన లత-ఐపీ జీడీసీ నాంపల్లి, ఆర్.కోమల-సెయింట్ ఫియస్ డిగ్రీ కాలేజ్, ఆర్తి సింహా-సరోజిని నాయుడు డిగ్రీ కాలేజ్, అఫ్రరున్నీసా-జీడీసీ బేగంపేట్, కె.విజయ్‌కుమార్-జీడీసీ కూకట్‌పల్లి

కేయూ పరిధిలో డిగ్రీ లెక్చరర్లు..

కె.మల్లేశం-కే

యూరియా కోసం..

ఎరువుల కోసం రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. సరిపడా ఎరువులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర కొరత ఏర్పడింది. ఫలితంగా కొనుగోలు కేంద్రాల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండల కేంద్రంలో యూరియా కోసం మంగళవారం టోకెన్లు పంపిణీ చేయగా.. బుధవారం తెల్లవారుజాము నుంచే సొసైటీ గోదాం వద్ద రైతులు క్యూ కట్టారు.

-భీమ్‌గల్

ఆ గ్రామాలను దత్తత తీసుకుంటాం: ఎర్రబెల్లి

సాక్షి, జనగామ: ముప్పై రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను విజయవంతం చేసిన గ్రామాలను ప్రభుత్వం దత్తత తీసుకుంటుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామలో బుధవారం ప్రజాప్రతినిధుల అవగాహన సదస్సులో మాట్లాడుతూ సర్పంచ్ పంచాయతీలకు నిధులు ఇస్తామన్నారు.

AVANTHI P.G. College (AVNT)
AVANTHI Institute of Engineering & Technology (AVIH)
AVANTHI Postgraduate & Research Academy (APRA)
(Affiliated to OU/ JNTUH and approved by AICTE)
Gunthapally, Hayathnagar(M), R.R.Dist., Hyderabad.
Moosarambagh, Dilsukhnagar, Hyderabad
SPOT ADMISSIONS
MBA / MCA 2019-20
College Code: (AVNT / AVIH / APRA)
Eligible Candidates can attend for the Spot admission with Original Certificates along with photocopies on or before 06-09-2019 between 10 AM TO 5 PM.
Admissions will be made as per guidelines give by the Convener. ICET 2019.
Ph: 040-24044725/ 66414450, 9866466009, 9963777979, 9866664631, 9849265500.
Sd/- PRINCIPAL

SBI
Internal Audit Department, Hyderabad.
ENGAGEMENT OF CHARTERED ACCOUNTANT FIRMS & BANK'S RETIRED OFFICERS AS CONCURRENT AUDITORS
Applications are invited from eligible **Chartered Accountant Firms and Retired Officers of SBI** (including Retired Officers of Associate Banks of SBI) for empanelment as Concurrent Auditors in the identified Bank branches/outfits. Proforma for application, eligibility criteria and other details are available under **'Procurement News'** in Bank's website **www.sbi.co.in**
Place: Hyderabad
Date: 05.09.2019
Sd/-
Dy. General Manager (HR, Admin & Operations)

'యురేనియం'కు పరిస్థితి ప్రతికూలమే!

సాక్షి, హైదరాబాద్: నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం నిక్షేపాల వెలికితీత ప్రయత్నాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నిల్వల అన్వేషణకు సంబంధించిన సర్వే నిర్వహణకు కూడా స్థానిక పరిస్థితులు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులు అనుకూలంగా లేవని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర అటవీశాఖ లేఖ పంపించనున్నట్టు అధికారవర్గాల సమాచారం. ప్రతిపాదిత డ్రిల్లింగ్ ప్రాంతాలకు వెళ్లేందుకు చాలా చోట్ల బండిబాటలు కూడా లేవని, ఈ ప్రాంతాలన్నీ ఎక్కువగా ప్రధాన అటవీ ప్రాంతం పరిధిలో ఉన్నందున సర్వేకు అనుమతించినా పులుల అభయారణ్యానికి, అడవికి, పర్యావరణానికి, చెంచులు, ఇతర ఆదివాసీలకు, జీవవైవిధ్యానికి నష్టం జరుగుతుందని కేంద్రానికి పంపనున్న లేఖలో స్పష్టం చేయనుంది. యురేనియం అన్వేషణ చేపట్టే ప్రాంతం, అందుకు అనుసరించే పద్ధతులు, ఇతరత్రా అంశాలు కేంద్ర అటవీ సంరక్షణ చట్టం పరిధిలోకి రానున్నందున, ఇందుకు సంబంధించి అవసరమైన క్లియరెన్స్‌లు, ఇతర అనుమతులు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని తెలియజేయనున్నట్టు సమాచారం. అమ్రాబాద్, ఉడుమిల్ల, నారాయణ్‌పూర్ బ్లాక్‌ల పరిధిలో 83 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 4 వేల బోర్లు వేసేందుకు అటమిక్ మినరల్ డైరెక్టరేట్ (ఏఎండీ) తాజా ప్రతిపాదనలు పంపించిన విషయం తెలిసిందే.

ప్రతిపాదిత డ్రిల్లింగ్ ప్రాంతాలకు చేరుకోవడం కష్టమే

- రాజకీయ, సామాజిక, ప్రజా సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత
- ఏఎండీ, కేంద్ర ప్రభుత్వాలకు లేఖ రాయనున్న రాష్ట్ర ప్రభుత్వం
- టైగర్ రిజర్వ్, అడవిపై పడే దుష్ప్రభావాలను పరిశీలించాకే తదుపరి నిర్ణయం

తీవ్రమైన ఒత్తిడి

యురేనియం వెలికితీతను వెంటనే చేపట్టకపోయినా.. ఈ నిల్వల అన్వేషణ కోసం సర్వేకు ఆమోదం తెలపడం వల్ల కూడా నల్లమల అటవీ ప్రాంతంపై దుష్ప్రభావం పడుతుందని.. దీనికి అనుమతివ్వొద్దంటూ రాజకీయ పార్టీలు, ఎన్జీవోలు, ప్రజాసంఘాలు, పర్యావరణ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రతికూల పరిస్థితులున్నాయని, సర్వే వల్ల కూడా అటవీ, పర్యావరణ నష్టాలతోపాటు ఆదివాసీలకు కీడు జరుగుతుందని అందుకు అనుమతినివ్వలేమని కేంద్రం, ఏఎండీలకు అటవీశాఖ నివేదించనున్నట్టు అధికారులు చెబుతున్నారు. 4వేల బోర్లను వేయడం ద్వారా ఏఎండీ ఆధ్వర్యంలో చేపట్టే సర్వే వల్ల 4బ్లాక్‌ల్లోని అటవీప్రాంతం, జీవవైవిధ్యం, పర్యావరణంలో ముడిపడిన అంశాలు.. ఇలా నల్లమల అడవులపై పడే దుష్ప్రభావం, ఇతరత్రా ప్రమాదాలపై నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల పరిధిలోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, జిల్లా అటవీ అధికారులు, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ల ద్వారా అటవీశాఖ సవివరమైన నివేదికలు తీసుకుంటోంది.

అన్ని అంశాలను పరిశీలించాకే..

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

రాష్ట్రంలోని అటవీ ప్రాంతంలో యురేనియం అన్వేషణ సర్వేలకు అనుమతినిచ్చేముందు దానితో ముడిపడిన అన్ని అంశాలను పరిశీలించాల్సి ఉంటుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. ఈ నిల్వల అన్వేషణ వల్ల టైగర్ రిజర్వ్‌కు, అడవిపై, జంతువులపై ప్రభావాన్ని అంచనావేశాకే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు సర్వే వల్ల ఏమైనా ఇబ్బందులు కలుగుతాయా? అడవిపై దుష్పరిణామాలు ఏమైనా ఉంటాయా? స్థానికంగా ఉన్న పరిస్థితులేంటి? తదితర విషయాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేశాకే ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న దానిపై స్పష్టత వస్తుందన్నారు.

SALE NOTICE
M/s SOUTHERN ONLINE BIO TECHNOLOGIES LIMITED (in Liquidation)
#A3, 3rd Floor, Office Block, Samrat Commercial Complex, Saifabad, Hyderabad-500004, TG, India.
E-AUCTION (UNDER INSOLVENCY & BANKRUPTCY CODE, 2016)
Sale of the Company **M/s. Southern Online Bio Technologies Limited** (in Liquidation) as a going concern or the assets (incl.division wise business units) of the company bythe Liquidator, Kalpana G, appointed by the **Hon'ble National Company Law Tribunal, Hyderabad Bench** vide order dated **16th July, 2019.** Interested Applicants may refer to the details of the Auction in **COMPLETE E-AUCTION PROCESS DOCUMENT** uploaded on website of the Corporate Debtor **www.sol.net.in** and also E-auction website on **https://ncltauction.auctiontiger.net.** The Auction Sale will be done through the E-Auction platform (With unlimited extension of 10 mins each): **https://ncltauction.auctiontiger.net.**

Description	Manner of Sale	Inspection Date	Date and Time of Auction	Reserve Price (INR)	EMD Amount & Documents submission deadline
Company as a whole	As going concern	Before 13th September, 2019	20th September, 2019 11.30 to 3.30	57.28 Crs	5.73 Crs on or before 16th September, 2019
(OR)					
Vizag Bio-Diesel Unit	Asgoing concern	Before 13th September, 2019	20th September, 2019 1.30 to 5.30	44.11 Crs	4.41 Crs on or before 16th September, 2019
Nalgonda Bio-Diesel Unit	As going concern	Before 13th September, 2019	20th September, 2019 1.30 to 5.30	9.77 Crs	0.98 Crs on or before 16th September, 2019
Internet Service Provider Unit (incl. Office Premises at 3rd Floor)	As going concern	Before 13th September, 2019	20th September, 2019 1.30 to 5.30	1.55 Crs	0.16 Crs on or before 16th September, 2019
Office Premises area admeasures to 4252.78 s.ft. (5th Floor)	As an Asset	Before 13th September, 2019	20th September, 2019 1.30 to 5.30	1.85 Crs	0.19 Crs on or before 16th September, 2019

For detailed terms & conditions of E-Auction sale, refer **COMPLETE E-AUCTION PROCESS DOCUMENT** available on **https://ncltauction.auctiontiger.net** and **www.sol.net.in** or email to the Liquidator.
For E-Auction details, contact **Mr. Tilak Maratha (+91-6351896834/079-61200586), Ms. Neha Gyani (079-61200574) or Liquidator. E-Mail:- neha.gyani@auctiontiger.net, tilak.maratha@auctiontiger.net.** Interested bidders are requested to visit the above mentioned websites and submit a bid.
Kalpana G
Liquidator
M/s. Southern Online Bio Technologies Limited
IBBI Reg. No.:IBBI/IPA-001/IP-P00756/2017-18/11288
Email ID: sbtlip3@gmail.com; kalpanagonugunta1@gmail.com
Contact No.: 9962568858, 8247501961
Date: 05/09/2019
Place: Hyderabad

కన్నీటి వీడ్కోలు

ప్రభుత్వ లాంఛనాలతో ముత్యంరెడ్డి అంత్యక్రియలు

సాక్షి, సిద్దిపేట: మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్‌లోని వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్, కలెక్టర్ వెంకట్రామిరెడ్డి పర్యవేక్షణలో సంతాప సూచకంగా పోలీసు సిబ్బంది మూడు రౌండ్లను గాలిలో కాల్చారు. దుబ్బాక, తుక్కాపూర్ గ్రామాల్లో సంతాప సూచకంగా బంద్ నిర్వహించారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సోలిపేట రామలింగారెడ్డి, మదన్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం దామోదర సునీతాలక్ష్మారెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని సంతాపం తెలిపారు.

కదంతొక్కిన రైతులు

చొప్పదండిలో మహాధర్నా

గాయత్రి పంప్‌హౌస్ నుంచి చెరువులు నింపాలని డిమాండ్

చొప్పదండి: కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామ రైతులు సాగునీటి కోసం కదంతొక్కారు. బుధవారం ఉదయం స్కూల్ బస్సులను గ్రామంలోకి రాకుండా అడ్డుకున్న రైతులు.. వాహనాల్లో చొప్పదండికి చేరుకున్నారు. గుమ్లాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. రెండున్నర గంటలపాటు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం కలిగి కిలోమీటరు పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ ఉషావిశ్వనాథ్ రైతుల ఆందోళనను విరమించేందుకు విఫలయత్నం చేశారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్ వారితో మాట్లాడారు. మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అయితే.. చెరువులను లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్ ద్వారా నింపుతామని లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని రైతులు స్పష్టం చేశారు. పోలీసులు లాఠీచార్జీ చేసి చెదరగొట్టి.. బలవంతంగా స్టేషన్‌కు తరలించారు.

చొప్పదండిలో బుధవారం మహాధర్నాలో పాల్గొన్న గుమ్లాపూర్ రైతులు

నేడు మెదక్ చర్చికి క్రైస్తవ సంఘాల పీఠాధిపతి

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్‌లోని సీఎస్ఐ చర్చిను గురువారం ప్రపంచ క్రైస్తవ సంఘాల పీఠాధిపతి ఆర్చ్ బిషప్ ఆఫ్ కాంటర్బరీ డాక్టర్ జస్టిన్ వెల్‌బీ సందర్శించనున్నారు. కేరళ, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో పర్యటించిన ఆయన గురువారం మెదక్ చర్చికి వస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ జస్టిన్ వెల్‌బీతోపాటు ఆయన సతీమణి కూడా వస్తున్నట్లు వారు చెప్పారు. ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 6.30 వరకు ఆయన చర్చిలో ఉంటారని తెలిపారు. కాగా పీఠాధిపతి రాక సందర్భంగా చర్చి ప్రాంగణంలో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

సర్కారు ఆస్పత్రులకు కేంద్రం గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: అత్యున్నత నాణ్యత ప్రమాణాలు పాటించిన పలు సర్కారు ఆసుపత్రులకు కేంద్రం గుర్తింపునిచ్చింది. అందులో భాగంగా రాష్ట్రంలో 35 ప్రభుత్వ ఆసుపత్రులు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాష్) ధ్రువీకరణ పత్రాలు పొందాయి. నాణ్యత ధ్రువీకరణ పత్రాలు పొందిన ఆసుపత్రుల అభివృద్ధికి కేంద్రం నిధులు ఇస్తుంది. వాటిల్లో పనిచేసే వైద్య సిబ్బందికి ప్రోత్సాహకాలు ఇస్తుంది. గతంలో ఖమ్మం జిల్లా ఆసుపత్రి, భద్రాచలం, బాన్సువాడ ఏరియా ఆసుపత్రులు సహా పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఎన్‌క్వాష్ సర్టిఫికెట్లు పొందాయి. కొత్తగా ఎన్‌క్వాష్ సర్టిఫికెట్లు పొందిన ఆసుపత్రులు అనేకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే ఉండటం గమనార్హం. బిక్నూరు, దేవరకొండ, హన్వాడ , బొమ్మలరామారం, కొండమడుగు, ధర్మాసాగర్, గోపాల్‌పూర్, ధరూర్, మనూపాడు, ఎర్రగుంట, గండంపల్లి, కంభాలపల్లి, కంగ్టి, రఘునాథపల్లి, ఘన్‌పూర్, తాండూరు, కత్లాపూర్, మేడిపల్లి, గారెపల్లి, జైపూర్, శంకరంపట్నం, లీజా, గట్టు, ఆత్మకూర్, సంగెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎన్‌క్వాష్ సర్టిఫికెట్లు అందినట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. అలాగే సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి కూడా సర్టిఫికెట్ వచ్చింది. గతంలో 39 దవాఖానాలకు ఈ ఎన్‌క్వాష్ సర్టిఫికెట్లు ఉండగా, ప్రస్తుత సర్టిఫికెట్లతో ఆస్పత్రుల సంఖ్య 74కు చేరింది. దీంతో ఈ సర్టిఫికెట్లు పొందడంలో దేశంలోనే తెలంగాణ టాప్‌గా నిలిచింది.

ఒక్కో పడకకు రూ.10 వేలు

ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ పొందిన ఆస్పత్రులకు ఒక్కో పడకకు ఏటా రూ.10 వేల చొప్పున మూడేళ్లపాటు కేంద్రం నిధులు మంజూరు చేస్తుంది. ఉదాహరణకు ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో 400 బెడ్లు ఉన్నాయి. గతేడాది ఈ ఆసుపత్రి ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ పొందింది. దీంతో సంవత్సరానికి ఆ ఆసుపత్రికి కేంద్రం రూ.40 లక్షలు చెల్లిస్తుంది. ఇందులో 75 శాతం ఆసుపత్రి అభివృద్ధికి ఉపయోగించాల్సి ఉంటుంది. మిగిలిన 25 శాతాన్ని సిబ్బందికి ప్రోత్సాహకంగా ఇస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పడకలతో సంబంధం లేకుండా ఏడాదికి రూ. 2 లక్షలు, 24 గంటలపాటు సేవలందించే వాటికి రూ. 3 లక్షలు కేటాయిస్తారు. కేంద్ర అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు ప్రమాణాల్లో తేడా వస్తే సర్టిఫికెట్ ఉపసంహరించుకుంటారు.

Notification for Expression of Interest
- Expression of Interest (EOI) is called from the interested candidates for the following Expert posts on contract basis in PMU of APILIP-II under JICA assisted.
  1. M&E Consultant / Documentation Consultant - 1 No.
  2. Food Processing Consultant - 1 No.
- Terms of references (TOR) and other formats for the experts are available on the project website http://apcada.in (or) Any Queries contact, 0866-2572746 & 9490958603.
- Interested candidates shall submit their CVs before 5.00 p.m. on 16/09/2019.

Sd/- 28-08-2019, Commissioner, CADA, Water Resources Department, Vijayawada
Dipr RO No. 124PP/CL/Advt/1/1/2019-20, Dt : 04-09-2019

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayIndia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ : www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును
ఇ-టెండరు ప్రకటన నం.10,11,12,13 & 14/2019/Parking
గుంటూరు డివిజన్‌లోని దిగువ తెలిపిన ప్రదేశాల వద్ద మూడు సంవత్సరాల కాలానికి పార్కింగ్ కాంట్రాక్టులు ఇవ్వడానికి భారత రాష్ట్రపతి తరుపున సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్ వారు **www.ireps.gov.in** ద్వారా ఆసక్తిగల పార్టీల నుండి ఇ-టెండర్లు కోరుతున్నారు. ప్రదేశాల వివరాలు దిగువ విధంగా ఉన్నవి:
IREPS అప్లికేషన్‌లో అనుమతించిన ప్రకారం ఆన్‌లైన్ విధానాల ద్వారా టెండరు కోసం దిగువ నిర్దేశించిన విధంగా టెండరుదారులందరూ టెండరు ఫారం ధర మరియు బయానాను మల్టిపుల్ బ్యాంకులు: నెట్‌బ్యాంకింగ్/ డెబిట్ కార్డ్ మరియు క్రెడిట్ కార్డు ద్వారా మాత్రమే చెల్లించవలసిందిగా కోరబడుచున్నారు.

క్ర. సం.	స్టేషన్	ప్రదేశం	రిజర్వు ధర (రూ.)	కేటాయించిన విస్తీర్ణం	టెండరు డాక్యుమెంట్ ధర (రూ.)	బయానా (రూ.)
1	రేపల్లె-టర్స్	సర్క్యులేటింగ్ ఏరియా	8,66,225/-	999 చ.మీ.	2800/- GST తో సహా	2,59,900/-
2	చిన్నరావూరు	సర్క్యులేటింగ్ ఏరియా	87,609/-	200 చ.మీ.	2800/- GST తో సహా	26,300/-
3	పిడుగురాళ్ళ-ప్రీమియమ్	సర్క్యులేటింగ్ ఏరియా	49,125/-	150 చ.మీ.	2800/- GST తో సహా	14,800/-
4	నడికుడి - ప్రీమియమ్	సర్క్యులేటింగ్ ఏరియా	41,876/-	240 చ.మీ.	2800/- GST తో సహా	12,600/-
5	నల్లొండ - ప్రీమియమ్	సర్క్యులేటింగ్ ఏరియా	81,745/-	172.38 చ.మీ.	2800/- GST తో సహా	24,600/-

పై టెండరుకు సంబంధించి పూర్తి వివరాలు టెండర్ పోర్టల్ http://www.ireps.gov.in లో లభిస్తాయి.

ముఖ్యమైన తేదీలు

ముగింపు తేది, సమయం	27-09-2019న 15:00 గం॥కు.
సంప్రదించు అధికారి	సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, డివిజినల్ రైల్వే మేనేజర్ కార్యాలయం, గుంటూరు డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు-6

పైన తెలిపిన పోర్టల్ ద్వారా విడుదల చేసిన టెండర్ల కోసం ఆన్‌లైన్ బిడ్లు డిజిటల్‌గా సంతకం చేయవలసి ఉంటుంది.
తదుపరి వివరాల కోసం మీరు దిగువ సంతకందారు కార్యాలయాన్ని ఏ పనిరోజునైనా సంప్రదించవచ్చును. ప్రకటన వెబ్‌సైట్ **http://www.ireps.gov.in** లో అప్‌లోడ్ చేయబడింది.
A1472
సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, గుంటూరు

మెరిసిన ఎర్ర బంగారం

క్వింటాలుకు రూ. 15,550

వరంగల్: వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం మిర్చి తేజ రకం క్వింటాల్‌కు రూ.15,550 ధర పలికింది. మం గళవారం రూ.11 వేలు పలకగా బుధవారం రికార్డు స్థాయి ధర పలికిందని మార్కెట్ అధికారులు తెలిపారు. ఖమ్మంలో ఇదేరకం మిర్చికి రూ.16వేల నుంచి 17 వేలకు పైగా ధరలు పలికినట్లు సమాచారం ధర పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా...

వాగ్దానాల అమల్లో సర్కార్ విఫలం: చాడ

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతుల్లో సగం మందికి కూడా రైతుబంధు పథకం కింద ఆర్థిక సాయం అందలేదని ఆరోపించారు. బుధవారం మఖ్దూంభవన్‌లో పార్టీ నేత అజీజ్‌పాషాతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాకపోవడంతో వారు మళ్లీ ఎక్కువ వడ్డీకి ప్రైవేట్ రుణాలు తీసుకుని అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల పంపిణీ, రైతుబంధు వంటి అనేక వాగ్దానాల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై టీఆర్ఎస్ ప్రభుత్వం మాట్లాడటం లేదని, ఏపీలో జగన్ ప్రభుత్వం ఈ విషయంలో చకచకా చర్యలు తీసుకుంటోందన్నారు.

కళ్లకు గంతలు కట్టుకున్నారా?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం విషజ్వరాలతో మగ్గుతుంటే సీఎం కేసీఆర్, వైద్య ఆరోగ్య మంత్రి ఈటల రాజేందర్‌లు కళ్లకు గంతలు కట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు మలేరియా, డెంగీ, ఇతర విషజ్వరాల బారిన పడి అల్లాడిపోతున్నా వారి కళ్లకు కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలసి విలేకరులతో మాట్లాడుతూ.. ఈటల రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతున్నట్లు అనిపిస్తోందన్నారు. టీఆర్ఎస్ ఓనర్ల పంచాయితీలో పడి ఆయన ప్రజల జ్వరబాధలను పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించారు. పార్టీ ఓనర్‌షిప్ రాజకీయాలను పక్కన పెట్టి సీఎం, ఆరోగ్య మంత్రి ప్రజలకు అందాల్సిన వైద్య చికిత్సలు, రాష్ట్రంలోని ఆరోగ్య పరిస్థితులపై దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రులన్నీ దుర్భరంగా ఉన్నాయన్నారు. రాష్ట్రం మొత్తం మరణాల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని, ఒక్క ఖమ్మం జిల్లాలోని నాగులవంచ, పందిళ్లపల్లి గ్రామంలో ఒకే నెలలో 18 మంది చనిపోయారన్నారు.

చరిత్ర చూసుకుని బాధ్యతలు అప్పగించండి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడి నియామకంలో వ్యక్తుల చరిత్ర చూసి బాధ్యతలు అప్పగించాలని కాంగ్రెస్ అధిష్టానానికి ఆ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్త వ్యక్తి నియామకం జరిగిపోయిందంటూ జరుగుతున్న ప్రచారంపై ఏఐసీసీ పెద్దలు స్పందించాలని కోరారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కొంత మంది ఉద్దేశపూర్వకంగా ఈ విషయంలో హైప్ క్రియేట్ చేస్తున్నారని, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తే అక్కడ కాబోయే సీఎం అంటూ ప్రచారం చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి నియామకం విషయంలో అధిష్టానం క్షేత్రస్థాయిలో సంప్రదింపులు జరపాలని కోరారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి: ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పీఆర్సీ అమలు, ఐఆర్ సాధన, సీపీఎస్ రద్దు కోసం ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఐక్య ఉద్యమాలకు సిద్ధమవ్వాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు నెల రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. గతేడాది ఆగస్టు 15న పీఆర్‌సీ ఇస్తామని సీఎం ప్రకటించారని, కానీ ఇప్పటికీ పీఆర్‌సీ అమలు చేయకపోగా కనీసం ఐఆర్ కూడా ప్రకటించలేదని విమర్శించారు. కొత్త జోన్ల ప్రకారం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ టీచర్లకు, జూనియర్ కాలేజీల్లో పనిచేసే కాంట్రాక్టు లెక్చరర్లకు బదిలీలు నిర్వహించాలని కోరారు.

14న దత్తాత్రేయకు బీసీ సంఘం సన్మానం

సాక్షి, హైదరాబాద్: హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా నియమితులైన బండారు దత్తాత్రేయకు ఈ నెల 14న రవీంద్రభారతిలో బీసీ సంక్షేమ సంఘం తరపున సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కేంద్రప్రభుత్వం నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌లను నియమిస్తే అందులో ఇద్దరు బీసీలు ఉండటం శుభపరిణామమన్నారు.

జిల్లాల్లో యూరియా ఫైట్

- పాత జిల్లా స్టాక్ పాయింట్ల నుంచి కొత్త జిల్లాలకి కదలని స్టాక్
- కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అడ్డుకుంటున్న వైనం
- కొత్త జిల్లాలకు కేటాయింపులు నిలిచిపోవడంతో రైతుల గగ్గోలు
- అవసరం లేకపోయినా నిల్వలను దాచిపెడుతున్న కొందరు నాయకులు
- చక్కదిద్దడంలో వ్యవసాయాధికారుల విఫలం... నిజామాబాద్ డీఏవోకు నోటీసు
- మార్క్‌ఫెడ్ వద్ద అడుగంటిన యూరియా... 20 వేల టన్నులే స్టాక్

సాక్షి, హైదరాబాద్: పాత జిల్లాలకు, కొత్త జిల్లాలకు మధ్య యూరియా పోరు నడుస్తోంది. పాత జిల్లాల్లోని మార్క్‌ఫెడ్ స్టాక్ పాయింట్ల నుంచి కొత్త జిల్లాలకు సరఫరా కావాల్సిన యూరియాను అనేకచోట్ల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు అడ్డుకుంటున్నారు. కొన్ని జిల్లాల కలెక్టర్లయితే స్టాక్ వెళ్లనీయకుండా లిఖిత పూర్వక ఆదేశాలు జారీచేస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు కూడా తమ ప్రాంతానికే దక్కాలని మొండిపట్టు పడుతున్నారు. దీంతో అనేక కొత్త జిల్లాలకు సరఫరా నిలిచిపోతోంది. ఫలితంగా కొత్త జిల్లాలను యూరియా కొరత పట్టి పీడిస్తోంది. దీంతో ఆయా జిల్లాల రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఫలితంగా యూరియా నల్లబజారుకు తరలిపోయింది. దీంతో ఒక్కసారిగా యూరియా ధర పెరిగింది. ఇటీవల వర్షాలు కురవడం, వరి నాట్లు గణనీయంగా పడటం, యూరియా వినియోగం పెరగడంతో పాత జిల్లాల రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొందరు మంత్రులు కూడా తమ నియోజకవర్గం ఉన్న జిల్లాకే ప్రాధాన్యమిస్తున్నారు. రాష్ట్రానికి మొత్తం ప్రాధాన్యమివ్వాల్సిన రాజ్యాంగపరమైన కీలక పదవిలో ఉన్న ఒక ప్రముఖుడు కూడా తన గ్రామం ఉన్న జిల్లాకే ప్రాధాన్యమివ్వాలని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తేవడం గమనార్హం.

బఫర్‌స్టాక్ పాయింట్లు పాత జిల్లాల్లోనే

ఈసారి ఖరీఫ్‌లో 19.40 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు లక్ష్యంగా వ్యవసాయశాఖ ప్రణాళిక రచించింది. అందులో యూరియానే 8.50 లక్షల మెట్రిక్ టన్నులు ఉంది. గత నెల రాష్ట్రానికి 2.21 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉండగా, కేవలం 1.04 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. ఇక ప్రస్తుత సెప్టెంబర్ నెలకు రెండు లక్షల టన్నుల యూరియాను కేటాయించాలని వ్యవసాయశాఖ కేంద్రాన్ని కోరిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రాష్ట్రంలో 60 వేల మెట్రిక్ టన్నుల యూరియానే అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. మార్క్‌ఫెడ్ వద్ద ఎల్లప్పుడూ 2.5 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా యూరియా బఫర్ స్టాక్‌గా ఉండాలి. కేంద్రం నుంచి రాకపోవడం, ఉన్న నిల్వలను రైతులకు అందజేయడంతో స్టాక్ 20 వేల మెట్రిక్ టన్నులకు పడిపోయింది. దీంతో ఒక్కసారిగా కొరత ఏర్పడింది. మరోవైపు మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్ పాయింట్లన్నీ కూడా పాత జిల్లాల్లోనే ఉన్నాయి. ఆయా స్టాక్ పాయింట్ల నుంచే కొత్త జిల్లాలకు యూరియా సరఫరా కావాలి. ఇక్కడే సమస్య వచ్చిపడింది. కొరత తీవ్రత కారణంగా పాత జిల్లాల స్టాక్ పాయింట్ల నుంచి కొత్త జిల్లాలకు యూరియా సరఫరాను కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు అడ్డుకుంటున్నారు. 'మాకే కొరతగా ఉంది. పక్క జిల్లాకు ఎలా పంపుతాం'అని కొందరు కలెక్టర్లే అంటుండటం గమనార్హం. కొత్త జిల్లాల కోటాను కూడా పాత జిల్లాలే ఇలా వాడుకోవడంతో పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ఉదాహరణకు నిజామాబాద్ జిల్లా స్టాక్ పాయింట్ నుంచి కామారెడ్డి జిల్లాకు యూరియాను పంపకూడదని అక్కడి జిల్లా అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడంలో అక్కడి జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) విఫలం కావడంతో వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా ఆయనకు నోటీసులు జారీ చేశారు.

నాయకుల తీరుపై మండిపాటు

ఆయన వ్యవసాయశాఖ పరిధిలోని ఒక కార్పొరేషన్‌కు చైర్మన్. తన ప్రాంత పరిధిలోని వ్యవసాయ సహకార సొసైటీకి అవసరమున్నా లేకపోయినా అత్యధికంగా యూరియా కేటాయింపులు చేసుకున్నాడు. అంతేకాదు తనకు సన్న యూరియానే కావాలని పట్టుబట్టి కేటాయించుకున్నాడు. పక్క జిల్లాకు తనకు సంబంధం లేదని వాదన పెట్టుకున్నాడు. అలాగే అదే శాఖలో మరో కార్పొరేషన్‌కు చైర్మన్‌గా ఉన్న నాయకుడి వ్యవహారశైలి కూడా అలాగే ఉంది. తన జిల్లాకే ప్రాధాన్యం ఇవ్వాలని, పక్క జిల్లాకు 500 టన్నులు పంపాల్సి ఉన్నా దాన్ని అడ్డుకుంటున్నారని వ్యవసాయశాఖ వర్గాలు ఆవేదన చెందుతున్నాయి. ఆ కార్పొరేషన్ చైర్మన్ ఏకంగా వ్యవసాయ కమిషనర్‌ను కలిసి ఈ మేరకు విన్నవించినట్లు తెలిసింది. ఇక గడ్డకట్టిన యూరియా తమకు వద్దని, వేరే చోటకు పంపాలని కూడా నాయకులు పట్టుబడుతున్నారు. జిల్లాల మధ్య పోరు, కొందరు నాయకుల తీరు వల్ల కృత్రిమ కొరత తలెత్తిందన్న విమర్శలున్నాయి. దీంతో యూరియా బస్తా ధర అదనంగా రూ. 50 నుంచి రూ. 100 వరకు పెరిగింది. దీన్ని కొందరు డీలర్లు, మార్క్‌ఫెడ్ అధికారులు సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

యూరియా కొరత లేదు

రాష్ట్రంలో యూరియా కొరత లేదని వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్ బొజ్జ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగస్టులో 2.2 లక్షల టన్నుల కేటాయింపులకు గాను ఎరువుల కంపెనీ నుంచి 1.12 లక్షల టన్నులు, మార్క్‌ఫెడ్ వద్ద ఉన్న బఫర్ స్టాక్ 1.25 లక్షల టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసేందుకు అందుబాటులో ఉంచామన్నారు. సెప్టెంబర్ నెలకు లక్ష టన్నులే అవసరమైనప్పటికీ.. ముందుచూపుతో 2 లక్షల టన్నులు కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. సెప్టెంబర్ మొదటివారంలో 18 ర్యాక్‌ల యూరియాను కేంద్ర ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు. బుధవారం నాటికీ 15 వేల టన్నుల యూరియాను అన్ని జిల్లాలకు పంపినట్లు తెలిపారు. యూరియా నౌకల ద్వారా రావడంతో ఆలస్యమైనందుకే అసౌకర్యం కలిగిందని, వాస్తవంగా యూరియా కొరత రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు.

బుధవారం హైకోర్టు వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హైకోర్టులో నిరసన

- రెండో రోజూ కేసుల విచారణకు హాజరుకాని న్యాయవాదులు
- జస్టిస్ సంజయ్‌కుమార్‌కు సీజేగా పదోన్నతి ఇవ్వాలని ప్లకార్డుల ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్‌ను పంజాబ్-హరియాణా హైకోర్టుకు బదిలీ చేయాలన్న సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సును రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు విధులను బహిష్కరించడంతో బుధవారం హైకోర్టు కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి. రాష్ట్రంలోని పలు కింది కోర్టుల్లోనూ ఇలాగే విధుల బహిష్కరణ జరిగింది. ఉదయం హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభం కాగానే న్యాయవాదులందరూ ప్రతీ కోర్టు హాలుకు వెళ్లి విధుల బహిష్కరణకు సహకరించాలని న్యాయమూర్తులను కోరారు. దీంతో న్యాయమూర్తులందరూ బెంచీలు దిగి తమ చాంబర్లకు వెళ్లిపోయారు. అనంతరం జస్టిస్ సంజయ్‌కుమార్ విషయంలో సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయాన్ని న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని హైకోర్టు వద్ద ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు హైకోర్టు న్యాయవాదుల సంఘం సర్వసభ్య సమావేశం మరోసారి జరిగింది. సోమవారం తమ కార్యాచరణను ప్రకటిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యకరణ్‌రెడ్డి తెలిపారు.

సుప్రీం సీజేను కలిసే ప్రయత్నాలు..

జస్టిస్ సంజయ్‌కుమార్ బదిలీ విషయంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం, సీనియర్ న్యాయవాదుల బృందం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌ను కలవాలని నిర్ణయించారు. అలాగే రాష్ట్రపతి, న్యాయ మంత్రిని కూడా కలిసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఆందోళన విషయాన్ని సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జికి తెలియజేయాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా, రంగారెడ్డి జిల్లా బుద్వేలు గ్రామానికి హైకోర్టు తరలించాలని, ఆ గ్రామంలో హైకోర్టుకు కొత్త భవనాలు నిర్మించాలనే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హైకోర్టు పరిరక్షణ సమితి పేరిట న్యాయవాదుల నిరసన కార్యక్రమం అయిదో రోజు బుధవారం కూడా కొనసాగింది. తరలింపు ఇప్పట్లో జరగదని, న్యాయవాదులకు కొత్త చాంబర్లు నిర్మిస్తామని ప్రధాన న్యాయమూర్తిని కలసినప్పుడు తమకు చెప్పారని న్యాయవాదులు తెలిపారు.

ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ మద్దతు..

జస్టిస్ సంజయ్‌కుమార్ బదిలీని రద్దు చేయాలని ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయవాదుల సంఘం సమావేశం కోరింది. గురు, శుక్రవారాలు 2 రోజులు కోర్టులకు హాజరుకారాదని నిర్ణయించింది. సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ బదిలీ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, వేరే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేయాలని సమావేశం కోరింది.

ఈఆర్సీని వెంటనే నియమించండి

సీఎంకు ఎంపీ రేవంత్‌రెడ్డి లేఖ

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్సీ) ఏర్పాటు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎంపీ రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం సీఎంకు బహిరంగ లేఖ రాశారు. ఆర్థిక సంవత్సరం నాలుగు నెలలకు ముందు ఈఆర్సీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి రావాల్సి ఉందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నా గత ఐదేళ్లలో ఎప్పుడూ సకాలంలో ఇది జరగలేదని ఆయన ఎద్దేవా చేశారు. 'లోకాయుక్త, మానవ హక్కుల సంఘం ప్రత్యక్ష ఉదాహరణలుగా ఐదున్నరేళ్ల మీ పాలనలో రాష్ట్రంలోని పలు కీలక సంస్థలు స్వతంత్రతను కోల్పోయాయి. రాజ్యాంగబద్ధ వ్యవస్థలు అస్తిత్వ ప్రమాదంలో పడ్డాయి. ఈఆర్సీ లేక ఎనిమిది నెలలవుతోంది. చైర్మన్, సభ్యుల పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. వాస్తవానికి ఈ ఏడాది నవంబర్ 2 కల్లా 2020-21 సంవత్సరానికి చెందిన విద్యుత్ సంస్థల చార్జీల ప్రతిపాదనలు ఈఆర్సీకి సమర్పించాల్సి ఉంది. కానీ ఈఆర్సీనే లేకపోవడంతో ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకోబోతోందని అర్థమవుతోంది. ఇది అప్రజాస్వామికం. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల అభిప్రాయం కూడా వెల్లడించే అవకాశం లేకుండా పోతోంది. వెంటనే ఈఆర్సీ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించండి. దానికి తగ్గట్టుగా కార్యాచరణ రూపొందించుకుంటాం.'అని లేఖలో రేవంత్‌రెడ్డి సీఎంను కోరారు.

ఆన్‌లైన్‌లో మరో 4 ఆలయాల సేవలు

- ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11 దేవాలయాల్లో ఈ-సేవలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దేవాలయాల్లో భక్తుల తాకిడి పెరుగుతుండటంతో క్యూలైన్లలో నిల్చుని సేవలకు సంబంధించిన టికెట్లు తీసుకోవాల్సి వస్తోంది. దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై దేవాదాయశాఖకు భక్తుల నుంచి ఫిర్యాదులు కూడా అందుతున్నాయి. ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతి ఆలయం తరహాలో రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల సేవలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తోంది. ఇప్పటికే యాదాద్రి, వేములవాడ, భద్రాచలం, బాసర, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ, కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయాల్లో కొద్దిరోజుల కింద ఆన్‌లైన్ సేవలు ప్రారంభించారు. తాజాగా బుధవారం మరో ప్రధాన నాలుగు దేవాలయాల్లో ఆన్‌లైన్ సేవలను దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి, వరంగల్ భద్రకాళి, జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయాల్లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించారు. దీంతో రాష్ట్రంలో మొత్తం 11 దేవాలయాలకు సంబంధించి దర్శనాలు, గదులు, ప్రసాదాలు, ఆర్జిత సేవలు, విరాళాల చెల్లింపు తదితరాలను ఆన్‌లైన్ ద్వారానే ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి సంబంధించి 'టీ యాప్ ఫోలియో'మొబైల్ యాప్, మీ సేవా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. దళారుల బెడద లేకుండా, తొందరగా సేవలు పొందేందుకు ఈ వ్యవస్థ దోహదం చేయనుంది. రద్దీ ఎక్కువగా ఉన్నా సులభంగా ఆయా సేవలను పొందే వెసులుబాటు కలుగుతుంది. దశల వారీగా మరిన్ని దేవాలయాలకు ఆన్‌లైన్ వెసులుబాటు కల్పిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

వేములవాడ చెరువులోకి కాళేశ్వరం జలాలు

వేములవాడ ఆలయానికి అనుబంధంగా ఉన్న చెరువులోకి కాళేశ్వరం జలాలను గురువారం విడుదల చేయనున్నట్లు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. చెరువు అభివృద్ధి పనులు పూర్తి కావటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్న భక్తులు అక్కడి నుంచే కోరిన ఆలయంలో తమ పేర్లతో పూజలు నిర్వహించుకోవచ్చని, వారికి స్వామి ప్రసాదాన్ని కూడా కొరియర్‌లో పంపుతామని చెప్పారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ప్రసాదాన్ని కొరియర్ ద్వారా విదేశాలకు పంపే సేవలను గురువారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమగ్ర భూసర్వే ద్వారా దేవాలయ భూముల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నట్లు పేర్కొన్నారు. దేవుడి పేరుతోనే పట్టాలు జారీ చేస్తున్నామని, భవిష్యత్తులో ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉంటాయన్నారు. 21,339 ఎకరాలకు గతంలోనే పాస్‌బుక్‌లు అందించామని, త్వరలో 59,898 ఎకరాల దేవుడి భూములకు పాస్‌బుక్‌లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. 14,227 ఎకరాల దేవుడి భూముల్లో ఇప్పటికే దేవాలయ భూములుగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రాజెక్టులపై ఆక్టోపస్ నజర్

ఉగ్రవాద ముప్పు ఉన్న మేడిగడ్డ, అన్నారం, కంతనపల్లిలపై దృష్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఉగ్రవాదులు, తీవ్రవాదుల ముప్పు ఎక్కువగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు మరింత భద్రత పెంచే చర్యలు మొదలయ్యాయి. ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ, పంప్‌హౌస్, అన్నారం బ్యారేజీ, పంప్‌హౌస్, కంతనపల్లి బ్యారేజీల పరిధిలో ఉగ్రవాదులు, తీవ్రవాదుల ముప్పు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఈ ప్రాంతాల్లో నిఘాను పటిష్టం చేయాలని ఆర్గనైజేషన్ ఫర్ కౌంటర్ టెర్రరిస్ట్ ఆపరేషన్ (ఆక్టోపస్) నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో భద్రతా పరమైన చర్యలు తీసుకునేందుకు వీలుగా 365 డిగ్రీల్లో వీడియో రికార్డింగ్, మాక్‌డ్రిల్ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని ఆక్టోపస్ అడిషనల్ డీజీపీ బుధవారం నీటి పారుదల శాఖ ఈఎన్‌సీకి లేఖ రాశారు. తెలంగాణ సరిహద్దుకు ఆనుకొని ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఇటీవల మావోయిస్టు చర్యలు పెరిగాయి. గోదావరి తీర ప్రాంతాలు మహదేవ్‌పూర్, పలిమెల, ఏటూరునాగారం, వాజేడుల్లో మావోయిస్టులు చొరబడకుండా ఇప్పటికే పోలీసులు నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇక కంతనపల్లి బ్యారేజీ ప్రాంతం సైతం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి ఆనుకొని ఉండటం, ఇక్కడి అటవీ ప్రాంతాల్లో ఇటీవల వాహనాలను తగలబెట్టిన ఉదంతాలు, కాంట్రాక్టర్లను హతమార్చడం, బెదిరింపులకు దిగడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. తెలంగాణకు సరిహద్దుగా ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో వందల సంఖ్యలో మావోయిస్టులు సంచరిస్తూ విధ్వంసాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర పోలీసు యంత్రాంగం జయశంకర్, ములుగు, మంచిర్యాల, పెద్దపల్లి, భద్రాద్రి జిల్లాల పోలీసులను అప్రమత్తం చేసింది. అయినప్పటికీ అనుకోని విధంగా ఉగ్రవాదులు, తీవ్రవాదులు దాడులు చేసి నప్పుడు వాటిని ఎదుర్కొనే కసరత్తులో భాగంగా ఆక్టోపస్ మాక్‌డ్రిల్ చేసేందుకు సన్నద్ధమైంది. మాక్‌డ్రిల్ నిర్వహించేందుకు స్వాట్ టీమ్ కమాండర్ శ్రీనివాస్‌రావు త్వరలోనే నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం కానున్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ!

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుంది. గతుకుల రోడ్లను బాగు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రూ.2 వేల కోట్లను విడుదల చేసేందుకు అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు సూత్రప్రాయంగా అంగీకరించిన కేంద్రం.. ఐదేళ్లలో గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేయనుంది. గిరిజన తండాలు, మారుమూల పల్లెలకు వెళ్లే మార్గాలను బాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కొంతకాలంగా కేంద్రాన్ని కోరుతోంది. ముఖ్యంగా మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేయడమే కాకుండా.. సింగిల్ లేన్ రోడ్లను రెండు వరుసల మార్గాలుగా మలచాలని నిర్ణయించింది. ఈ మేరకు రూ.2 వేల కోట్లను విడుదల చేయాలని కోరగా.. ఆ మేర నిధుల విడుదలకు కేంద్రం అంగీకరించింది.

పోటీ చేసిన వారూ రండి!

7న ప్రత్యేక భేటీకి సీఎల్పీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఎలా వ్యవహరించాలనే విషయంలో కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) ఈసారి విభిన్నంగా ముందుకెళుతోంది. అసెంబ్లీ సమావేశాలకు రెండు, మూడ్రోజుల ముందు పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేయడం సంప్రదాయంగా వస్తుండగా, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఈసారి భిన్నంగా వెళుతున్నారు. పార్టీ ఎమ్మెల్యేలతో పాటు 2018 ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులు, నియోజకవర్గాల ఇన్‌చార్జులందరితో సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ నెల 7న జరిగే ప్రత్యేక సమావేశానికి రావాలని, తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, అసెంబ్లీలో లేవనెత్తాల్సిన అంశాలపై సమగ్ర సమాచారం తీసుకురావాలని అందరికీ సమాచారం పంపారు. రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి ఒక్కో చోట కొన్ని రకాల సమస్యలున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు పేర్కొన్నారు.

పేలుడు జరిగిన చోట కొనసాగుతున్న సహాయక చర్యలు

కాలువలోకి ఎగిరిపడ్డ కార్లు..

బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు తీవ్రతకు సమీపంలోని రెండు భవనాలు కూలిపోయాయి. దగ్గర్లోని కార్లు, ఇతర వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరికొన్ని వాహనాలు ఎగిరి సమీపంలోని కాలువలో పడిపోయాయి. పేలుడు ప్రకంపనలకు కిలోమీటర్ దూరంలోని భవనాల అద్దాలు పగిలిపోయాయి. చాలా మంది క్షతగాత్రుల తల, కాళ్లకు గాయాలయ్యాయి

– విపుల్ ఉజ్వల్, గురుదాస్‌పూర్ డీసీపీ

ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు

జనావాసాల మధ్య ఉన్న ఈ ఫ్యాక్టరీని తొలగించాలని తాము పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ జిల్లా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. ఈ పేలుడు శబ్దం కొన్ని కిలోమీటర్ల దూరంలోని ప్రజలకు కూడా వినిపించిందన్నారు.

బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు

23 మంది దుర్మరణం • పంజాబ్‌లో దుర్ఘటన

- పేలుడు తీవ్రతకు పేకమేడల్లా కూలిపోయిన సమీప భవనాలు
- ఫ్యాక్టరీపై స్థానికులు ఫిర్యాదుచేసినా పట్టించుకోని అధికారులు

బటాలా: పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఇక్కడి బటాలా ప్రాంతంలో జనావాసాల మధ్య ఉన్న బాణాసంచా తయారీ ఫ్యాక్టరీలో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ఒక్కసారిగా భారీ పేలుడు జరిగింది. ఈ దుర్ఘటనలో ఫ్యాక్టరీ భవంతి పేకమేడలా కూలిపోవడంతో 23 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 27 మందికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది భారీ సంఖ్యలో ప్రమాదస్థలికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ పేలుడు తీవ్రతకు బాణాసంచా ఫ్యాక్టరీ నేలమట్టం కాగా, పలువురు భవన శిథిలాల కింద చిక్కుకున్నారు. వీరిని కాపాడేందుకు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్), అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.

భయానక అనుభవం..

బటాలా అగ్నిప్రమాదంపై తమ భయానక అనుభవాలను స్థానికులు మీడియాతో పంచుకున్నారు. ఈ విషయమై రాజ్‌పాల్ ఖక్కర్ అనే వ్యక్తి మాట్లాడుతూ..'నేను సమీపంలోని గురుద్వారాకు వెళ్లి వస్తుండగా ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. దీంతో నేను నేలపై పడిపోయి స్పృహ కోల్పోయాను. కళ్లు తెరిచిచూసేసరికి ఆసుపత్రిలో ఉన్నాను' అని తెలిపారు. సాహిబ్ సింగ్ అనే మరో వ్యక్తి స్పందిస్తూ..'సెప్టెంబర్ 5న గురునానక్ దేవ్ 532వ వివాహ వార్షికోత్సవ వేడుకల నేపథ్యంలో బాణాసంచా కొనుగోలు చేసేందుకు వెళ్లాను. అంతలోనే భారీ తీవ్రతతో పేలుడు సంభవించింది. ఆ పేలుడు తీవ్రత ఏ స్థాయిలో ఉందంటే నేను తిరిగి స్పృహలోకి రావడానికి చాలాసేపు పట్టింది' అని వ్యాఖ్యానించారు.

పేలుడు ధాటికి ఛిద్రమైన మృతదేహాలను తీసుకెళ్తున్న పోలీసులు, స్థానికులు

మృతులకు 2 లక్షల పరిహారం

బటాలా దుర్ఘటనపై పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. బటాలా అదనపు డిప్యూటీ కమిషనర్ ఈ విచారణ చేపడతారని వెల్లడించారు. అలాగే సహాయక చర్యలను పర్యవేక్షించాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ మంత్రి రాజేందర్ సింగ్‌కు సూచించారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడ్డవారికి రూ.50,000, స్వల్పంగా గాయపడ్డవారికి రూ.25 వేలు నష్టపరిహారం అందజేస్తామని ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని గురుదాస్‌పూర్ జిల్లా అధికారుల్ని ఆదేశించారు. మరోవైపు బటాలా సీనియర్ మెడికల్ ఆఫీసర్ సంజీవ్ భల్లా మాట్లాడుతూ.. క్షతగాత్రులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం సెలవుపై ఉన్న డాక్టర్లు, వైద్య సిబ్బందిని వెనక్కు పిలిపించామని పేర్కొన్నారు.

రాష్ట్రపతి కోవింద్, రాహుల్ దిగ్భ్రాంతి

బటాలా అగ్నిప్రమాదంపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాణాసంచా ఫ్యాక్టరీలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ప్రమాదంలో 23 మంది చనిపోవడంపై రాహుల్ విచారం వ్యక్తంచేశారు. క్షతగాత్రులు వీలైనంత త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు బటాలా దుర్ఘటనపై గురుదాస్‌పూర్ ఎంపీ సన్నీడియోల్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

ఆ నలుగురు

అజార్, సయీద్, లఖ్వీ, దావూద్‌లను యూఏపీఏ చట్టం కింద ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ: జైషే మహమ్మద్ చీఫ్ మసూద్ అజార్, లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ మహమ్మద్ సయీద్, ముంబై ఉగ్రవాద దాడుల నిందితుడు జకీ ఉర్ రెహ్మాన్ లఖ్వీ, అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంలను వ్యక్తిగత హోదాలో ఉగ్రవాదులుగా కేంద్ర హోంశాఖ ప్రకటించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నియంత్రణ) సవరణ చట్టం(యూఏపీఏ)–1967కు కీలక సవరణలకు పార్లమెంటు ఆమోదం తెలిపిన ఒక నెలలోనే ఈ నలుగురిని కొత్త చట్టం కింద ఉగ్రవాదులుగా ప్రకటించినట్లు కేంద్ర హోంశాఖ అధికారి ఒకరు వెల్లడించారు. ఇప్పటివరకు యూఏపీఏ కింద చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన సంస్థలనే ఉగ్రవాదులుగా ప్రకటించేవారు. కానీ కొత్తగా అమల్లోకి వచ్చిన ఈ చట్టం ప్రకారం వ్యక్తుల్ని సైతం ఉగ్రవాదులుగా ప్రకటించే వెసులుబాటు ఉంది. ఈ చట్టం కింద ఉగ్రవాదుల్ని ప్రకటించడం ఇదే మొదటిసారి. ఇప్పటికే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వీరిని అంతర్జాతీయ ఉగ్రవాదులుగా ముద్రవేసి వారిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసింది.

మౌలానా మసూద్ అజార్ (జైషే మహమ్మద్ చీఫ్)

ప్రమేయం ఉన్న దాడులు: 2001లో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీపై దాడులు, 2001లో పార్లమెంటుపై దాడి, 2016లో పఠాన్‌కోట వైమానిక స్థావరంపై దాడి, 2017లో శ్రీనగర్‌లో సరిహద్దు భద్రతా శిబిరంపై దాడి, ఈ ఏడాది ఫిబ్రవరి 14న పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రయాణించే బస్సుపై దాడి

హఫీజ్ మహమ్మద్ సయీద్ (లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు)

ప్రమేయం ఉన్న దాడులు: 2000 సంవత్సరంలో ఎర్రకోట సహా వివిధ ప్రాంతాల్లో దాడులు, అదే ఏడాది యూపీలో రాంపూర్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై దాడి, భారత్‌పై జరిగిన దాడుల్లో అత్యంత హేయమైనది 2008 ముంబై దాడులు, 2015లో కశ్మీర్ ఉధంపూర్‌లో సరిహద్దు భద్రతా దళం కాన్వాయ్‌పై దాడి.

జకీ ఉర్ రెహ్మాన్ లఖ్వీ (లష్కరే తోయిబా కమాండర్)

ప్రమేయం ఉన్న దాడులు: 2000లో ఎర్రకోటపై దాడి, 2008 ముంబై దాడులు, రాంపూర్ సీఆర్‌పీఎఫ్ శిబిరంపై దాడులు , జమ్మూ కశ్మీర్ ఉధంపూర్‌లో సరిహద్దు భద్రతా దళంపై దాడులు. లఖ్వీని ఐక్యరాజ్యసమితి 2008లో అంతర్జాతీయ ఉగ్రవాది ప్రకటించింది

దావూద్ ఇబ్రహీం (అండర్ వరల్డ్ డాన్)

పాకిస్తాన్‌లో తలదాచుకుంటున్న అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం భారత్‌పై దాడులకి ఎన్నో కుట్రలు కుతంత్రాలు పన్నాడు. ఆర్థిక సాయాన్ని అందించాడు తన అనుచరులతో కలిసి దాడులకు వ్యూహరచన చేశాడు. అల్‌ఖైదా, తాలిబన్ల కార్యకలాపాలకు మద్దతుగా ఉన్నాడు. 257 మంది నిండు ప్రాణాలను పొట్టనపెట్టుకున్న 1993లో ముంబైలో వరుస బాంబు పేలుళ్లు దావూద్ అనుచరుల పనే.

క్లుప్తంగా...

చొరబాట్లు తీవ్రతరం

శ్రీనగర్: కశ్మీర్‌లోయలోకి ఉగ్రవాదుల్ని ఎగదోసి అల్లర్లు సృష్టించడానికి పాకిస్తాన్ పన్నాగాలు పన్నుతోందని ఆర్మీ వెల్లడించింది. ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత పాక్ చొరబాట్లు తీవ్రతరం చేసిందని ఆర్మీ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ధిల్లాన్, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు మునీర్ ఖాన్ చెప్పారు. లష్కరే తోయిబాతో సంబంధాలున్న ఇద్దరు పాకిస్తాన్ జాతీయులు భారత్ భూభాగంలోకి ప్రవేశిస్తుండగా సైనికులు గతంలోనే వారిని నిర్బంధించారు. వారి నేరాంగీకార వీడియోలను బుధవారంనాడు ఆ అధికారులిద్దరూ విలేకరులకు ప్రదర్శించారు. పాకిస్తాన్‌లో రావల్పిండికి చెందిన తాము మహమ్మద్ ఖలీల్, మహమ్మద్ నజీమ్ అని వారిద్దరూ ఆ వీడియోల్లో చెప్పుకున్నారు.

21 మంది ఎంపీలు ఔట్

ముందస్తుకు బ్రిటన్ ప్రధాని సవాల్

లండన్: యూరోపియన్ యూనియన్(ఈయూ) నుంచి బ్రిటన్ విడిపోయేందుకు ఉద్దేశించిన బ్రెగ్జిట్ ఆ దేశంలో రాజకీయ అగ్గిని రాజేసింది. ఈయూతో ఒప్పందం లేకుండా బ్రెగ్జిట్ జరగరాదన్న ప్రతిపక్ష లేబర్ పార్టీ చేసిన ప్రతిపాదనకు 21 మంది అధికార కన్జర్వేటివ్ పార్టీ సభ్యులు మద్దతు పలికారు. దీంతో హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఓటింగ్‌లో విపక్షాలు 328–301 మెజారిటీతో పైచేయి సాధించాయి. సభలో చర్చించే ఎజెండాను నిర్ణయించే అధికారం దక్కించుకున్నాయి. దీంతో బ్రిటన్ ప్రధాని జాన్సన్ 21 మంది తిరుగుబాటు ఎంపీలను కన్జర్వేటివ్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత కోర్బిన్‌పై ప్రధాని బోరిస్ మండిపడ్డారు. దమ్ముంటే అక్టోబర్ 15న సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని సవాలు విసిరారు. బ్రిటన్‌లో మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలంటే మూడింట రెండొంతుల మంది ఎంపీల మద్దతు అవసరం.

టోఫెల్ పరీక్షలో మార్పులు

న్యూఢిల్లీ: టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఫారిన్ లాంగ్వేజ్) పరీక్షలో మార్పులను తీసుకొస్తూ ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్) నిర్ణయం తీసుకుంది. గతంలో ఈ పరీక్ష మూడున్నర గంటలు జరుగుతుండగా, ఇప్పటి నుంచి మూడు గంటలే జరగనుంది. వినడం, చదవడం, రాయడం విభాగాల్లోనూ కొద్దిమార్కులు తగ్గించి సమయాన్ని కుదించారు. పరీక్షలో విఫలమైతే ఉండే లాక్ ఇన్ పీరియడ్‌ను తొలగించారు. దీంతో తర్వాతి వారాల్లో పరీక్షకు హాజరయ్యే చాన్స్ రానుంది. ఈ పరీక్ష రాసే అవకాశం గతంలో కొద్ది దేశాల్లోనే ఉండగా, ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడ నుంచైనా పరీక్ష రాయవచ్చు. మై బెస్ట్ స్కోర్స్ ద్వారా గత రెండేళ్లలో అభ్యర్థికి వచ్చిన మార్కులను పరిశీలించే చాన్సుంది. అందులో వచ్చిన అత్యుత్తమ మార్కుల ద్వారా అడ్మిషన్ తీసుకొనేలా చర్యలు తీసుకున్నారు.

విదేశీ జోక్యానికి నో

- ప్రపంచదేశాలకు స్పష్టం చేసిన ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్
- రష్యాతో అంతరిక్షం, భద్రత సహా 15 రంగాల్లో భారత్ ఒప్పందాలు
- ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రూ.2.16 లక్షల కోట్లకు పెంచుకోవాలని నిర్ణయం



వ్లాడివోస్టోక్‌లో షిప్‌బిల్డింగ్ ప్లాంట్ నమూనాను పరిశీలిస్తున్న ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్

వ్లాడివోస్టోక్: భారత్–రష్యాలు తమ అంతర్గత విషయాల్లో ఇతరుల జోక్యాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తాయని ప్రధాని మోదీ తెలిపారు. రష్యాలతో వాణిజ్యం, భద్రత, నౌకాయానం, అంతరిక్ష రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పటిష్టం చేసుకునేందుకు కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తాము వ్యతిరేకిస్తున్నామనీ, రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదాన్ని ఎగదోయడం నిలిపివేయాలని హితవు పలికారు. కశ్మీర్‌కు సంబంధించి ఆర్టికల్ 370 రద్దుపై పాకిస్తాన్ చేస్తున్న ఆందోళనను, వేర్పాటువాదులకు ఇస్తున్న మద్దతును మోదీ ఈ మేరకు పరోక్షంగా తప్పుపట్టారు. రెండ్రోజుల రష్యా పర్యటనలో భాగంగా బుధవారం మోదీ వ్లాడివోస్టోక్ నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మోదీకి రష్యా బలగాలు గౌరవవందనం సమర్పించాయి. అనంతరం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కలిసి 'భారత్–రష్యా 20వ వార్షిక సదస్సు'లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరుదేశాలు రక్షణ, అంతరిక్షం, నౌకాయానం, ఇంధనం, సహజవాయువు, పెట్రోలియం, వాణిజ్యం సహా 15 రంగాల్లో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

చెన్నై–వ్లాడివోస్టోక్ నౌకామార్గం..

ప్రధాని మోదీ–పుతిన్‌ల నేతృత్వంలో ఇరుదేశాల ప్రతినిధి బృందాల భేటీ అనంతరం భారత్, రష్యాలు సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఈ విషయమై భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ....'తమిళనాడు రాజధాని చెన్నై నుంచి వ్లాడివోస్టోక్ వరకూ పూర్తిస్థాయి నౌకాయాన మార్గాన్ని ఏర్పాటు చేయాలని ఎంవోయూ కుదుర్చుకున్నారు. ప్రస్తుతం భారత్–రష్యాల మధ్య రూ.79,247 కోట్లు(11 బిలియన్ డాలర్లు)గా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2025 నాటికి రూ.2.16 లక్షల కోట్లకు చేర్చాలని మోదీ–పుతిన్ నిర్ణయం తీసుకున్నారు' అని తెలిపింది. అంతకుముందు అధ్యక్షుడు పుతిన్‌తో కలిసి ఓ బోటులో 2 గంటల పాటు మోదీ విహరించారు. ఈ సందర్భంగా ఇరువురు వ్లాడివోస్టోక్‌లోని జెవెజ్‌డా నౌకానిర్మాణ కేంద్రాన్ని సందర్శించారు.

భారత్ కీలక భాగస్వామి: పుతిన్

మోదీ పర్యటన నేపథ్యంలో పుతిన్ మాట్లాడుతూ.. భారత్ రష్యాకు అత్యంత కీలకమైన భాగస్వామని తెలిపారు. 'ఇరుదేశాల మధ్య వాణిజ్యం 17 శాతం వృద్ధి చెంది 11 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది మరింత వృద్ధి చెందుతుందని నమ్ముతున్నాం. భారత్–యూరేసియన్ ఎకనమిక్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునేందుకు కృషి చేస్తున్నాం' అని అన్నారు.

'గగన్‌యాన్'కు రష్యా సహకారం..

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ చేపట్టనున్న మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'లో పాల్గొనే వ్యోమగాములకు రష్యా శిక్షణ ఇవ్వనుందని మోదీ ప్రకటించారు. ఇందుకోసం ఇస్రో, రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కాస్మోస్ సన్నిహితంగా పనిచేస్తున్నాయని వెల్లడించారు. అంతరిక్ష వాహక నౌకల ప్రయోగం, అభివృద్ధి, అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాలకు వాడుకునే విషయంలో కలసికట్టుగా పనిచేయాలని ఇరుదేశాలు నిర్ణయించాయని పేర్కొన్నారు. వ్యోమగాములను ఎంపిక చేసే ప్రక్రియను ఇస్రో ఇప్పటికే ప్రారంభించిందనీ, ఈ ఏడాది నవంబర్ తర్వాత వీరికి రష్యాలో శిక్షణ ఇస్తారని చెప్పారు. గగన్‌యాన్‌లో భాగంగా ముగ్గురు వ్యోమగాముల్ని అంతరిక్షంలోకి పంపేందుకు కేంద్రం రూ.10,000 కోట్లను కేటాయించింది.

ఉత్తమ 'జీవన' నగరం.. వియన్నా

ఎకనమిక్స్ ఇంటెలిజెన్స్ సర్వే

న్యూఢిల్లీ: ప్రపంచంలో జీవించదగ్గ అత్యుత్తమ నగరాల జాబితాలో ఢిల్లీ ఆరు స్థానాలు దిగజారి 118వ స్థానంలో నిలిచింది. గతేడాది మొదటి స్థానంలో నిలిచిన వియన్నా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. అత్యుత్తమ నగరాన్ని ఎంపిక చేసేందుకు ఎకనమిక్స్ ఇంటెలిజెన్స్ ప్రపంచవ్యాప్తంగా 140 నగరాల్లో సర్వే నిర్వహించింది. ఈ సర్వే వివరాలను బుధవారం వెల్లడించింది. నేరాలు పెరగడం, ప్రాణవాయువు నాణ్యత తగ్గడం వంటి కారణాల రీత్యా ఢిల్లీ ఆరు స్థానాలు దిగజారింది. సాంస్కృతిక విభాగంలో తక్కువ పాయింట్లు రావడంతో ముంబై రెండు స్థానాలు దిగజారి 119వ స్థానంలో నిలిచింది. ఆస్ట్రియా రాజధాని వియన్నా జీవించదగ్గ ఉత్తమ నగరంగా ఎంపికై మొదటి స్థానంలో నిలిచింది. కెనాడాలోని సిడ్నీ, జపాన్‌లోని ఒసాకాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

ఢిల్లీ 118



ముంబై 119

ఫస్ట్ వియన్నా.. లాస్ట్ డమాస్కస్

నివాసానికి ఆమోదయోగ్య నగరాల జాబితాలో 99.1 పాయింట్లతో వియన్నా తొలిస్థానంలో నిలిచింది. ఇందులో న్యూఢిల్లీకి 56.3 పాయింట్లు రాగా, ముంబైకి 56.2 పాయింట్లు వచ్చాయి. చివరి స్థానంలో నిలిచిన సిరియాలోని డమాస్కస్ పట్టణానికి 30.7 పాయింట్లు లభించాయి. పాకిస్తాన్‌లోని కరాచీ 136వ స్థానంలో నిలవగా, బంగ్లాదేశ్ రాజధాని ఢాకా 138వ స్థానంలో నిలిచింది. చైనా రాజధాని బీజింగ్ 76వ స్థానంలో నిలవగా, లండన్ 48, న్యూయార్క్ 58వ స్థానాల్లో నిలిచాయి. మీడియా స్వేచ్ఛ విషయంలో కూడా భారత్ మరింత దిగజారిందని నివేదిక తెలిపింది.

శివకుమార్‌కు 13 వరకు కస్టడీ

ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపర్చిన ఈడీ

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన కర్ణాటక సీనియర్ కాంగ్రెస్ నేత డీకే శివకుమార్‌ను సెప్టెంబర్ 13 వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి అనుమతిస్తూ ఢిల్లీ కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం రాత్రి అరెస్టు చేసిన శివకుమార్‌ను 14 రోజుల కస్టడీకి అప్పగించాలని ఈడీ కోరిన నేపథ్యంలో ప్రత్యేక జడ్జి ఈ ఉత్తర్వులిచ్చారు. బుధవారం రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రిలో పరీక్షల అనంతరం శివకుమార్‌ను ప్రత్యేక జడ్జి ఎదుట హాజరుపరిచారు. శివకుమార్ తరపున వాదిస్తున్న న్యాయవాదులు అభిషేక్‌మను సింఘ్వీ, దయన్ కృష్ణన్ వాదనలు వినిపిస్తూ శివకుమార్ అరెస్టు అన్యాయం అనీ, అతను పరారవుతాడన్న ఈడీ అనుమానాలు నిరాధారమని వాదించారు. శివకుమార్‌ను ఈడీ అరెస్టు చేసినందుకు నిరసనగా బుధవారం కర్ణాటక, ఢిల్లీలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలను ఢిల్లీలోని యువజన కాంగ్రెస్ కార్యాలయం బయట దహనం చేశారు. కర్ణాటకలోని పలు ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ నిరసనలు నిర్వహించింది. ఐదారు బస్సులపై రాళ్ల దాడి జరిగిందని, కనకపుర, బెంగళూరులో బస్సులను తగలబెట్టడానికి ఆందోళనకారులు ప్రయత్నించారు.

అంతరిక్ష పరిశోధనల్లో భారత్ టాప్

ఘనంగా ప్రారంభమైన ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్ సదస్సు

సాక్షి ప్రతినిధి, బెంగళూరు: అంతరిక్ష పరిశోధనల్లో భారత్ నాలుగో అగ్రగామిగా ఖ్యాతి దక్కించుకుందని ఇజ్రాయెల్‌కు చెందిన ప్రసిద్ధ అంతరిక్ష శాస్త్రవేత్త బ్రిగ్ జెన్ (ఆర్ఈఎస్) ప్రొఫెసర్ చైమ్ ఈష్షె పేర్కొన్నారు. బెంగళూర్ వేదికగా ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్– 2019 సదస్సు బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్ణాటక రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అశ్వర్థ నారాయణ పాల్గొని మాట్లాడారు. అంతరిక్ష పరిశోధనలకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని ఆయన అన్నారు

అంతరిక్ష విప్లవం

భారత్ ద్వారా అంతరిక్ష పరిశోధనల్లో విప్లవం రానుందని ఇజ్రాయెల్ శాస్త్రవేత్త బ్రిగ్ జెన్ అన్నారు. యువ శక్తిశీల దేశమైన భారత్‌లో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అపారమన్నారు. ప్రత్యేకించి సైన్స్ , ఇంజినీరింగ్ సాంకేతికతలో అద్భుతాలు సృష్టించే యువత భారత్‌కు అమూల్యమైన సంపద అంటూ కొనియాడారు. భారత్ చంద్రయాన్–2ను విజయవంతంగా నింగికి పంపి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి దక్కించుకుందన్నారు.

'చిన్న ఉపగ్రహాలు- ప్రయోజనాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కర్ణాటక ఉప ముఖ్యమంత్రి అశ్వర్థ, తదితరులు

భారత యువతకు ఆ సత్తా

కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇజ్రాయిల్ టు సౌత్ ఇండియా ప్రత్యేక అతిథిగా హాజరైన డానా కుర్న్ మాట్లాడుతూ.. అంతరిక్ష పరిశోధనల్లో అంకితభావంతో కృషి చేస్తున్న యువత పనితీరు ప్రశంసనీయన్నారు. భారత్, ఇజ్రాయెల్ అంతరిక్ష పరిశోధనల్లో భాగస్వామ్యంతో చేస్తున్న కృషిని కొనియాడారు. ఇండో–ఇజ్రాయెల్ స్పేస్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్, నీటి నిర్వహణ తదితర రంగాల్లో భారత్‌కు సహకరిస్తామన్నారు.

75 ఏళ్లు.. 75 ఉపగ్రహాలు

2022కు భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతుందని, ఆ సందర్భంగా 75 విద్యార్థి రూపకల్ప ఉపగ్రహాలను ప్రయోగించేందుకు చొరవ చూపిస్తామని ఐటీసీ–2019 చైర్మన్ మురళీకృష్ణా రెడ్డి అన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన 7 విద్యార్థి రూపకల్పన ఉపగ్రహాలు ఉన్నాయన్నారు. ఐటీ, బీటీ రంగాలే రేపటి భవిష్యత్తు అని అటల్‌జీ మాటలను పద్మశ్రీ డాక్టర్ వాసుగం గుర్తుచేశారు. ఈ సదస్సులో 7 దేశాలకు చెందిన ప్రతినిధులతో పాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రొడక్షన్ ఇంజినీర్స్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉడే పి.కృష్ణ, ప్రొఫెసర్ ఎంఆర్ ప్రాణేష్, డాక్టర్ బీవీఏ రావులు పాల్గొన్నారు.

epaper.sakshi.com

సాక్షి
గురువారం, సెప్టెంబర్, 5

చరిత్రాత్మక నిర్ణయం

కొత్తగా అధికారంలోకొచ్చినవారిపై అందరి దృష్టీ ఉంటుంది. వారి నిర్ణయాలెలా ఉన్నాయో, వారి అడుగులు ఎటు పడుతున్నాయో, ఎన్నికల్లో చేసిన బాసల సంగతేం చేశారో జనం గమనిస్తూనే ఉంటారు. ఎవరెవరి వల్లనో సాధ్యం కావడం లేదని సాకులు చెబుతున్నా, కమిటీలతో కంటితుడుపు చర్యలకు పరిమితమైనా వారు ఇట్టే పసిగడతారు. అధికారంలోకొచ్చి నెలరోజులైనప్పుడూ, వందరోజులైనప్పుడూ, ఏడాదైనప్పుడూ పాలకులు పండుగ చేసుకోవడం రివాజు. కానీ వారు ఇచ్చిన హామీలనూ, వారి ఆచరణనూ పోల్చి చూసుకోవడానికి సామన్యులకు అవి సందర్భాలవుతాయి. కొన్నింటిలోనైనా ఫర్వాలేదనిపించినప్పుడు మాత్రమే ప్రజలు సైతం ఏదో మేరకు ఆ పండుగల్లో భాగస్వాములవుతారు. కానీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫర్వాలేదనిపించడం కాదు... ఎన్ని వాగ్దానాలు పరిపూర్తి చేయవచ్చునో అన్నీ చేసి, అన్నివిధాలా తన పాలనా దక్షతను నిరూపించుకుని వంద రోజుల పాలనలో వంద శాతం మార్కులు సాధించారు. తాజాగా బుధవారం సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ)ను ప్రభుత్వంలో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైనది. దీని ఫలితంగా ఆ సంస్థలో పనిచేస్తున్న 52,813మంది ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులవుతారు. ఇందుకోసం ప్రభుత్వంలో ప్రజా రవాణా శాఖను ఏర్పాటుచేస్తారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని సౌకర్యాలు, నియమనిబంధనలు విలీనం కాబోతున్న ఆర్టీసీ ఉద్యోగులకు కూడా వర్తిస్తాయి. వారి ఉద్యోగ విరమణ వయసు కూడా 60 ఏళ్లకు పెంచారు. విలీన ప్రక్రియ మొత్తం మూడు నెలల్లో పూర్తి కావాలని ముఖ్యమంత్రి నిర్దేశించడం ఆయన చిత్తశుద్ధికి మచ్చుతునక.

ఆర్టీసీ సిబ్బంది ఎన్నో ప్రతికూల సమస్యల మధ్య నిత్యం లక్షలాదిమందిని గమ్యస్థానాలు చేరుస్తుంటారు. వారి కృషి కారణంగానే కనిష్టస్థాయిలో ప్రమాదాల రేటు ఉండటం, విడిభాగాల అవసరం తరచుగా లేకపోవడం, బస్సు టైర్ల మన్నిక మెరుగ్గా ఉండటం వంటివి సాధ్యమవుతున్నాయి. వీటిన్నిటా దేశంలోని ఇతర కార్పొరేషన్లకు ఆర్టీసీ ఆదర్శంగా నిలిచింది. ప్రమాణాల విషయంలో కూడా ఆర్టీసీది అగ్రస్థానమే. విభజన తర్వాత సైతం అది మంచి పనితీరు కనబరిచింది. అయినా ఆ సంస్థను సమున్నతంగా నిలబెట్టడంలో, దానికొచ్చే నష్టాలను తగ్గించడంలో బాబు ప్రభుత్వం గతంలో దారుణంగా విఫలమైంది. తాము అధికారంలోకొస్తే ఆర్టీసీ సిబ్బందికి ప్రభుత్వ సిబ్బందితో సమానంగా వేతనాలిస్తామని 2014 ఎన్నికల సమయంలో నమ్మబలికిన చంద్రబాబు ఆ తర్వాత చేతులెత్తేశారు. దాన్ని గురించి సిబ్బంది అడిగినప్పుడూ లేదా అడుగుతారనుకున్నప్పుడూ ఆర్టీసీ భారీ నష్టాల్లో ఉన్నదని, ప్రభుత్వం దాని ఆస్తుల్ని ప్రైవేటీకరించే ఆలోచన చేస్తున్నదని అనుకూల మీడియాలో కథనాలు రాయించేవారు. కిలోమీటర్‌కు రూ. 8 నష్టం వస్తోందన్న సాకుతో పల్లె వెలుగు బస్సుల్ని కుదించే ప్రయత్నాలు జరిగాయి. సిబ్బంది సంఖ్యను తగ్గించుకోవడానికి రకరకాల ఎత్తుగడలు వేశారు. విమాన ఇంధనంపై సర్‌చార్జిని నామమాత్రంగా వసూలు చేసి పెద్ద మనసు చాటుకున్న బాబు సర్కారు ఆర్టీసీ బస్సులకు వాడే డీజిల్‌పైనా, విడిభాగాలపైనా భారీ స్థాయిలో వ్యాట్ విధించి ఆ సంస్థ సొమ్మును కొల్లగొట్టేది. ఒకపక్క బస్సు మాఫియాతో చెట్టపట్టాలు వేసుకుని, వారి ప్రయోజనాలను నెరవేర్చడం కోసం ప్రైవేటు సర్వీసుల విచ్చలవిడితనాన్ని ప్రోత్సహించి సంస్థ నష్టాలకు మాత్రం కార్మికుల్నే బాధ్యులుగా చూపేది. ఒక్కమాటలో చెప్పాలంటే వారిని నిత్యం అనిశ్చితిలో ఉంచేది. నామ మాత్రంగా ఒక కమిటీ వేసి, దాని పదవీకాలాన్ని నిరవధికంగా పొడిగిస్తూ పోవడం, చివరికి అదే ప్పుడో సిఫార్సులు చేశాక, ఆ నివేదిక పరిశీలనకు కేబినెట్ ఉపసంఘం ఏర్పాటు చేయడం, ఆ తర్వాత మరెన్నాళ్లకో ఆ ఉపసంఘం నివేదిక ఇవ్వడం, చివరాఖరికి నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టడం బాబు మార్కు విధానం.

వైఎస్ జగన్ ప్రభుత్వం ఆర్టీసీ విలీనం విషయంలో ఏమాత్రం శషభిషలు ప్రదర్శించలేదు. అధికారంలోకొచ్చిన పక్షం రోజుల్లోనే పోలీసు మాజీ ఉన్నతాధికారి సి. ఆంజనేయరెడ్డి నేతృత్వంలో ఆరుగురితో నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేయడం, మూడు నెలల వ్యవధిలో నివేదిక ఇవ్వాలని ఆ కమిటీకి సూచించడం చకచకా జరిగాయి. ఆంజనేయరెడ్డి పోలీసు విభాగంలోనూ, ఆర్టీసీలోనూ సమర్థవంతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయడమే ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. కార్మిక సంఘాలు మొదలుకొని భిన్న రంగాల వారితో ఆ కమిటీ చర్చించింది. వచ్చిన సూచనలన్నిటినీ పరిశీలించి తనకిచ్చిన వ్యవధిలోనే ప్రతిపాదనలు సమర్పించింది. వాటిని పరిశీలించి విలీనానికి ఆమోదముద్ర వేయడంతోపాటు మూడు నెలల్లో ఈ ప్రక్రియంతా పూర్తి కావాలనిరవాణా, ఆర్థిక, న్యాయ, సాధారణ పరిపాలన శాఖలను సీఎం ఆదేశించారు. ప్రభుత్వాధినేత అంకిత భావంతో పని చేస్తే, పాలనాదక్షత కనబరిస్తే పనులు ఎంత వేగంగా పూర్తవుతాయో చెప్పడానికి ఆర్టీసీ విలీన నిర్ణయం పెద్ద ఉదాహరణ. ఈ చరిత్రాత్మక నిర్ణయం ద్వారా దేశంలోని పాలకులందరికీ జగన్ ఆదర్శప్రాయుడయ్యారు. ఇకపై మరింత క్రియాశీలంగా పనిచేసి, దాన్ని లాభాల బాట పట్టించడం ప్రజా రవాణా శాఖలో భాగస్వాములై ప్రభుత్వ ఉద్యోగులుగా మారబోతున్న ఆర్టీసీ సిబ్బంది కర్తవ్యం కావాలి. ఇది విఫలం కావాలని ఆశించే శక్తులు రాష్ట్రంలో పొంచి ఉన్నాయి. ఆ శక్తులే ఇన్నాళ్లూ ప్రభుత్వాల్లో చక్రం తిప్పి ఆర్టీసీని అన్ని విధాలా ముంచేశాయి. దశాబ్దాల తమ కలను సాకారం చేసుకున్న సిబ్బంది ఆ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వారు తమ కర్తవ్య నిర్వహణలో సాధించే విజయం ఇతర రాష్ట్రాల్లోని రవాణా కార్పొరేషన్ ఉద్యోగులకు స్ఫూర్తినిస్తుంది. తమను విలీనం చేస్తే కలిగే మేలేమిటో అక్కడి ప్రభుత్వాలకు వారు చెప్పగలుగుతారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి శు.సప్తమి రా.2.15 వరకు, తదుపరి అష్టమి నక్షత్రం విశాఖ ఉ.10.27 వరకు, తదుపరి అనూరాధ వర్జ్యం ప.2.22 నుంచి 3.56 వరకు, దుర్ముహూర్తం ఉ.9.53 నుంచి 10.43 వరకు, తదుపరి ప.12.21 నుంచి 1.10 వరకు అమృతఘడియలు... రా.11.47 నుంచి 1.22 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం: 6.08
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

సమానత్వానికి ఆమడ దూరంలో!

విశ్లేషణ

ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

కుల అసమానత్వానికి, అగౌరవానికి పరిష్కారం కులాంతర వివాహమేనని చాలామంది సామాజిక సిద్ధాంతవేత్తలు భావిస్తుంటారు. కాని అన్ని కులాల మధ్య ఆధ్యాత్మిక సమానత్వం ఏర్పర్చనట్లయితే, మరే ఇతర కులవ్యతిరేక చర్యలూ పెద్దగా సాధించేదంటూ ఏదీ ఉండదు. మనుషుల్లో కులాలను దేవుడు సృష్టించలేదని ప్రతి ఆలయంలోనూ పూజారి ప్రకటించి ఉంటే, దేశంలో కొద్దిగా అయినా సాధ్యపడుతున్న కులాంతర వివాహాలు యువతీయువకుల హత్యలకు దారితీసి ఉండేవికావు. మనం ఆలయంలోనే సమానత్వాన్ని కోల్పోయాం. అది పోలీసు స్టేషన్‌లో దొరుకుతుందని వెతుకుతున్నాం. ఆలయం సృష్టించిన సమస్యను పోలీసు స్టేషన్ పరిష్కరించలేదు. ఉమ్మడి వ్యవస్థలుగా ఆలయం, పాఠశాల మాత్రమే దీన్ని పరిష్కరించాలి. 21వ శతాబ్దిలోనూ భారత్‌లో మానవ సంబంధాలు అంతరాలు, అసమానతల మధ్యే కొనసాగుతున్నాయి.

నా బాల్యంలోనూ, ప్రస్తుతం కూడా మా గ్రామంలో ఓ సాధారణ ప్రక్రియ జరుగుతూ వస్తోంది. ప్రతి వృత్తినీ ఒక్కో సామాజిక బృందం మాత్రమే నిర్వహిస్తూంటుంది. ప్రతి కమ్యూనిటీకీ ఒక్కో పేరు ఉంటుంది. పొలాలను దున్నడం, గొర్రెలు కాయడం లేదా పశువుల పెంపకం, చేపలుపట్టడం, కల్లుగీత, కుండల తయారీ, బట్టలు ఉతకడం, నేతపని, క్షురక వృత్తి, చెప్పుల తయారీ, జంతువులు లేక మనుషుల మృతదేహాలకు అంతిమసంస్కారం నిర్వహించడం వంటి ఒక్కో పనిని ఒక్కో కులం ప్రత్యేకంగా చేసేది. గ్రామంలో ఏదైనా వృత్తి చేతులు మారుతూ ఉంటుందంటే అది పొలం దున్నడం మాత్రమే. ఇతర వృత్తులన్నీ వేర్వేరు కులాల చేతుల్లోనే ఉంటాయి.

నా బాల్యంలో అన్ని కులాలూ కలిసి భోజనం చేసే పద్ధతి ఉండేది కాదు. ఇప్పుడు అన్ని కులాలు కలిసి భోంచేయడం సాధ్యపడుతోంది కానీ, కులాంతర వివాహం ఇప్పటికీ కష్టసాధ్యమే. మార్పు ఏదైనా జరిగిందంటే అది పైపైన మాత్రమే జరుగుతోంది తప్ప వ్యవస్థాగతంగా కాదు. అంతరాల పరమైన అసమానత్వం ఇప్పటికీ అలాగే ఉంది. బ్రాహ్మణ, వైశ్య కులాలు ఇప్పటికీ ప్రత్యేకంగా ఉంటూ మిగతా కులాలకంటే అగ్రస్థానంలో ఉంటున్నాయి. కులపరమైన సమానత్వం గ్రామంలోనూ లేదు. నగరంలోనూ లేదు. 72 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా దేశంలో ప్రజాజీవితంలో సమానత్వం లేనేలేదు.

20వ శతాబ్ది మధ్య నుంచి, 21వ శతాబ్ది ప్రారంభం వరకు భారతదేశంలో మానవ సంబంధాలు అంతరాలు, అసమానతల మధ్యే కొనసాగుతున్నాయి. స్త్రీపురుషులతో సహా మనుషులందరినీ సమానంగా సృష్టించాడని చెబుతున్న దేవుడు నేటికీ మా సామాజిక చట్రంలోకి ప్రవేశించలేకున్నాడు.

ప్రతి గ్రామంలోనూ పశువుల, మనుషుల మృతదేహాలకు అంతిమ సంస్కారం నిర్వహించే వారిని అంటరానివారిగా గుర్తిస్తుంటారు. ఇక రజకులు, క్షురకులను కూడా హీనంగా చూస్తుంటారు. దాదాపుగా దేశంలోని ప్రతి గ్రామంలోనూ ఇదే పరిస్థితి. ఉత్తరాదిన ఇది కఠినంగా అమలవుతుంటే దక్షిణాదిలో కాస్త తక్కువ స్థాయిలో అమలవుతోంది. ఆర్‌ఎస్‌ఎస్/బీజేపీ ఉత్తరాదిన బలంగానూ, దక్షిణాదిలో బలహీనంగానూ ఉండటానికి ఇదే కారణం. గ్రామాల్లో ఉమ్మడి పాఠశాలల వ్యవస్థ ఉనికిలోకి రాకముందు చారిత్రకంగా చూస్తే, అన్ని వృత్తులను ఐక్యం చేసేది ఒక్క ఆలయం మాత్రమే. దేవుడు మనుషులందరినీ సమానంగా సృష్టించాడన్న భావంతో గ్రామంలోని ఆలయం అన్ని కులవృత్తుల వారికి ఉమ్మడి స్థలంగా ఉండేది. భారతీయ గ్రామాలు చాలా విభిన్నమైనటువంటివి. ఆలయ పూజారి వారికి ఏం చెబుతాడన్నది ఊహించుకోండి మరి. మీ వృత్తిపరంగా ఉండే మీ విధులను నిర్వహించండి, అన్ని వృత్తులూ మన మనుగడ కోసం అవసరమైనట్టివే, మీరూ మీ వృత్తిపరమైన విధులూ దేవుడి రాజ్యంలో సమానమైనవే. కానీ దీనికి భిన్నంగా గ్రామీణ పూజారి గ్రామస్థులకు ఏం చెబుతూ వచ్చాడో తెలుసా? అసమానత్వాన్ని, అంటరానితనాన్ని పాటించడం మీ పవిత్ర ధర్మం. ఎందుకంటే దేవుడు లేక దేవుళ్లు మిమ్మల్ని అసమానంగానే సృష్టించారు అనే. దేవుడి ప్రతినిధిగా భావించే వ్యక్తే గ్రామీణులకు ఇలా చెబుతూ వస్తే దేశంలో ఆధ్యాత్మిక, సామాజిక సమానత్వం ఎలా వస్తుంది?

ఉమ్మడి బోధనా స్థలంగా పాఠశాల గ్రామాల్లో ప్రవేశించడానికి ముందు ఆలయం ఒక ఉమ్మడి సామాజిక స్థలంగా ఉండాలి. గ్రామ దేవాలయానికి సమానత్వమే సూత్రమైతే, ఆ సమానత్వం గ్రామీణ జీవితంలో భాగమై ఉండాలి. అన్ని కులవృత్తుల ప్రజలూ పక్కపక్కనే కూర్చుని ఆహారాన్ని ఆరగించాలని గ్రామ దేవాలయం మొదటి నుంచి ప్రబోధించి ఉంటే, గ్రామాల్లో అసమానత్వం అసలు ఉండేది కాదు. కుల అసమానత్వానికి, అగౌరవానికి పరిష్కారం కులాంతర వివాహమేనని చాలామంది సామాజిక సిద్ధాంతవేత్తలు భావిస్తుంటారు. కాని అన్ని కులాల మధ్య ఆధ్యాత్మిక సమానత్వం ఏర్పర్చనట్లయితే, మరే ఇతర కులవ్యతిరేక చర్యలతో పెద్దగా సాధించేదంటూ ఏదీ ఉండదు. మనుషుల్లో కులాలను దేవుడు సృష్టించలేదని ప్రతి ఆలయంలోనూ పూజారి ప్రకటించి ఉంటే, దేశంలో కొద్దిగా అయినా సాధ్యపడుతున్న కులాంతర వివాహాలు ప్రస్తుతం జరుగుతున్నట్లుగా యువతీయువకుల హత్యలకు దారితీసి ఉండేవికావు.

అలాంటి వాతావరణంలో ఆర్టికల్ 15 వంటి సినిమా ఏదీ మనకు అవసరమై ఉండేది కాదు. మనం ఆలయంలోనే సమానత్వాన్ని కోల్పోయాం. అది పోలీసు స్టేషన్‌లో దొరుకుతుందని వెతుకుతున్నాం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ఆలయం గురించి పేర్కొనలేదు. ఆలయం సృష్టించిన సమస్యను పోలీసు స్టేషన్ పరిష్కరించలేదు. ఉమ్మడి వ్యవస్థలుగా ఆలయం, పాఠశాల మాత్రమే దీన్ని పరిష్కరించాలి. మన వివాహ వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి అర్చక కులం సిద్ధపడనంతవరకు కులాంతర వివాహాలు మన దేశంలో విజయవంతం కావు. అర్చకత్వం అనేది కుల వృత్తిగా కాకుండా వ్యక్తులు చేసే వృత్తిగా మారనంతవరకు మన వివాహ వ్యవస్థ మారదు. కుల సంబంధాలు మారవు. అప్పుడు మాత్రమే శ్రమను గౌరవించడం మన కుటుంబ సంస్కృతిలో సాధ్యపడుతుంది.

ఈ ప్రాథమిక అంశాలను మనం సాధించి ఉంటే, ఇస్లామిక్ మసీదు మన గడ్డపైకి అడుగుపెట్టగలిగేదే కాదు. అలాగే క్రిస్టియన్ చర్చి కూడా భారతదేశంలోకి వచ్చేది కాదు. ముస్లిం ఆక్రమణదారులు కానీ, క్రిస్టియన్ వలసపాలకులు కానీ వచ్చి ఉన్నా, వారు భారత్‌లో ఇంతటి విజయాలు సాధించి ఉండేవారు కాదు.

మరోమాటలో చెప్పాలంటే, ఆధునిక కాలంలో మన సమాజాలన్నింటిలోనూ మానవ సమానత్వానికి ఆధ్యాత్మికపరమైన ప్రజాస్వామ్య వ్యవస్థే నిజమైన పునాదిగా ఉంటోంది. మన దేశంలో అలాంటి ఆధ్యాత్మిక ప్రజాస్వామ్యాన్ని బ్రాహ్మణ పండితులే ప్రతిపాదించి ఉండాలి. ఆధ్యాత్మిక సమానత్వ సూత్రాన్ని దేవుడు ప్రసాదించిన సూత్రంగా ఆలయం ఆచరించి ఉంటే మన దేశం మరో విభిన్న దశలో సాగి ఉండేది.

సాధారణంగా మన కాలేజీల్లో, యూనివర్సిటీల్లో రాజకీయ సమానత్వం పట్లే చర్చలు సాగుతుంటాయి. కానీ గ్రామ స్థాయి నుంచి మానవ సంబంధాలన్నింటినీ ఆధ్యాత్మిక సమాజమే పూర్తిగా నియంత్రిస్తున్నప్పుడు మన పౌర సమాజ పొరల్లోకి రాజకీయ సమానత్వాన్ని తీసుకురావడం ఎలా సాధ్యం? మానవ సమానతా సమాజాన్ని నిర్మించాలంటే ఇక్కడే ఆలయం, చర్చి, మసీదు కీలకపాత్ర పోషించాల్సి ఉంది. పరిశుద్ధమైన శాకాహార తత్వమే జాతీయ ఆహారంగా హిందుత్వ శక్తులు చాలాకాలంగా పేర్కొంటూ వస్తున్నాయి. వీరి అభిప్రాయం ప్రకారం మాంసాహారులు ఎవ్వరు భారతీయులు కారు. అందుకే ఇప్పుడు శాకాహారులైన బ్రాహ్మణులు, వైశ్యులు, ఆరెస్సెస్ కంటే శూద్ర, దళిత, ఆదివాసీ మాంసాహారులను తక్కువజాతికింద పరిగణిస్తున్నారు.

ఇప్పుడు అసమానత్వాన్ని నిర్మూలించడానికి బదులుగా అసమానత్వాన్ని పెంచి పోషించే అత్యంత శక్తివంతమైన నూతన శాకాహార కులంగా ఆరెస్సెస్ అవతరించింది. జాతీయవాదాన్ని ప్రజల ఆహార ఆర్థికవ్యవస్థకు అనుసంధానించడం తగదంటూ.. ఆరెస్సెస్‌లో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న ఏ శూద్రకులానికి చెందిన కార్యకర్త కూడా నొక్కి చెప్పలేరు. ఎందుకంటే రుగ్వేద కాలం నుంచి శూద్రులను బౌద్ధికంగా తక్కువస్థాయి కలిగినవారిగా గుర్తిస్తూ వస్తున్నారు.

శాకాహారమే తమ ఆహారంగా ఉండినట్లయితే 5 వేల సంవత్సరాల క్రితమే హరప్పా వాసులు మన గొప్ప నాగరికతను నిర్మించి ఉండేవారు కాదని ఆరెస్సెస్‌కు అర్థం కావడం లేదు. వెయ్యి సంవత్సరాల క్రితం వరకు భారతదేశంలో శాకాహార ఉత్పత్తి జరిగి ఉండలేదు. ఆహారంతో సహా అన్ని రంగాల్లోనూ సమానత్వాన్ని రద్దు చేసి పడేశారు. హిందూ కుల అంతరాల వ్యవస్థకే కాదు. భారతీయ ఇస్లాం, భారతీయ క్రిస్టియానిటీకి కూడా ఇది పెద్ద సమస్యగానే ఉంటోంది.

మన గ్రామాల్లో నేటికీ గుణాత్మకమైన మార్పు జరగలేదు. ఆలయం అదే కులధర్మంతో నడుస్తోంది. కులాంతర వివాహాలు చేసుకున్న యువతీయువకులను చంపేయడాన్ని, గర్భగుడిలోకి ప్రవేశించిన దళితులపై దాడి చేయడాన్ని అది ఆమోదిస్తోంది. హిందూ దేవుళ్ల కంటే ఓటుహక్కే దళితులను కాపాడుతోంది. పూజారి వైఖరి మాత్రం కులధర్మాన్ని ఆచరిస్తూనే సాగుతోంది. ఇదే అన్ని అసమానతలకు తల్లివంటిది. మనం ఆలయాన్ని మార్చలేనట్లయితే, ప్రతి పాఠశాలలో ఉదయం ఇలా ప్రార్థన చేయవలసిందిగా మన విద్యార్థులను కోరదాం. ఆలయ దేవుడు సమానత్వం తేనట్లయితే, పాఠశాల దేవుడు దేశంలో సమానత్వాన్ని తెచ్చేలా చేద్దాం.

దేవుడా మమ్మల్ని సమానులుగా సృష్టించావు
దేవుడా స్త్రీపురుషులను సమానులుగా సృష్టించావు
దేవుడా మాలో కులాలు లేకుండా సృష్టించావు
దేవుడా మామధ్య అంటరానితనం లేకుండా చేశావు
దేవుడా పనిచేసి జీవించమని మా అందరికీ చెప్పావు
దేవుడా మా తల్లిదండ్రులను గౌరవించమని చెప్పావు
దేవుడా గర్విస్తున్న భారతీయులుగా మేం నిన్ను ప్రార్థిస్తున్నాం
దేవుడా భారతీయులందరినీ సమానులుగా సృష్టించావు

వ్యాసకర్త డైరెక్టర్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సహకారం

"భారతీయ జనతా పార్టీకి ఏదో ఒక రకంగా సహకరించేవారికి బెయిల్ వస్తుంది. యడియూరప్ప, జనార్ధన్ రెడ్డి, జైషా, హిమాంత శర్మ, ముకుల్ రాయ్, నారాయణ్ రాణే బెయిల్ పొందారు. బీజేపీకి సహకరించకపోతే జైలే గతి. చిదంబరం, డీకే శివకుమార్ జైలు కెళ్లాల్సి వచ్చింది. కానీ, యడియూరప్ప, జనార్ధన్ రెడ్డిలపై ఉన్న కేసులను సీబీఐ, ఐటీ, ఈడీ ఎందుకు పట్టించుకోవో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాలే వివరించాలి"

– శ్రీవాత్సవ, కాంగ్రెస్ నేత

నిర్లక్ష్యం

"బటాలాలోని బాణా సంచా కర్మాగారంలో పేలుడు కారణంగా 21మంది మరణించడం చాలా బాధ కలిగించింది. శిథిలాల్లో చిక్కుకున్నవారిని సకాలంలో కాపాడగలిగితే బాగుండును. బాధితులకు నష్ట పరిహారం చెల్లించడంతోపాటు, తగిన రక్షణ చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలి. ఇంతటి ఘోరానికి ఎవరి నిర్లక్ష్యం కారణమో, వారిని వెంటనే అరెస్ట్ చేయాలి"

– హర్ సిమ్రాత్ కౌర్ బాదల్, కేంద్ర మంత్రి

విద్య

"ముస్లింలు చిన్నతనం నుంచే తమ పిల్లలను మదరసాలకు పంపిస్తారు. మనం కూడా మన పిల్లలను క్రిస్టియన్ మిషనరీలకు పంపుతాం. మరి హిందువుల గురుకులాల పరిస్థితి ఏంటి? మనకు మతపరమైన విద్య అవసరం లేదా? వేరే సంస్థ ఏదైనా ఉందా? ఓసారి దీని గురించి ఆలోచించండి"

– వినిత రాజ్ పుట్, టీచర్

ప్రేమ

"ఢిల్లీని ప్రేమించకుండా ఉండటం అసాధ్యం. పాత, కొత్తల మేలుకలయిక. ఎన్నో ఉత్థానపతనాల కథనాలను ఈ నగరం మనతో పంచుకుంటుంది. భారత దేశం చరిత్ర సృష్టిస్తున్న సందర్భంలో, ఇంద్రప్రస్థగా తిరిగి వెలుగొందనున్న సందర్భంలో మన ఇక్కడ ఉండగలగడం నిజంగా అదృష్టమే"

– శిల్పా నాయర్, బీజేపీ నేత

గొంతు

"కశ్మీర్‌లో నేను విన్న గొంతుల గురించి చెప్పాలనుకుంటున్నా. బీజేపీ మమ్మల్ని మోసం చేసింది. ఇలా చేయడానికి వాళ్లెవరు? ఒకవేళ అంతా సాధారణంగానే ఉన్నట్లయితే, మమ్మల్ని ఎందుకు పంజరంలో పెట్టినట్టు బంధించారు. మీరైనా ఈ రెండు మూడు రోజుల్లో మీరు చూసిందీ, విన్నదీ రాస్తారా? లేకపోతే మీరుకూడా అంతా బాగానే ఉందని అంటారా?"

– సోనియా సర్కార్,జర్నలిస్ట్

ఆంధ్రాబ్యాంక్ మటుమాయం!

ఆంధ్రా బ్యాంక్ జాతీయ ఉద్యమంలో ఆవిర్భవించిన ఒక ముఖ్య ఘట్టం సహకార ఉద్యమం. 1904లో లార్డ్ కర్జన్ వైస్రాయ్‌గా ఉన్నప్పుడు మొదటి కోఆపరేటివ్ సొసైటీ యాక్ట్ అమలులోకి వచ్చింది. భారత జాతీయ కాంగ్రెస్ సహకార ఉద్యమానికి, వ్యవస్థకి ప్రోత్సాహం ఇచ్చింది. ఆ ఉద్యమంలో ఒక అంశం ప్రతి గ్రామంలో ఒక బ్యాంక్‌ని నెలకొల్పడం. బందరులో డాక్టర్ పట్టాభి సీతారామయ్య, కోపల్లె హనుమంతరావు, ముట్నూరి కృష్ణారావు అనేక సంస్థలని, సంస్కరణలను చేపట్టారు. 1915లో పట్టాభి సీతారామయ్య రూ. 50 వేలతో కృష్ణా జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్‌ను స్థాపించారు. ఆ బ్యాంక్ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌గా ఎదిగింది. పట్టాభిగారు 1919-1921లో ఆంధ్ర ప్రావిన్షియల్ కోఆపరేటివ్ కాన్ఫరెన్స్‌కి అధ్యక్షులుగా పనిచేశారు. ఆయన పొదుపు ఎలా చేయాలో, ప్రజలకు ధనసహాయం ఎలా చేయాలో నేర్పారు. మహాత్మా గాంధీ ఆంధ్ర ప్రదేశ్‌కు వచ్చినప్పుడు పట్టాభిగారిని ఉద్దేశించి 'ధనం సద్వినియోగం చేయడంలో, పొదుపు చేయడంలో పట్టాభి ఒక మంచి కాంగ్రెస్ కార్యకర్త' అన్నారు. 1923లో పట్టాభిగారు ఆంధ్రాబ్యాంక్‌ను స్థాపిం చారు. సామాన్య మానవునికి, రైతుకీ, చిన్న వ్యాపారికీ ధనం అందుబాటులో ఉంచడానికి వీలుగా ఈ వ్యవస్థని పెట్టి రెండు సంవత్సరాలలో 12 శాతం డివిడెండ్ ప్రకటించారు. ఆంధ్రా బ్యాంక్‌ను స్థాపించడం కూడా జాతీయ ఉద్యమంలో ఒక భాగం అన్నారు.

బ్యాంక్‌ను స్థాపించడానికి లక్ష రూపాయలు సేకరించినప్పటికీ బ్రిటిష్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం సులభం కాలేదు. ఇంపీరియల్ బ్యాంక్ బందరు మేనేజర్ గార్డన్ అడ్డుపెట్టగా, పట్టాభిగారు మద్రాస్ వెళ్లి ప్రాంతీయ మేనేజర్ ల్యాంబ్‌ను కలిసి పోరాటంలో విజయం సాధించారు. ఆంధ్రా బ్యాంక్ స్వాతంత్ర్య ఉద్యమంలో కట్టుబానిసత్వం నుంచి ఆర్థిక స్వాతంత్ర్యానికి అద్దంపట్టిందన్నారు.



డా॥ పట్టాభి సీతారామయ్య

ఆంధ్రా బ్యాంక్ జాతీయ ఖ్యాతి గడించడం ఒక ముఖ్య విషయం అని ఆయన గర్వపడ్డారు. 1969లో ప్రధాని ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయం చేసి, అందుకు కారణం పేద రైతుకి, శ్రామికుడికీ, కార్మికుడికీ ధనం అందుబాటులో ఉంచడమే అన్నారు. అప్పటి ఆంధ్రా బ్యాంక్ చైర్మన్ కె. గోపాలరావు దీటుగా 50 ఏళ్ల క్రితం మా ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకులు ముందుచూపుతో, ఆ లక్ష్యాలతోనే ఆంధ్రాబ్యాంక్‌ను స్థాపించార'ని అన్నారు. ఆంధ్రా బ్యాంక్ చరిత్ర జాతీయ ఉద్యమంలో భాగం. ఆంధ్రుల ఆత్మగౌరవానికి సేవాభావానికి చిహ్నం. పవిత్రమైన ఆశయాలతో స్థాపితమై క్రమంగా జాతీయ స్థాయికి ఎదిగిన ఆంధ్రా బ్యాంక్ పేరుని మార్చడం ఆంధ్రులకు అవమానం.

ప్రొ॥ అయ్యగారి ప్రసన్నకుమార్,
విశాఖపట్నం

వృత్తిని గౌరవించే మహోపాధ్యాయుడు

సందర్భం

ప్రొఫెసర్ జి. లక్ష్మణ్

భారతీయ దార్శనిక చింతనాధోరణులను, సంస్కృతిని పాశ్చాత్య దేశాలకు తనదైన శైలిలో రచనలద్వారా తెలియజేసిన గొప్పరచయిత, విద్యావేత్త, వేదాంతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు. సంస్కృత భాషలోని భవద్గీత, బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులకు (ప్రస్థానత్రయ) ఆంగ్లంలో గొప్ప వ్యాఖ్యానాలు రాసి భారతీయ దర్శనానికి గల విశిష్టతను తాత్విక మూలాలను ఆవిష్కరించి భావవాద కోణంలో భారతీయదర్శనాన్ని రచించి పాశ్చాత్యులు ఆ దర్శనాన్ని ఆసక్తితో అధ్యాయనం చేసేలా కృషిచేసిన వేదాంతి రాధాకృష్ణన్. ఆయన వల్లనే భారతీయ దర్శనం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందనడంలో అతిశయోక్తిలేదు. వారి మేధోసంపత్తిని గుర్తించి ప్రపంచవ్యాప్తంగా వున్న వివిధ దేశాల్లోని విశ్వవిద్యాలయాలు 110 డాక్టరేట్ పురస్కారాలు అందజేశాయి. ఆయన సుమారు 150 గ్రంథాలు రచించారు. వీటిలో ముఖ్యమైనవి 'ఇండియన్ ఫిలాసఫీ', 'ద హ

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ గురువారం
5-9-2019



మనకున్నదానితో సంతృప్తి పడడం ఉత్తమం..
మనకున్న జ్ఞానం చాలనుకోవడం అజ్ఞానం
- డా. సర్వేపల్లి రాధాకృష్ణన్,
మాజీ రాష్ట్రపతి

గురుబ్రహ్మ.. గురువిష్ణు..
గురుదేవో మహేశ్వరః
త్రిమూర్తుల అంశతో వెలిగే జ్ఞానజ్వాల గురువు. లోకంలో ప్రతిఫలించే ఈ వెలుగంతా గురువుల నుంచి ప్రజ్వరిల్లుతున్నదే. అక్షరాల్ని దిద్దించడమే కాదు, జీవితాన్ని కూడా పక్కన ఉండి శ్రద్ధగా దిద్దుతారు గురువులు. అలాంటి ఒక గురువు సర్వేపల్లి రాధాకృష్ణన్. అలాంటి వెలుగుల వర్ణాలే ఆయన దిద్దివెళ్లిన విలువలు. నేడు ఆయన జన్మదినం. ఉపాధ్యాయ దినోత్సవం. ఈ సందర్భంగా.. మట్టిలోంచి ఒక గాయనిని మొలకెత్తించిన 'గురుకోటి', విశ్వాంతరాళాలపై చిన్నారులకు ఆసక్తి కలిగిస్తున్న 'గురుకృష్ణ', అత్యుత్తమమైన ఒక టీచర్‌ని మలిచిన 'గురుభువనేశ్వర'.. ఈ ముగ్గురు గురువుల, వారి వల్ల కాంతులీనుతున్న మూడు దివ్వెల వెలుగు కిరణాలివి.

గురు కోటి
బేబీ గురువు సంగీత దర్శకుడు కోటి

పాటకు నన్ను అంటు కట్టారు

ఫొటో: గరగ ప్రసాద్

● బేబీ

చీరలకు గంజి పెట్టి, ఆరేస్తూ, మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకుంటూ, మనసు హాయిగా ఉండటం కోసం కూనిరాగాలు తీస్తున్న బేబీని సెల్‌ఫోనులో బంధించి, సోషల్ మీడియాలో ఉంచితే, ఆ వీడియో బేబీని చిత్రసీమకు పరిచయం చేసింది. సింగర్ రఘు కుంచె ఆ పల్లె కోయిల మీద లక్ష్మీభూపాలతో ఒక పాట రాయించి, ఆ పాటను చిత్రీకరించి యూట్యూబ్‌లో ఉంచారు. ఆ పాటకు పాతిక లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇప్పుడు 'పలాస' చిత్రంతో తొలి సారిగా నేపథ్యగాయనిగా గళం విప్పిన ఈ పల్లె కోయిల పసల బేబీ మదిలోని రాగాలివి.

'పలాస' సినిమా కోసం బాలు గారితో గొంతు కలిపే అవకాశం రావడం నాకు దొరికిన అదృష్టం. పెద్ద పండుగ. ఎంతో పుణ్యం చేసుకుంటేనే ఈ అదృష్టం దక్కుతుంది. ఈ పాట ముందర నాతో విడిగా పాడించారు. నేను పాడుతున్నప్పుడు నాతో బాలుగారు పాడుతున్న విషయం నాకు తెలియదు. ట్రాక్ కోసం నేను రఘుగారు కలిసి పాడాం. బాలుగారితో నేను పాడుతున్నానని చెప్పడానికి రఘు గారు సంశయించారు. పాట పూర్తయిపోయింది. ఆయన దగ్గరకువెళ్లి ఈ పాట వినిపించగానే, నా గొంతు విని 'ఎవరు పాడారు?' అని ఆయన అడిగారట. రఘుగారు నా పేరు చెప్పారట. ప్రొఫెషనల్‌గా పాడానని బాలు గారు దీవించారట. పల్లెపాటల అమ్మాయితో పాడటం తనకు సంతోషంగా ఉందని కూడా బాలుగారు అన్నారట. చదువు, సంధ్య, సంగీత జ్ఞానం లేని నాకు బాలుగారితో పాడే వరం లభించింది. ఇందుకు ముందుగా నేను కోటి గారికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

శత 'కోటి' వందనాలు

'మట్టిమనిషినండి నేను'.. అనే పాటనే లక్ష్మీ భూపాలగారితో రాయించి, రఘు కుంచెగారు ట్యూన్ చేసి, నా మీద షూటింగ్ చేసి నాతో పాడించి, నన్ను ప్రపంచానికి పరిచయం చేశారు. ఆయనకు శతకోటి వందనాలు.

పాటకు నన్ను అంటు కట్టారు. నన్నొక మొక్కలా నాటి, నీళ్లు పోసినందుకు ఆయన ఋణం తీర్చుకోలేను. ఇటీవలే 'రాణు మోండల్' అనే బెంగాలీ యాచకురాలు రైల్వే ప్లాట్ ఫామ్ మీద పాడిన షోర్ చిత్రంలోని 'ఏక్ ప్యార్ క నగ్మా హై' పాటతో ప్రపంచాన్ని తన వైపుకు తిప్పుకున్నారు. నాకూ అవకాశాలు వస్తే మరింత బాగా పాడి, మరింతమందికి చేరువ కావాలని ఆశపడుతున్నాను. ఇక్కడ ఒక విషయం. కోటిగారు నన్ను హైదరాబాద్ రప్పించి, పెద్దపెద్దవాళ్లందరికీ నన్ను పరిచయం చేశారు. అంతవరకు నాకు హైదరాబాద్ అంటేనే తెలియదు. ఇక్కడితో ఆగకుండా నన్ను దుబాయ్ కూడా తీసుకువెళ్లారు. విమానం ఎలా ఎక్కాలో కూడా నాకు తెలియదు. అక్కడ కదిలే మెట్లు ఎక్కుతున్నప్పుడు నేను పడిపోతుంటే, ఆయన చెయ్యి ఇచ్చి నాకు అండగా నిలిచారు. పల్లెటూరి వాళ్లం కదా! మాకు అభిమానాలు ఎక్కువ ఉంటాయి. ఎవరైనా మాట్లాడకపోయినా కూడా చాలా బాధ పడతాం. కోటిగారు నాకు ఎన్నో పాటలు పంపుతున్నారు, నేను పాడి వాటిని ఆయనకు పంపితే, ఆయన తప్పులు సరిచేస్తున్నారు. ఇప్పుడు మరింత బాగా పాడేందుకు ప్రయత్నిస్తున్నాను.

రాసుకుని సాధన చేస్తున్నాను

ఎవరు ఏ పాట అడిగితే ఆ పాట బాగా సాధన చేసి వేదికల మీద పాడుతున్నాను. కోటిగారి సలహా మీద తెలుగు బాగా చదవగలుగుతున్నాను. ప్రతి పాట రాసుకుని చదువుతూ పాడుతున్నాను. నేను వందేళ్లు బతక్కపోయినా పరవాలేదు, ఒక మంచి పాట పాడి నాలోని గాయకురాలిని చిరస్మరణీయం చేయాలన్నదే నా కోరిక. 'తీపి రాగాల తోటి మా ఊరు దాటి మీ కోసమొచ్చాను. యాతమేసి తోడాను నాలో ఉన్న రాగాలను' నన్ను సినిమా పరిశ్రమ అక్కున చేర్చుకుని, నా చేత ఇంకా ఇంకా తోడించమని అర్థిస్తున్నాను.

– వైజయంతి పురాణపండ

అందరూ ప్రోత్సహించాలి...

బేబీ గాత్రంలో పలికే గమకాల వల్ల ఆవిడ ఏ పాట పాడినా చక్కగా ఉంటోంది. అది దేవుడు ఇచ్చిన వరం. రఘు కుంచె పాడించిన మొదటి పాట బాగా హిట్ అయింది. ఆవిడను సినీ పరిశ్రమలోని సంగీత దర్శకులు పాడించి, ప్రోత్సహించి పెద్ద స్థాయికి తీసుకురావాలన్నదే నా కోరిక. ఆవిడ చదువుకోలేదు, చిన్నతనం నుంచి పాటలు పాడిన జ్ఞానమే ఆవిడను ఈ స్థాయికి తీసుకు వచ్చింది. ఆవిడకు నేను అక్షరాభ్యాసం చేశాను. ఒక టీచర్‌ని పెట్టి అక్షరాలు నేర్పిస్తున్నాను. నాన్నగారి (సాలూరి రాజేశ్వర రావు) పాటల లింకులు పంపిస్తుంటే అన్నీ బాగా నేర్చుకుని పాడుతున్నారు. దోషాలు ఉంటే సరిచేస్తున్నాను. బాగా సాధన చేసి వేదికల మీద పాడుతున్నారు.

– కోటి, సంగీత దర్శకులు

గురు దేవో భువనేశ్వర
ఈ టీచర్ గారి గురువు భువనేశ్వర్‌లోని రీజనల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా జాతీయస్థాయి అవార్డుకు ఎంపికై ఈ రోజు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న ఆశారాణి

మళ్లీ టీచర్‌గానే పుట్టాలి

'ఓ సిరా చుక్క లక్ష మెదళ్ల కదలిక'– కాళోజీ కొటేషన్ లైబ్రరీలో ఒక వైపు గోడ మీద ఉంది. మరోవైపు 'టు డే ఏ రీడర్, టుమారో ఏ లీడర్' అని ఉంది. అది హైదరాబాద్ నగర శివారులో జీడిమెట్ల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూలు. మరొక గోడకు ఉన్న ఫొటోలు తోలుబొమ్మలాటల్లో ఎన్ని రకాలున్నాయో చెప్తున్నాయి. మరో వైపు రకరకాల సంగీత వాయిద్యాలను పలికిస్తున్న వాద్యకారుల ఫొటోలు. బయటి ప్రపంచాన్ని బడి నాలుగు గోడల మధ్య ఉండగానే తెలియచేసే ప్రయత్నం అది. ఇక లైబ్రరీలో ఆరు రౌండ్ టేబుళ్లు, వాటి మీద కథల పుస్తకాలున్నాయి. బీరువాల్లో చక్కగా అమర్చిన మరెన్నో పుస్తకాలు... ఆ బీరువాలకు తాళాలు లేవు. ఈ లైబ్రరీని నిర్వహిస్తున్నది ఆ స్కూలు పిల్లలే. పిల్లలు తమకు కావల్సిన పుస్తకం తీసుకుని, ఓసారి టీచరుకు చూపించి, వాళ్లే రిజిస్టర్‌లో రాసి ఆ పుస్తకాన్ని ఇంటికి పట్టుకెళ్తారు. చదివి తెచ్చిన తర్వాత బీరువాలో పెట్టి రిజిస్టర్‌లో తేదీని నమోదు చేస్తారు. ఇక్కడ ఇలా ఉంటే, స్కూలు భవనానికి పక్కనే ఉన్న గదిలో మధ్యాహ్న భోజన పథకంలో వండిన భోజనాన్ని హెడ్ మాస్టర్ పరీక్షిస్తున్నారు. ''ఇంత బీరుసుగా ఉంటే పిల్లలు తినేదెలా? మళ్లీ వండమ్మా'' అని చెప్పి బయటికొచ్చి ''అన్నం ఉడుకుతోంది. ఓ పది నిమిషాలు ఆగండ్రా'' అని పిల్లలకు చెప్పి తన గదిలోకి వెళ్లిపోయారు. టీచర్లు బాధ్యతగా ఉండడం వల్లనే, అది పిల్లలకు కూడా అలవడింది. ''మా స్కూల్‌లో ప్రతిదీ ఇంత పర్‌ఫెక్ట్‌గా ఉంటుంది. టీచర్లందరం ఇంతటి అంకితభావంతోనే పని చేస్తాం'' అన్నారు ఆ స్కూల్ ఇంగ్లిష్ టీచర్ ఆశారాణి. ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయురాలిగా జాతీయస్థాయి అవార్డుకు ఎంపికయ్యారామె. టీచర్స్ డే సందర్భంగా ఈ రోజు న్యూఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

ఆశారాణిది శ్రీకాకుళం జిల్లా, టెక్కలి మండలం, సీతాపురం గ్రామం. తండ్రి అప్పారావు మిలటరీ ఉద్యోగి, తల్లి సరస్వతి గృహిణి. ముగ్గురమ్మాయిల్లో ఆశారాణి పెద్దమ్మాయి. తండ్రి ఉద్యోగరీత్యా జమ్మూ–కశ్మీర్‌లో ఉండడంతో ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం టెక్కలిలో అమ్మమ్మగారింట్లోనే పూర్తయింది. తండ్రికి బెంగళూరు ట్రాన్స్‌ఫర్ కావడంతో కుటుంబం బెంగళూరుకు మారింది. అక్కడ తెలుగు మీడియం ఉన్న ప్రభుత్వ పాఠశాలను వెతికి మరీ చేర్పించారాయన. ఆ సంగతులను సాక్షితో పంచుకున్నారు ఆశారాణి. ''మొదటగా మా నాన్నకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఆయన ఫ్రెండ్స్ నీకు మూడు 'మైనస్'లు అని ఆటపట్టిస్తున్నా, ఆయన మాత్రం తనకు అబ్బాయిలు లేరని ఏనాడూ అసంతృప్తి చెందలేదు. పైగా తన ట్రాన్స్‌ఫర్‌లు మా చదువులకు ఇబ్బంది కలిగించకుండా, తెలుగు మీడియం ఉండే విధంగా చూసుకున్నారు. బెంగళూరు తర్వాత ఉద్యోగం పోర్ట్‌బ్లెయిర్ (అండమాన్ నికోబార్ దీవుల రాజధాని)లో. నాకు ప్లస్ టు పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నారు. మిలటరీ క్వార్టర్స్‌లో పెరగడంతో తమిళ, కన్నడ, మలయాళీ, ఉత్తరాది భాషలన్నింటితోనూ పరిచయం ఉండేది. పైగా పెద్ద వాగుడుకాయని కూడా. అలాంటిది కాలేజ్ కొచ్చిన తర్వాత గొంతు పెగిలేది కాదు.

ఇంగ్లిష్ భయంతో క్లాస్ ఎగ్గొట్టాను

ప్లస్ టులో మంచి ర్యాంక్ రావడంతో భువనేశ్వర్‌లోని రీజనల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో సీటు వచ్చింది. అది బిఏ, బిఈడీ కలిసిన నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు. పూర్తిగా ఇంగ్లిష్ మీడియం. అర్థం చేసుకోగలిగినా సరే, ధైర్యంగా మాట్లాడలేకపోయేదాన్ని. టీచింగ్ క్లాసులంటే చచ్చేంత భయం వేసేది. కడుపు నొప్పి అని ఒకరోజు, తలనొప్పి అని ఒక రోజు క్లాసులు ఎగ్గొట్టాను కూడా. అలాంటిది నేను ఇంగ్లిష్ టీచర్‌నయ్యానంటే మా ఫ్రెండ్స్ ఇప్పటికీ ఏడిపిస్తుంటారు.

ఆర్మీ స్కూల్లో తొలి ఉద్యోగం

నాన్న రిటైరైన తర్వాత మా కుటుంబం హైదరాబాద్‌కొచ్చింది. నేను ఉస్మానియాలో ఎం.ఎ హిస్టరీలో చేరాను. పీజీ పూర్తయ్యాక ఆర్మీ స్కూల్‌కి ఇంటర్వ్యూకెళ్లడం ఒక పాఠమే అయింది. ఉద్యోగం వచ్చింది కానీ సెకండ్ క్లాస్ టీచర్‌గా. నాకు బీఎడ్ ఉంది, పీజీ ఉంది, పెద్దక్లాసు ఇవ్వడానికి అన్ని అర్హతలూ ఉన్నాయి. అయితే ఇంగ్లిష్ అనర్గళంగా మాట్లాడలేకపోవడం వల్లనే అలా జరిగింది. అయితే అక్కడి పిల్లలతో మాట్లాడి, మాట్లాడి నాకు ఇంగ్లిష్ వచ్చేసింది. తర్వాత 1994లో డిఎస్‌సి రాసి సెలెక్ట్ అయ్యాను. శంకర్‌పల్లి మండలంలోని సంకేపల్లిలో పోస్టింగ్. ఐదు తరగతులున్న పాఠశాలకు ఇద్దరే టీచర్లం. తర్వాత రెండేళ్లకు మోఖిలాలోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌కి బదిలీ. అక్కడ పెద్ద క్లాస్‌లకు ఇంగ్లిష్ చెప్పగలిగిన లాంగ్వేజ్ స్కిల్ ఉన్న వాళ్లలో నేనే బెటర్ అయ్యాను. అలా నా ప్రమేయం లేకుండా ఇంగ్లిష్ టీచర్‌నయ్యాను. యూనిసెఫ్ ప్రోగ్రామ్‌లో భాగంగా న్యూయార్క్ నుంచి డాక్టర్ కెరోల్ బెలోమీ మా స్కూలుకి వచ్చారు. ఆమెతో ఇంటరాక్ట్ అయ్యి, ట్రాన్స్‌లేటర్‌గా వ్యవహరించడం ఊహించని అవకాశం. ఆ టాస్క్‌ని విజయవంతంగా చేయగలిగినా సరే... ఎందుకో అసంతృప్తిగా అనిపించేది. దాంతో ఇంగ్లిష్‌లో ఎం.ఎ చేశాను. ఇంగ్లిష్ ఎం.ఏ ఎన్నో అవకాశాలను నా ముందుకు తెచ్చింది'' అన్నారు ఆశారాణి.

పిల్లలకు ఎల్లలు ఉండకూడదు

2017లో కాలిఫోర్నియాలో 'టీచింగ్ ఎక్స్‌లెన్స్ అండ్ అచీవ్‌మెంట్ ప్రోగ్రామ్'లో పాల్గొన్నారు ఆశారాణి. ఆరు వారాల పాటు అక్కడి స్కూల్స్‌ని విజిట్ చేయడం, మన విద్యావిధానంలోకి తీసుకోగలిగిన మంచి విధానాలను గుర్తించడం, మన దేశ కల్చర్ గురించి అక్కడి పిల్లలకు తెలియచేయడం ఆ ప్రోగ్రామ్ ఉద్దేశం. మన దగ్గర గవర్నమెంట్ స్కూల్స్‌లో ప్రాజెక్టర్ ఉండదని తెలుసుకున్న కాలిఫోర్నియా పిల్లలు వాళ్ల దగ్గర అదనంగా ఉన్న ప్రాజెక్టర్‌ని మనకు బహూకరించారు. ఆశారాణికి ఆ ప్రోగ్రామ్‌కు హాజరైన ఇరవై దేశాల టీచర్లతో పరిచయం అయింది. ఆ టీచర్ల సహకారంతో కజకిస్తాన్, నేపాల్ దేశాల పిల్లలను స్కైప్‌లో నేరేడ్‌మెంట్ స్కూల్ పిల్లలకు పరిచయం చేశారు. ''భాష, ప్రాంతం, దేశం అనే ఎల్లలు లేకుండా పిల్లలు యూనివర్సల్‌గా పెరగాలి. జ్ఞానం ఎక్కడ ఉన్నా సరే ఆ జ్ఞానాన్ని అందుకోవడానికి పిల్లలే వారధులు కాగలగాలి'' అన్నారామె.

ఆశారాణికి ఉపాధ్యాయినిగా ఇరవై నాలుగేళ్లు నిండాయి. పిల్లలకు పాఠాలతోపాటు పదిహేడేళ్లు టీచర్లకు ట్రెనింగ్ ఇచ్చారామె. 1997లో ఢిల్లీలోని సీసీఆర్‌టీలో తోలు బొమ్మలతో పాఠాలు చెప్పడంలో శిక్షణ పొందిన ఆశారాణి ప్రైమరీ స్కూలు పిల్లలకు బొమ్మలతో పాఠాలు చెప్పేవారు. ''అంకిత భావంతో పని చేస్తే ఫలితాలు తప్పకుండా కనిపిస్తాయి. టీచర్‌కి ప్రొఫెషన్ మీదున్న నిబద్ధత పిల్లల ఫలితాల్లో కనిపిస్తుంది. పాఠాలు చెప్పేసి ఉద్యోగం అయిపోయిందనుకోకుండా ఇన్నేసి బాధ్యతలను తలకెత్తుకోవడానికి నేను సింగిల్ కావడం కూడా ఒక కారణం కావచ్చు'' అన్నారామె నవ్వుతూ.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: దత్తు గుంటుపల్లి

ఆ కాలేజే నడిపించింది

ఇంగ్లిష్ టీచర్‌గా కుత్బుల్లాపూర్, శంకరపల్లిలోని ప్రొద్దుటూరుతోపాటు ఈ స్కూల్‌లో (జీడిమెట్ల స్కూలు) ఐదేళ్లు చేశాను. 2009 నుంచి 2018 వరకు నేరేడ్‌మెట్ స్కూల్లో పని చేసి మళ్లీ ఇక్కడికి వచ్చాను. అప్పుడు నా దగ్గర చదువుకున్న పిల్లలు పెద్దయి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. నేను వచ్చానని తెలిసి స్కూలుకి వచ్చి పలకరిస్తుంటారు. ఒకసారి పనిచేసిన స్కూల్‌కి మళ్లీ వస్తే స్వీట్ మెమోరీ అవుతుందని వచ్చిన తర్వాతే తెలిసింది. వృత్తికి అంకితమై పోయి, పిల్లలతో మమేకం అవడాన్ని భువనేశ్వర్ కాలేజ్ నేర్పించింది. కేంద్రీయ, నవోదయ విద్యాలయాల్లో టీచర్లలో ఎక్కువ మంది ఆ కాలేజ్ వాళ్లే ఉంటారు. నేను జూనియర్ లెక్చరర్‌గా వెళ్లకుండా గవర్నమెంట్ స్కూలు పిల్లలకు చదువు చెప్పాలని నిర్ణయించుకోవడం వెనుక ఉన్నది కూడా మా కాలేజ్ నేర్పించిన సామాజిక బాధ్యతే. మా స్కూళ్లలో చాలామంది పిల్లలకు... తల్లిదండ్రులు హయ్యర్ స్టడీస్ గురించి గైడెన్స్ ఇవ్వగలిగిన స్థితిలో ఉండరు. దాంతో ఆ బాధ్యత కూడా మేమే తీసుకోవాలి. టీచర్ బాధ్యత పిల్లలకు చదువు చెప్పడంతో పూర్తి కాదు, మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి వాళ్ల మీద ప్రభావం చూపించాలి. అందుకే నేను ఉపాధ్యాయ వృత్తిని అంతగా ఆరాధిస్తాను.

– ఆశారాణి, ఉత్తమ ఉపాధ్యాయిని

గురు కృష్ణ
కాంచన బాలశ్రీని స్పేస్ క్విజ్‌కు ప్రోత్సహించిన గురువు కృష్ణారావు

ఇంజనీర్ అవుతా



స్పేస్ క్విజ్ విజేత ప్రగడ కాంచనబాల శ్రీవాసవి

శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలంలోని ఈదులవలస ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని ప్రగడ కాంచనబాల శ్రీవాసవి ఇస్రో నిర్వహించిన జాతీయస్థాయి స్పేస్‌క్విజ్‌లో ఎపీలోనే ప్రథమ స్థానం దక్కించుకుంది. ఇరవై ప్రశ్నలకు కేవలం పది నిమిషాల్లోనే సమాధానాలు ఇచ్చి ఇస్రో దృష్టిని ఆకర్షించింది దాంతో ఈనెల 7వ తేదీన ఇస్రో 'రోవర్' చంద్రుడి మీదకు దిగుతున్న దృశ్యాన్ని ప్రత్యక్ష ప్రసారంలో బెంగుళూరు పరిశోధనా కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీతో కలసి వీక్షించే అవకాశం ఆమెకు లభించింది. ఆ అపురూపమైన ఘడియలను చూసే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించడం కోసం 'ఇస్రో' తలపెట్టిన క్విజ్ కు సంబంధించిన సర్క్యులర్ జూలైలోనే ఏపీ మోడల్ స్కూళ్లకు అందింది. ఆ మేరకు ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ నిర్వహిస్తున్నట్లు పత్రికా ప్రకటన వెలువడింది. ఆగస్టు పది నుంచి ఇరవై ఐదవ తేదీ వరకు ఈ ఆన్ లైన్ క్విజ్ కొనసాగింది. ఈదులవలస ఆదర్శ పాఠశాల నుండి నలభై మంది విద్యార్థులు క్విజ్‌లో పాల్గొనగా కాంచన బాలశ్రీ రాష్ట్రం నుండి ప్రథమ విజేతగా నిలిచింది. తనకు లభించిన అరుదైన అవకాశం గురించి చెబుతూ భవిష్యత్తులో తను ఇంజనీరు కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపింది. చిన్నపుడే తండ్రి గోవిందరావును కోల్పోయిన కాంచనబాలశ్రీ ని తల్లి తేజేశ్వరి చదివిస్తోంది. కాంచనకు హారతి అనే చెల్లి కూడా వుంది.

– చింతు షణ్ముఖరావు, సాక్షి, పోలాకి

అటల్ ల్యాబ్‌తో మరింత సౌకర్యం



గతేడాది మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మా పాఠశాలకు 'అటల్‌ల్యాబ్'ను మంజూరు చేసింది. దీంతో భౌతికశాస్త్రం పట్ల విద్యార్థులలో ఆసక్తి కలుగుతోంది. కాంచన బాలశ్రీ భౌతికశాస్త్రంపై మక్కువ చూపించే విద్యార్థి. ఆమెకు ఉన్న ఆ మక్కువే ఆమెను ఇస్రో నిర్వహించిన జాతీయ స్థాయి స్పేస్‌క్విజ్ లో విజేత అయ్యేలా చేసింది.

– బి. కృష్ణారావు, భౌతికశాస్త్ర అధ్యాపకుడు, ఈదులవలస ఆదర్శ పాఠశాల

చెట్టు నీడ

పైపై పూతలు మనుషులకే!

ఒకసారి యేసుక్రీస్తు యెరికో పట్టణం గుండా వెళుతున్నాడు. అప్పుడు పన్ను వసూలు చేసే అధికారి జక్కయ్య అనే వ్యక్తి యేసు గురించి అప్పటికే ఎంతో గొప్పగా విని ఉండటం చేత యేసు ఎవరో చూడాలనుకున్నాడు. అతడు ధనవంతుడు. కాని పొట్టివాడు కావడంతో యేసును చూడాలనుకొని ఆయన చుట్టూ చేరిన జనసందోహంలోకి చొచ్చుకుని పోయి యేసును చూడలేకపోయాడు. దాంతో అతను ఒక మేడి చెట్టు ఎక్కి యేసును తదేకంగా చూడసాగాడు. అతని అంతరంగాన్ని, తన పట్ల అతనికి గల ప్రేమాభిమానాలను గుర్తించిన యేసుక్రీస్తు అతనితో – జక్కయ్యా త్వరగా చెట్టు దిగి రమ్ము, ఈ రోజు నేను నీ గృహంలో విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నానన్నాడు. అందుకతడు సంతోషించి, యేసును అతని ఇంటికి ఆహ్వానించాడు. అందరూ అది చూసి 'ఇదేం విడ్డూరం! ఈయన పాపియైన మనుష్యుని ఇంట బస చేయడానికి వెళ్లాడు' అని గుస గుసలాడుకోసాగారు. యేసును చూసిన ఆనందంతో జక్కయ్య – ప్రభువా నా ఆస్తిలో సగం బీదలకిచ్చేస్తాను. నేను ఎవరి వద్దనైతే అన్యాయంగా దేనినైనను సంపాదించిన యెడల అంతకు నాలుగు వంతులు అదనంగా ఇస్తానని ఆయన పాదాల నంటి వాగ్దానం చేశాడు. అందుకు యేసు – జక్కయ్యా! నీవు కూడా అబ్రహాము కుమారుడవే, నేడు ఈ ఇంటికి 'రక్షణ' వచ్చింది, పాడైపోయిన వ్యవస్థను చూచి, రక్షించుటకే మనుష్య కుమారుడు వచ్చాడని చెప్పాడు (లూకా 19:1–10). మనుషుల అంతరంగాన్ని ఎరిగి నందుననే పాపిగా మనుష్యులు సణుగుకొన్న జక్కయ్య ఇంటికి వెళ్లాడు యేసుక్రీస్తు. పాపిగా ఎంచబడ్డ గోడను అడ్డు తొలగించి రక్షణ కలిగించాడు. ఈ తేడాలు, మనుష్యులకే కాని దేవుని దృష్టిలో అందరూ సమానులేనని చెప్పకనే చెప్పాడు. పై పై రూపాలు, పైపై పూతలను చూసి మోసపోయేది మనుషులే కాని, దేవుడు కాదు కదా... యెహోవా హృదయమును లక్ష్యపెట్టాడు. అందుచేత హృదయములోని తలంపు యెరిగి జక్కయ్య వద్దకు యేసుక్రీస్తు వెళ్లాడు (1 సమూ 16:7).

– బి.బి.చంద్రపాల్ కోట

ఇంటిప్స్

- దోస, బీర కాయలు కొన్ని చేదుగా ఉంటాయి. చెక్కు తీసే ముందే వాటిని మధ్యలోకి విరిస్తే చేదుబారవు.
- తేనె స్వచ్ఛత తెలియాలంటే, ఒక కప్పు నీటిలో ఒక స్పూన్ తేనె వేయాలి. నీటిలో కరగకుండా అడుగుకు చేరితే అది మంచి తేనె.
- వేడి నీటిలో ఉప్పు కలిపి వాడాల్సి వస్తే, నీళ్లు మరిగిన తర్వాత మాత్రమే ఉప్పు కలపాలి. ముందే ఉప్పు వేస్తే మరగడానికి ఎక్కువ సమయం పడుతుంది.
- చికెన్ కాని, మటన్ కాని ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించినట్లయితే గ్యాస్‌తో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. అందులోని పోషకాలు నశించకుండా ఉంటాయి.
- వెల్లుల్లి పొట్టు త్వరగా రావాలంటే అరగంట సేపు నీటిలో నానబెట్టాలి.
- వేపుళ్లను తగ్గించి, ఉడికించినవి తినడం అలవాటు చేసుకుంటే శరీరంలోకి చేరే కొవ్వు శాతం తగ్గుతుంది.
- కాపర్ బాటమ్ పాత్రలు తళతళ మెరవాలంటే మామూలుగా వాడుతున్న క్లీనింగ్ పౌడర్ కాని సబ్బు కాని వేసి మెటల్ స్క్రబ్బర్‌తో శుభ్రం చేయాలి.

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ గురువారం
5-9-2019

సినీ పాఠాలు

పెండితెర గురువులు

గురు బ్రహ్మ.. గురు విష్ణు.. అని శ్లోకం ఉంది నిజమేగానీ సినిమా వాళ్లు దానికి కాస్త ఎక్స్‌టెన్షన్ కొట్టి లెంగ్త్ పెంచి గురు హీరో గురు హీరోయిన్ గురు క్యారెక్టర్ ఆర్టిస్ట్ నమః అని కూడా అనుకున్నారు. స్కూళ్లు, కాలేజీలు లేని సమాజం ఎలా లేదో టీచర్ల, లెక్చరర్ల పాత్రలు లేని సినిమాలు కూడా లేవు. ఆ మిస్సమ్మల, పంతులమ్మల, మాస్టారుల రీ విజిట్.. నేడు టీచర్స్ డే సందర్భంగా.

మిస్సమ్మలో సావిత్రి

'మిస్సమ్మ'లో సావిత్రి కేవలం స్కూల్లో పిల్లలకే టీచర్ కాదు. ఆ సినిమాలోని ప్రతి పాత్రకూ టీచరే. కొంచెం నాన్ సీరియస్‌గా ఉన్న ఎన్.టి.ఆర్‌కు లక్ష్యం ఏర్పరిచిన ఆమే టీచర్. దొంగ బిచ్చగాడు రేలంగిని ఆ దారి వదిలించిన ఆమే టీచర్. తెలిసీ తెలియని వయసులో ఉన్న జమునకు మంచి చెడు తెలియజేసిన ఆమే టీచర్. కంత్రీ విలన్ రమణా రెడ్డికి బడితె పూజ చేయడం తెలిసిన ఆమే టీచర్. 'మిస్సమ్మ'లో సావిత్రిని చూసి చిన్నపిల్లల్లా ప్రతి ఒక్కరూ భయపడేవారే. ఆఖరుకు ఎస్.వి. రంగారావు, బుష్యేంద్రమణి లతో సహా. సినిమాల్లో టీచర్ పాత్రకు గట్టిగా ఫౌండేషన్ వేసిన పాత్ర అది.

'బడిపంతులు'లో ఎన్టీఆర్, అంజలి

కానీ ఆశ్చర్యంగా 'బడి పంతులు'లో ఎన్.టి.ఆర్ పాత్ర అమిత మెత్తన. నెమ్మది, కరుణ, దయ తప్ప ఆ పాత్రకు ఏమీ తెలియదు. పిల్లలు దేవుళ్లు కాబట్టి ఆ పాత్రలోని దైవత్వాన్ని గ్రహించి ఆదరించారు. కానీ కడుపున పుట్టిన సంతానం అవమానం చేసి వేదన మిగిల్చింది. ఆ పంతులును బడి ఎక్కించి నిలబెట్టింది. అయితే మంచితనమే చివరికి గెలుస్తుంది. శిష్యుడు ఫెయిల్ కావచ్చు గాని విలువలకు నిలబడ్డ గురువు ఓడిపోయినట్టు చరిత్రలో లేదు.

సుందరకాండలో వెంకటేశ్

అయితే ఇంట్లో తల్లిదండ్రుల మాట వినని మొండి ఘటాలు కూడా స్కూల్లో ఒక మాస్టారు ముందు మోళీ వేసినట్టుగా తలాడిస్తారనడానికి తార్కాణంగా 'కోడె నాగు' సినిమా వచ్చింది. ఆ సినిమాలో పరమ మొండి ఘటమైన శోభన్ బాబు తన టీచర్ అయిన ఆత్రేయ మాట మాత్రమే వింటాడు. కానీ ఈ శిష్యుడి సంస్కరణలో ఆ గురువు ప్రాణ త్యాగం చేస్తాడు. ఆ గురువుకు నివాళిగా శిష్యుడూ ఆత్మార్పణం చేస్తాడు. గుండెలు పిండే ఈ కథ గురుశిష్యుల అనుబంధాన్ని అజరామరం చేసింది.

రేపటి పౌరులు
విజయశాంతి

బలిపీఠం
శ్రీవిద్య, శోభన్‌బాబు

'మూడు ముళ్లు'లో రాధిక, చంద్రమోహన్

'ఓనమాలు'లో రాజేంద్రప్రసాద్

'విశ్వరూపం'లో ఎన్టీఆర్

'స్కూలు', 'కాన్వెంటు' అనే మాటలు వాడుకలో పెరుగుతున్న వేళ ఆడవాళ్లు టీచింగ్ ప్రొఫెషన్‌లోకి ఎక్కువగా వస్తున్న వేళ 'పంతులమ్మ' అనే సినిమా రావడం విడ్డూరం కాదు. భార్య చనిపోగా, చిన్న పిల్లాడితో అవస్థలు పడుతున్న రంగనాథ్ దగ్గర పంతులమ్మ ఉద్యోగానికి వచ్చిన లక్ష్మి ఆ పిల్లాడికి తల్లిలా మారి గాడి తప్పిన ఆ ఇంటికి ఇల్లాలిగా కూడా మారే ఆ కథ పెద్ద హిట్ అయ్యింది. అయితే 'పూజ'లో మేనమామ కూతురైన కన్నడ మంజులను పెళ్లి చేసుకుందామనుకున్న లెక్చరర్ రామకృష్ణ ఇష్టం లేని వాణిశ్రీని చేసుకుని ఆమెను భార్యగా స్వీకరించలేక క్షోభ పడటం, చివరకు ఆ జంట ఏకం కావడం ఆ వృత్తిలో ఉండేవారికి ఎదురయ్యే 'పరీక్షా కాలం'గా జనం చూశారు. ఇదే సమయంలో వచ్చిన మరో ముఖ్యమైన సినిమా 'బలి పీఠం'. ఇందులో కులమతాల వివక్ష దూరం కావాలని భావించే స్కూల్ టీచర్ శోభన్‌బాబు తనకంటే పైకులం స్త్రీ శారదను వివాహం ఆడి సంఘంలో ఎంతటి హెచ్చుతగ్గుల వ్యవస్థ ఉన్నదో తెలుసుకుంటాడు. యూనిఫామ్ వేసి పిల్లలందరినీ సమానం చేసే క్లాస్‌రూమ్ ఇంట్లో.. బజారులో ఎంత అసమానంగా ఉంటుందో ఈ సినిమాలో తెలుస్తుంది.

అటు పిమ్మట వచ్చిన 'విశ్వరూపం' విద్యార్థి శక్తి తలుచుకుంటే సంఘ నిర్మాణం, దేశ నిర్మాణంలో ఎంత చురుకైన పాత్ర పోషించగలదో చూపించింది. అయితే అందుకు వారిని ఉత్తేజపరచగల గురువు అవసరం. అలాంటి గురువుగా ఎన్.టి.ఆర్ ఈ సినిమాలో గొప్పగా కనిపిస్తారు. కానీ అన్ని సినిమాల్లోనూ ఎన్.టి.ఆర్‌లు ఉండరు. కొన్నింటిలో చంద్రమోహన్‌లు ఉంటారు. 'మూడుముళ్లు' సినిమాలో చంటిబిడ్డతో పల్లెటూళ్లో పాఠాలు చెప్పడానికి వచ్చిన టీచర్ చంద్రమోహన్ అదే ఊళ్లో ఆకతాయిగా తిరుగుతున్న రాధిక మనసు దోచుకుంటాడు. చంద్రమోహన్ సంస్కారాన్ని చూసిన రాధిక ఎలాగైనా సరే అతణ్ణి పెళ్లి చేసుకొని అతని బిడ్డకు తల్లిలా మారాలనుకుంటుంది. ఆమెను అనేకసార్లు ఫెయిల్ చేసిన చంద్రమోహన్ చివరకు పాస్ చేసి అక్కున చేర్చుకుంటాడు.

టి.కృష్ణ వచ్చాక సినిమాల్లో బాధ్యతతో ఉండాల్సిన టీచర్ల పాత్రలు ఎక్కువగా చూపించారు. 'వందేమాతరం'లో స్కూల్ టీచర్‌గా రాజశేఖర్, 'రేపటి పౌరులు', 'ప్రతిఘటన' సినిమాల్లో టీచర్‌గా, లెక్చరర్‌గా విజయశాంతి ప్రేక్షకులను క్లాస్‌రూమ్‌లో కూర్చోబెట్టారు. 'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీతి లోకంలో'... ప్రతి ప్రేక్షకుడు బాధ్యత ఉన్న టీచర్‌గా సంస్కరణకు దిగకపోతే భవిష్యత్తు అంధకార బంధురం అని చెప్పారు.

'శుభలేఖ'లో సుమలత లెక్చరర్. సంతలో పశువును అమ్మినట్టు వరుణ్ణి అతడి తల్లిదండ్రులు అమ్మే వరకట్న దురాచారాన్ని నిర్మూలించడానికి ఆమె గళం ఎత్తుతుంది. కైకాల సత్యనారాయణను ఎదిరిస్తుంది. ఫలితంగా ఉద్యోగం పోగొట్టుకుంటుంది. అయితే ఏం... ఆఖరుకు చిరంజీవిలాంటి ఉత్తముణ్ణి భర్తగా పొందుతుంది. ఈ సినిమాలో కె.విశ్వనాథ్ మూడు విషయాలు చెప్పారు. స్త్రీలు బాగా చదువుకోవాలి. ఉద్యోగం చేయాలి. అమ్మకానికి అబ్బాయిని తెచ్చుకోకుండా ఆత్మగౌరవంతో పెళ్లి బంధంలోకి వెళ్లాలి.

చంద్రమోహన్, విజయశాంతి, చరణ్‌రాజ్

'ఠాగూర్'లో చిరంజీవి

లెక్చరర్ పాత్రలు మాస్ హీరోలను కూడా ఆకట్టుకున్నాయి. అందుకే వెంకటేశ్ 'సుందరకాండ', చిరంజీవి 'మాస్టర్', బాలకృష్ణ 'సింహా' చేశారు. స్టూడెంట్స్‌ను 'యాంటీ కరెప్షన్ ఫోర్స్'గా మార్చి, అవినీతి అధికారులకు ఏకంగా మరణశిక్ష విధిస్తూ సంచలనం సృష్టించింది కేవలం ఒక ప్రొఫెసర్ అంటే అది ఆ వృత్తి గొప్పతనం అనుకోవాలి. 'ఠాగూర్' సినిమాలో చిరంజీవి ఈ పని చేస్తారు.

అయితే ఉపాధ్యాయుడంటే విద్యార్థి బాగు మాత్రమే కోరేవాడు కాదు ఊరు బాగు కూడా కోరేవాడు అని రాజేంద్రప్రసాద్ 'ఓనమాలు' చెప్పింది. ఇందులో టీచరైన రాజేంద్రప్రసాద్ సొంత ఊరు వదిలిపెట్టిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో ఊరికి రావాలని మాతృభూమికి సేవ చేయాలని పిలుపు ఇస్తారు. మార్గదర్శి లేని ఊరు దివిటీ లేని చీకటి దారి అని సందేశం ఇస్తారు.

గీత గోవిందంలో విజయ్ దేవరకొండ

కొత్తతరం హీరోలు కూడా లెక్చరర్లుగా, ట్యూటర్‌లుగా కనపడటానికి వెనకాడటం లేదు. 'గీత గోవిందం'లో విజయ్ దేవరకొండ ఒక మంచి లెక్చరర్‌గా కనపడతాడు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ నుంచి అబ్దుల్ కలామ్ నుంచి స్ఫూర్తి పొందేవారు ఎందరో ఉంటారు. వారు చెప్పిన మంచే ఒక హీరోనో హీరోయినో చెప్తే వెంటనే తాకే యువతరం శాతం ఎక్కువగా ఉంటుంది.

స్టూడియోనే క్లాస్‌రూమ్‌గా కెమెరానే బ్లాక్ బోర్డుగా సాగే ఈ స్ఫూర్తివంతమైన పాఠాలు కొనసాగాలని కోరుకుందాం.

– కె.

మైనపు బొమ్మతో ఖుషీ, బోనీ, జాన్వీ
మహేశ్వరి
తల్లి బొమ్మను తదేకంగా చూస్తున్న జాన్వి

అందమైనపు బొమ్మ

శ్రీదేవి గొప్ప అందగత్తె. అంతకు మించిన గొప్ప నటి. సౌతిండియా నుంచి నార్తిండియా వరకూ తన ప్రతిభతో లేడీ సూపర్‌స్టార్ అయ్యారు. ఓ బ్రాండ్‌లా ఎదిగారు. అనూహ్యంగా గత ఏడాది శ్రీదేవి మరణించారు. అందరి మనసుల్లో చెరిగిపోని బొమ్మగా నిలిచిపోయారు. ఇప్పుడు సింగపూర్‌లోని మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియంలో అందమైన మైనపు బొమ్మగా మారారు శ్రీదేవి. ఈ మైనపు విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. శ్రీదేవి భర్త బోనీ కపూర్, ఆమె కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్, శ్రీదేవి చెల్లెలు మహేశ్వరి ఈ వేడుకలో పాల్గొన్నారు. ''శ్రీదేవి మరణించిన తర్వాత కూడా ఆమె మీద కురిపిస్తున్న అభిమానాన్ని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. తను చేసిన సినిమాల ద్వారా ఎప్పటికీ జీవించే ఉంటుంది. నా భార్యగా తనని ఎంతగా ప్రేమించానో, తన ఆర్ట్‌ని, తనకు సినిమా మీద ఉన్న ప్రేమను అంతే గౌరవించాను. ఈ విగ్రహం తన ఆన వాళ్లకు ఓ చిహ్నంలా ఉంటుందనుకుంటున్నాను'' అన్నారు బోనీ కపూర్. 'మిస్టర్ ఇండియా' సినిమాలోని 'హవా హవాయి..' పాటలో శ్రీదేవి లుక్ ఆధారంగా ఈ మైనపు బొమ్మ తయారు చేశారు.

మరో రీమేక్?

అజిత్

తమిళంలో అజిత్ మంచి క్రేజ్ ఉన్న మాస్ హీరో. అలాంటి హీరో మాస్ ఎలిమెంట్స్ లేని 'పింక్' చిత్రం రీమేక్‌లో నటించి, అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఈ సినిమా 'నేర్కొండ పార్వై'గా తమిళంలో రీమేకై మంచి విజయం సాధించింది. బోనీ కపూర్ నిర్మించారు. ప్రస్తుతం అజిత్ చేస్తున్న 60వ చిత్రాన్ని కూడా బోనీయే నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే అజిత్ మళ్లీ ఓ హిందీ చిత్రాన్ని రీమేక్ చేసే ప్లాన్‌లో ఉన్నారని తెలిసింది. ఆయుష్మాన్ ఖురానా హీరోగా అనుభవ్ సిన్హా రూపొందించిన చిత్రం'ఆర్టికల్ 15'. ఈ చిత్రం తమిళ రీమేక్‌లో అజిత్ నటిస్తారని వార్తలు వస్తున్నాయి. విశేషం ఏంటంటే.. అజిత్ 59వ సినిమాను నిర్మించి, 60వ చిత్రాన్ని కూడా పట్టాలెక్కించిన బోనీ కపూరే ఈ 'ఆర్టికల్ 15' తమిళ రైట్స్ కూడా కొనుగోలు చేశారట. అంటే.. అజిత్‌తో మూడు సినిమాల డీల్‌ని బోనీ కుదుర్చుకుని ఉంటారనుకోవచ్చు.

ప్రియాంక

రెండు అడుగులతో నెట్టింట్లోకి....

హాలీవుడ్ వెళ్లిపోయినా హిందీ సినిమాల్లో కనిపిస్తూనే ఉన్నారు ప్రియాంకా చోప్రా. 'ది స్కై ఈజ్ పింక్' అనే సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తి చేశారామె. ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఒకటి కాదు.. ఏకంగా రెండు నెట్‌ఫ్లిక్స్ చిత్రాలను అంగీకరించారు. ఒకటేమో 'ఏయ్ కెన్ బీ హీరోస్'. ఈ సినిమాను ఇటీవలే ప్రకటించారు. తాజాగా మరో నెట్ ఫ్లిక్స్ చిత్రాన్ని బుధవారం అనౌన్స్ చేశారు. అరవింద్ అడిగా రచించిన 'ద వైట్ టైగర్' నవల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కనుంది. ప్రియాంకా చోప్రా, రాజ్‌కుమార్ రావ్, ఆదర్శ్ గౌరవ్ ముఖ్య పాత్రల్లో నటిస్తారు. ఇరానీ-అమెరికన్ దర్శకుడు రామిన్ బహ్రానీ ఈ సినిమాకు దర్శకుడు. త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనున్న ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ప్రియాంక చోప్రా వ్యవహరించనున్నారు. కథ ఆమెకు అంతగా నచ్చిందట.

అందుకే హీరో అయ్యా!

శ్రీపవార్

శ్రీపవార్. శ్రీనిక క్రియేషన్స్ నిర్మాణంలో రూపొందిన చిత్రం '2 అవర్స్ లవ్'. కృతిగార్గ్ హీరోయిన్‌గా నటించారు. ఈ శుక్రవారం చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీపవార్ మాట్లాడుతూ– ''నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. ఐదేళ్లు సాఫ్ట్‌వేర్ జాబ్ చేశాను. రచన, దర్శకత్వం మీద ఉన్న అభిరుచితో సినిమా రంగానికి వచ్చేశాను. జాబ్ వదిలేసి సినిమా రంగానికి వచ్చినందుకు మా ఇంట్లో వాళ్లు ఏమీ అనలేదు. కారణం వాళ్లకి కూడా సినిమా అంటే చాలా ఇష్టం. పైగా మా అమ్మ చిరంజీవిగారి ఫ్యాన్. సుకుమార్‌గారంటే నాకు ఇష్టం. ఆయన సినిమాల్లో సీన్స్, ఆయన ఆలోచనా విధానం అంటే ఇష్టం. అలాగని ఆయన సినిమాలను కాపీ కొట్టను. '2 అవర్స్ లవ్' కథకు విజయ్ దేవరకొండ సరిపోతారని ఆయన నటించిన 'పెళ్లి చూపులు' చూసి అనుకున్నాను. అయితే పూర్తి కథ రెడీ చేసేసరికి 'అర్జున్ రెడ్డి' విడుదల కావడం, తన క్రేజ్ అమాంతం పెరగడం జరిగిపోయాయి. అంత దూరం వెళ్లలేకపోయాను. ఆ తర్వాత ఓ ఇద్దరు ముగ్గురు హీరోలకు చెబితే సరిగ్గా స్పందించలేదు. దాంతో నేనే హీరోగా చేశాను. కథపరంగా సాయంత్రం నాలుగు గంటలకు ముందు, ఆరు గంటల తర్వాత ఏం జరిగినా హీరోయిన్ పాత్రకు సంబంధం ఉండదు. అందుకే '2 అవర్స్ లవ్' అని టైటిల్ పెట్టాం'' అన్నారు.

'టి మా' అభివృద్ధికి కృషి చేస్తా

– గీతాంజలి


జేవీఆర్, గీతాంజలి, ప్రతాని, గురురాజ్

''నా 55ఏళ్ల సినిమా జీవితంలో ఎన్నో కష్టనష్టాలు అనుభవించాను. అయినా, ఏ రోజూ నిరుత్సాహపడలేదు. నటులు ఎప్పుడూ నిరుత్సాహ పడకూడదు'' అని సీనియర్ నటి, 'టి మా' ఉపాధ్యక్షురాలు గీతాంజలి అన్నారు. తెలంగాణ చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ నూతనంగా ఏర్పాటు చేసిన 'టి మా' (తెలంగాణ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) కార్యవర్గ సభ్యులను హైదరాబాద్‌లో బుధవారం ప్రకటించారు. 'టి మా' అధ్యక్షునిగా జేవీఆర్, ఉపాధ్యక్షులుగా గీతాంజలి, నటుడు బాలాజీ, హీరో దిలీప్ రాథోడ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గీతాంజలి మాట్లాడుతూ– ''సీతారామ కళ్యాణం' చిత్రంతో ఎన్టీరామారావుగారు సీతగా సినీ పరిశ్రమలో నాకొక మంచి గుర్తింపునిచ్చారు. ఆ పాత్ర దొరకడం నా అదృష్టం. ప్రస్తుత పరిస్థితుల్లో నటీ నటులకు మంచి వేషాలు రావడంలేదు. అలా కనిపించి ఇలా వెళ్లిపోయే పాత్రలకు ఒకటి, రెండు రోజుల కాల్ షీట్స్ అడుగుతున్నారు. 'టి మా' అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాను'' అన్నారు. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''తెలంగాణ ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్‌లో 85 సినిమాలకు సెన్సార్ పూర్తి చేశాం. ఎన్నో సినిమాల టైటిల్స్‌ను రిజిస్ట్రేషన్ చేయించాం. సభ్యులకు హెల్త్‌కార్డ్స్ అందిస్తున్నాం. తెలంగాణ ఫిలిం చాంబర్ కేవలం తెలంగాణ వారికి చెందినది మాత్రమే కాదు. భారతదేశ వ్యాప్తంగా ఐదువేల మందికి పైగా నటీనటులు, సాంకేతిక నిపుణులు మా చాంబర్‌లో ఇప్పటికే సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే 'తెలంగాణ స్టేట్ ఫిలించాంబర్' ఉంది కదా అనేది కొంత మంది ప్రశ్న. అది నలభై ఏళ్లుగా ఉంది కానీ అందులో పంపిణీదారులే ప్రముఖంగా ఉంటారు. తెలంగాణ చలన చిత్ర వాణిజ్య మండలిలో నిర్మాతలే ముఖ్య పాత్ర వహిస్తారు'' అన్నారు. 'తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్' ఉపాధ్యక్షుడు గురురాజ్, సెక్రటరీ కాచం సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా 'టి మా' జనరల్ సెక్రటరీగా స్నిగ్ధ మద్వాని, జాయింట్ సెక్రటరీలుగా కిరణ్, లత, ఇమ్మడి ధర్మారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వై.శ్రీనివాస్, ఆదర్శిని, యోగి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా గుండు రవితేజ, ప్రేమ్, శ్రీశైలం, గీతా సింగ్, గాయత్రీ, మహాలక్ష్మి, టి న్యూస్ రాజేష్, ప్రవీణ, మమత, దయ ఎన్నికయ్యారు.

ఆండ్రియా

ఆర్య చూసి హీరో అవ్వాలనుకున్నా


తనిష్క్‌రెడ్డి

''నాది నల్గొండ జిల్లా. మా నాన్నగారు రిటైర్డ్ స్కూల్ టీచర్. నేను పుట్టింది, పెరిగింది హైదరాబాద్‌లోనే. 'ఆర్య' సినిమా చూసి హీరో కావాలని నిర్ణయించుకుని బరువు తగ్గాను. ఆ తర్వాత యాక్టింగ్, డ్యాన్స్, ఫైట్స్‌లో శిక్షణ తీసుకున్నా'' అని తనిష్క్ రెడ్డి అన్నారు. ఎలక్సియస్, శుభంగి పంత్ హీరోయిన్లుగా తనిష్క్ రెడ్డి హీరోగా రామకృష్ణ వెంప దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దర్పణం'. క్రాంతి కిరణ్ వెల్లంకి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా తనిష్క్ రెడ్డి మాట్లాడుతూ– ''ఆ ఐదుగురు, దునియా, చక్కిలిగింత' లాంటి సినిమాల్లో మంచి పాత్రలు చేశాను. అల్లు అర్జున్‌గారితో 'ఐయామ్ దట్ చేంజ్' అనే షార్ట్ ఫిలిం చేశాను. అది నా మూవీ కెరీర్‌కి ఎంతగానో ఉపయోగపడింది. 'సకల కళావల్లభుడు' సినిమాతో హీరోగా పరిచయమయ్యాను. ఆ చిత్రం తర్వాత ఇక అవకాశాలు రావేమో అనుకుంటున్న టైమ్‌లో రామకృష్ణగారు కలిసి, ముందుగా ఇంటర్వెల్ సీన్ చెప్పారు. ఆ తర్వాత మొత్తం కథ చెప్పారు. అద్భుతంగా ఉంది.

అల్లరి చిల్లరగా తిరిగే కుర్రాడు అనుకోకుండా ఒక హత్య కేసులో ఇరుక్కుంటాడు. చివరికి దాన్నుంచి ఎలా బయటపడ్డాడు? అనేది కథాంశం. సినిమా మొత్తం హత్య నేపథ్యంలో ఉంటుంది. ద్వితీయార్థం ట్విస్ట్‌లతో భయపెడుతుంది. ఈ సినిమా మర్డర్ మిస్టరీకి సంబంధించిన క్లూ అర్ధంలోనే కనిపిస్తుంది. అందుకే 'దర్పణం' అనే టైటిల్ పెట్టాం. మంచి టెక్నీషియన్స్ ఉంటే తక్కువ బడ్జెట్ లో సినిమా ఎంత బాగా తీయొచ్చు అనడానికి మా సినిమా ఒక ఉదాహరణ. ప్రస్తుతం క్రైమ్ నేపథ్యంలో ఓ సినిమా చేస్తున్నాను. ప్రేమకథతో ఓ సినిమా, సస్పెన్స్ థ్రిల్లర్‌తో మరో సినిమా చేయబోతున్నాను. డిసెంబర్ నుంచి ఈ చిత్రాల షూటింగ్ స్టార్ట్ అవుతుంది'' అన్నారు.

నా మనసుకు నచ్చిన చిత్రమిది

జె.ఎస్.కె ఫిలింస్ కార్పొరేషన్ సమర్పణలో అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'తారామణి'. రామ్ దర్శకుడు. డి.వి.వెంకటేశ్, ఉదయ్ హర్ష వడ్డేల్ల ఈ చిత్రాన్ని అదే పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. రేపు ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాత కె.ఎల్. దామోదర ప్రసాద్ మాట్లాడుతూ– ''వెంకటేశ్, ఉదయ్ ఎంతో అభిరుచి ఉన్న నిర్మాతలు. ట్రైలర్ చూశాక ఇది రియలిస్టిక్ ఫిల్మ్ అని అర్థమైంది. మనం బయటకు చెప్పుకోలేని ఎన్నో ఎమోషన్స్‌ని ఇప్పటి సినిమాలు చెబుతున్నాయి. ఇది అలాంటి సినిమానే'' అన్నారు. డీవీ వెంకటేశ్ మాట్లాడుతూ– ''తమిళ్‌లో పెద్ద హిట్టైన చిత్రమిది. తెలుగులో రీమేక్ చేద్దాం అనుకున్నాం, కానీ కుదర్లేదు. తెలుగు నేటివిటీకి తగ్గట్లుగా ఎక్కడా రాజీపడకుండా అనువాదం చేశాం'' అన్నారు. మరో నిర్మాత ఉదయ్ మాట్లాడుతూ– ''సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో సినిమా ఉంటుంది. టెక్నాలజీ మాయలో పడి యువత ఎలాంటి ప్రలోభాలకు లోనవుతున్నారు? అనేది ప్రధానాంశం'' అన్నారు. హీరోయిన్ ఆండ్రియా మాట్లాడుతూ– ''ఈ చిత్రం తమిళ్‌లో చిన్న చిత్రంగా విడుదలై పెద్ద విజయం సాధించింది. నా మనసుకు నచ్చిన చిత్రమిది. తెలుగు ట్రైలర్ చూశాక చాలా ఎగ్జయిట్ అయ్యాను. తెలుగులో ఈ సినిమా విడుదల అవటం హ్యాపీగా ఉంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు డి.ఎస్. రావు, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

epaper.sakshi.com

సర్వికల్ స్పాండిలోసిస్

ఆ నొప్పి వెన్ను నుంచి వేళ్ల వరకు

ఓ వయసు దాటాక వెన్నెముకలోని మెడ దగ్గర ఉండే ఎముకలు అరిగిపోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నం అవుతుంటుంది. మెడ దగ్గర నొప్పి భుజం నుంచి మోచేతి మీదుగా వేళ్లకూ పాకుతూ చికాకు పెడుతుంటుంది. నొప్పి, తిమ్మిరులతో ఇబ్బంది పెడుతుంది. ఒక్కోసారి చేయి బలహీనంగా అయినట్లుగానూ అనిపిస్తుంది. ఈ సమస్య పేరే సర్వైకల్ స్పాండిలోసిస్. జీవనశైలి, పని ప్రదేశం (వర్క్‌ప్లేస్)లో కూర్చునే భంగిమల వల్ల ఇప్పుడు చాలా త్వరగా వచ్చేస్తోంది. ఈ కారణంగా వెన్నుకు వచ్చే కొన్ని సమస్యలపై అవగాహన పెంచుకుందాం.

అదే పనిగా సరైన తీరులో కాకుండా... ఇష్టం వచ్చినట్లు కూర్చోవడంతోపాటు వెన్నుమీద తీవ్రమైన ఒత్తిడి పడటం వల్ల డిస్కులు పక్కకు తప్పుకోవచ్చు. ఇలా వచ్చే సమస్యను సర్వైకల్ డిస్క్ ప్రొలాప్స్ అంటారు. అంతేకాకుండా ఈ సమస్య చాలాకాలం పాటు కొనసాగినా లేదా వయసు మీరాక మెడలోని వెన్నెముకలు అరగడం వల్ల ఆ ఎముకల మధ్య ఉన్న నాడులపై ఒత్తిడి పడి వచ్చే సమస్యను సర్వైకల్ స్పాండిలోసిస్ అంటారు. ఇటీవల దాదాపు అన్ని వర్గాల్లోనూ మెడమీద ఒత్తిడి తీవ్రమయ్యేలా చేసే ఉద్యోగాలు, వృత్తులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ సమస్య సర్వసాధారణమయ్యింది. అందుకే ఓ వయసు దాటాక వచ్చే సర్వైకల్ స్పాండిలోసిస్‌కు ముందర వచ్చే డిస్క్‌ప్రొలాప్స్‌లు పెరుగుతున్నాయి. అందుకే ఈ సమస్యల గురించి తప్పక తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

మెడ దగ్గరి ఎముకలను తెలుసుకుందాం...

మన మెడ భాగంలోని వెన్నెముకలో ఏడు ఎముకలు ఉంటాయి. వాటినే వరసగా సీ1, సీ2, సీ3, సీ4, సీ5, సీ6, సీ7గా చెబుతారు. ఈ ఎముకలు తలను నిటారుగా నిలబెట్టి ఉంచేందుకు ఉపయోగపడతాయి. మెడను అటు ఇటు తిప్పడానికి (ఫ్లెక్సిబుల్‌గా ఉంచేందుకు) ఉపయోగపడతాయి. లోపల ఉన్న వెన్నుపాము (స్పైనల్‌కార్డ్)ను కాపాడతాయి. ఆ ఎముకల మధ్య ఘర్షణ (ఫ్రిక్షన్) నివారించేందుకు ఎముకకూ, ఎముకకూ మధ్యన డిస్క్ ఉంటుంది. ఈ ఎముకల మధ్యనుంచి నరాలు బయటకు వచ్చి వేర్వేరు అవయవాలను చేరి వాటిని నియంత్రిస్తుంటాయి. మెడలోని ఈ వెన్నెముకలు ఎముకలు, లేదా వాటిమధ్యన ఉండే మెత్తలాంటి డిస్క్ అరుగుదల వల్ల, లేదా ఒక్కోసారి డిస్కులు పక్కకు జరగడం వల్ల నరాలపై ఒత్తిడి పడి ఈ తిమ్మిరి, నొప్పి వస్తుంది. ఇలా డిస్కులు పక్కకు తొలగడాన్ని సర్వైకల్ డిస్క్ ప్రొలాప్స్ అంటారు. మెడలో ఉండే వెన్నెముకలు సీ1-సీ7 అరిగి, వాటి మధ్య ఉండే ఫేసెటల్ జాయింట్స్ కూడా అరిగి, రియాక్షన్‌గా ఆ అరిగిన మేరకు ఎముక పెరగడాన్ని సర్వైకల్ స్పాండిలోసిస్ అంటారు. సాధారణంగా సర్వైకల్ డిస్క్ ప్రొలాప్స్ కొద్దిగా యంగ్ ఏజ్‌లో వస్తుంది. ఇలాంటి డిస్క్ ప్రొలాప్స్ వల్ల దీర్ఘకాలికంగా అరుగుదల (డ్యామేజీ) జరిగితే అది సర్వైకల్ స్పాండిలోసిస్‌కు దారితీయవచ్చు.

చికిత్స ప్రక్రియలివి...

సర్వైకల్‌స్పాండిలోసిస్ కండిషన్ కనిపించిన రోగుల్లో జీవనశైలిలో మార్పులు తప్పనిసరిగా ప్రభావం చూపుతాయి. దాంతోపాటు ఫిజియోథెరపీ ప్రక్రియ వల్ల గణనీయమైన మెరుగుదల కనిపించేందుకు అవకాశం ఉంది. ఇక కొన్ని నాన్‌స్టెరాయిడల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ (ఎన్ఎస్ఏఐడీ) అని చెప్పే నొప్పి నివారణ మందులు వాడటం ఈ చికిత్సల్లో ఒక భాగం. వీటితోపాటు శస్త్రచికిత్స ద్వారా ఎముకలు అరిగిన, తొలగిన ప్రాంతంలో సరిచేయడం చివరగా చేసే చికిత్స ప్రక్రియ.

జీవనశైలి మార్పులతో...

మనం పనిచేసే చోట మెడపై తీవ్రమైన ఒత్తిడి పడకుండా చూసుకోవడం ప్రధానం. నిద్రపోయేప్పుడు, కూర్చుని ఉన్నప్పుడు తలను సరైన భంగిమలో ఉంచడం, మెడ కండరాలపై అసమతౌల్యంగా బరువు పడుతుంటే నివారించడం వంటివి జీవనశైలిలో మార్పులు. గంటలకొద్దీ కూర్చుని పనిచేసే సాఫ్ట్‌వేర్ వంటి వృత్తుల్లో ఉన్నవాళ్లు తమ తల బరువు మెడపై అసహజమైన రీతిలో పడుతుంటే దాన్ని నివారించడం కూడా ముఖ్యం.

ఫిజియోథెరపీ... మెడ కండరాలకు వ్యాయామాన్ని ఇవ్వడం ద్వారా వాటిని ఆరోగ్యకరంగా ఉంచుకోవడం మంచిది. దీనివల్ల వయసు పెరగడం వల్ల వెన్నెముక అరుగుదల ప్రక్రియ వేగంగా జరగకుండా చూడవచ్చు. ఫలితంగా ఈ అరుగుదలతో వచ్చే స్పాండిలోసిస్ అంత త్వరగా రాదు. కాబట్టి మెడ కండరాలకు వ్యాయామం అవసరం. ఇక ఈత వల్ల వెన్నెముకతోపాటు అన్ని కండరాలకూ తగినంత వ్యాయామం లభిస్తుంది. ఇలా వెన్నెముకతో పాటు మెడ కండరాలకు వ్యాయామం అందించేందుకు ఫిజియో థెరపీ ఉపయోగిస్తుంది. ఇందులోనూ రెండు దశల్లో ఫిజియోథెరపీ చికిత్స జరుగుతుంది. మొదటిది నొప్పి నివారణకు ఐఎఫ్‌టీ, అల్ట్రాసోనిక్ థెరపీ లేదా షార్ట్‌వేవ్ డయాథెర్మీ, రెండో దశలో మెడ, చేతులు, కాళ్లకు (లింబ్) ఎక్సర్‌సైజ్‌లు.

డాక్టర్‌ను కలవాల్సిందెప్పుడు...?

● మెడ నొప్పి వచ్చినప్పుడు సాధారణంగా కొందరు పెయిన్‌కిల్లర్స్ వేసుకుంటూ ఉంటారు. ఇలా చేయడం తప్పే అయినా... అలా పెయిన్‌కిల్లర్ వేసుకున్నా ఆగకుండా అదేపనిగా నొప్పి వస్తున్నప్పుడు, ఆ నొప్పి వారం రోజుల తర్వాత కూడా తగ్గకపోతే దాన్ని సర్వైకల్ స్పాండిలోసిస్ కారణంగా వచ్చే అని అనుమానించాల్సి ఉంటుంది ● నొప్పి ఒకే చోట లేకుండా చురుక్కుమంటూ భుజానికిగాని, ఇతర అవయవాలకు గాని పాకుతూ ఉన్నట్లుగా అనిపించడం కూడా సర్వైకల్ స్పాండిలోసిస్ లక్షణమే ● పై లక్షణాలతో పాటు నీరసంగా ఉండి చేతులు గాని, కాళ్లు గాని తిమ్మిరి పట్టినట్లుగా ఉండవచ్చు ● కాళ్లు లేదా చేతులు బిగదీసినట్లుగా (స్టిఫ్‌నెస్‌తో) ఉండవచ్చు ● మెడలో ఇబ్బందిగా (టెండర్‌నెస్) కూడా ఉండవచ్చు ● శరీరంలో ఎక్కడైనా స్పర్శజ్ఞానం కోల్పోయినట్లుగా అనిపిస్తే... ఈ లక్షణాలన్నీ సర్వైకల్ స్పాండిలోసిస్‌ను సూచిస్తాయి.

ఇంటర్ ఫెరెన్షియల్ థెరపీ (ఐఎఫ్‌టీ):

ఈ ప్రక్రియలో ఒక రకం విద్యుత్ తరంగాలను (వీటిని) ఉపయోగించి నొప్పి నివారణ చేస్తారు. శరీరంపై ఏదైనా గాటు లేదా గాయం ఉన్నవారికి లేదా పుండు వంటివి ఉన్నవాళ్లకు, గర్భిణులకు వీటిని ఉపయోగించరు. అల్ట్రాసోనిక్ థెరపీలో శబ్దతరంగాలను ఉపయోగించి చికిత్స చేస్తారు. ఇక షార్ట్‌వేవ్ తరంగాలను ఉపయోగించి కూడా నొప్పి నివారణ చేస్తారు. ఇది స్వల్పకాలికంగా జరిగే చికిత్స. ఇక రెండోదశలో మెడ, చేతులు, కాళ్లకు నిత్యం వ్యాయామం చేయించడం, దీర్ఘకాలం పాటు చేయించడం ద్వారా వాటిని మరింత దృఢతరం అయ్యేలా చూసి నొప్పి నివారణ జరిగేలా చూస్తారు. సాధారణంగా సర్వైకల్ స్పాండిలోసిస్‌కు ఫిజియోథెరపీ ప్రధానమైన చికిత్స ప్రక్రియలా పరిగణిస్తారు.

సర్వైకల్ స్పాండిలోసిస్ లక్షణాలివి...

● మెడ నొప్పిగా ఉంటుంది. మెడను మునుపటిలా ఫ్రీగా తిప్పడం సాధ్యం కాకపోవచ్చు ● మన దేహంలోని వివిధ అవయవాలను నియంత్రించి నరాలపై ఒత్తిడి పడటం వల్ల ఆ అవయవాలు సైతం నొప్పికి గురి కావడం, ఉదాహరణకు భుజం, మోచేయి, చేతి వేళ్లు లాంటివి ● చేయి, వేళ్లు, కొన్ని సందర్భాల్లో కాళ్లు తిమ్మిరి పట్టినట్లు అనిపిస్తుంటుంది ● పరిస్థితి తీవ్రమైన కొందరిలో కాళ్లు బిగదీసుకుపోయినట్లు (స్టిఫ్‌నెస్) కూడా అనిపించవచ్చు ● నడవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది ● కొందరిలో ఈ లక్షణాలు నెమ్మది నెమ్మదిగా క్రమంగా వస్తే మరికొందరిలో ఒక్కసారిగా కనిపించవచ్చు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలివి...

సర్వైకల్ స్పాండిలోసిస్ లక్షణాలతో పాటు స్పర్శజ్ఞానం కోల్పోయినట్లు అనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించడం తప్పనిసరి. సాధారణ ఎక్స్-రే వల్ల సర్వైకల్ స్పాండిలోసిస్ గురించి తెలిసిపోతుంది. అదే సర్వైకల్ డిస్క్ ప్రొలాప్స్ అయితే ఎమ్మారై పరీక్షల వల్ల నిర్దిష్టంగా డిస్కులు, వెన్నుపాము, నరాల పొజిషన్ వెన్నుపాము వ్యవస్థపై ఎముకల అరుగుదల, డిస్కుల అరుగుదల వల్ల పడుతున్న ప్రభావం... ఇవన్నీ ఎమ్మారైలో స్పష్టంగా తెలుస్తుంది. సీటీ స్కాన్ అయితే కాస్తంత పరిమితమైన వివరాలే తెలుస్తాయి. అవి కూడా కొందరు పేషెంట్లలోనే కొంత మేరకే తెలుస్తుంది.

సర్వైకల్ కాలర్: తల బరువు అరిగిన మెడ వెన్నెముకలు (సీ1 టు సీ7) వరకు పడుతుంటే ఆ బరువును వాటిపై పడకుండా చేసే ఒక ఉపకరణం 'సర్వైకల్ కాలర్'. అయితే ఇది అంతగా ఉపయోగపడదు కూడా. పైగా ఈ ఉపశమనం చాలా తాత్కాలికం మాత్రమే కావడంతో కొందరు డాక్టర్లు దీన్ని సూచించరు కూడా. దానికి కారణాలూ ఉన్నాయి. ఉదాహరణకు సర్వైకల్ కాలర్‌ను కొన్ని సందర్భాల్లో నొప్పి తీవ్రంగా ఉన్నప్పుడు కొంతకాలం పాటు ఉపయోగిస్తారు. నొప్పి నుంచి ఉపశమనం కలగడం వల్ల అలా అదేపనిగా దాన్నే ఉపయోగిస్తూ ఉండటం వల్ల మెడ కండరాలు బలహీనపడి దానిపైనే పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితి రావచ్చు. అందుకే అది చాలాకాలం ఉపయోగించడం అంతగా సరికాదు.

సర్వైకల్ ట్రాక్షన్: నరం దెబ్బతిన్నదని తెలిసినప్పుడు సర్వైకల్ ట్రాక్షన్‌ను అమర్చకూడదు. కేవలం ఎలాంటి నర్వ్ డ్యామేజీ లేదనుకున్నప్పుడే నొప్పి ఉన్న కొందరిలో దీన్ని ఉపయోగించి, ఉపశమనం పొందవచ్చు.

శస్త్రచికిత్స...

సర్వైకల్ డిస్క్ ప్రొలాప్స్‌లో... ఇతరత్రా ప్రత్యామ్నాయ మార్గాలు, సాంత్వన ప్రక్రియలు అవలంబించి కనీసం ఆరు నుంచి పన్నెండు వారాలు గడిచాక కూడా తగినంత ఉపశమనం లేకపోతే అప్పుడు శస్త్రచికిత్సకు వెళ్లాల్సి ఉంటుంది. శస్త్రచికిత్సలు కంఠం ముందు భాగం నుంచీ కొన్ని, మెడ వెనక భాగం నుంచి చేసేవి... ఇలా రకరకాలుగా ఉంటాయి. డిస్క్ లేదా ఎముకల అరుగుదలతో నరాలమీద కలిగే ఒత్తిడి స్థానాన్ని బట్టి ఎటువైపు నుంచి శస్త్రచికిత్స చేయాలన్న విషయాన్ని నిర్ధారణ చేస్తారు. అయితే శస్త్రచికిత్స ఎటువైపు నుంచి జరిగినా చివరి లక్ష్యం మాత్రం రోగికి నొప్పి నివారణ కలిగేలా చూడటమే.

శస్త్రచికిత్స ముందువైపు నుంచి జరిగితే (అది చాలా చిన్న గాటుతో) డిస్కెక్టమీ రూపంలో చేస్తారు. ఐదు నుంచి ఎనిమిది మిల్లీమీటర్ల గాటు పెట్టి డిస్క్‌ను తొలగిస్తారు. రోగి తుంటిఎముక నుంచి తొలగించిన భాగాన్ని (మనం చేత్తో తడిమినప్పుడు తుంటి వద్ద పొడుచుకు వచ్చినట్లు కనిపించే ఎముక) ఆ డిస్క్‌ను తొలగించిన చోట అమరుస్తారు. లేదా దీనికి బదులు డిస్క్ తొలగించిన ఆ గ్యాప్‌లో టైటానియం లోహంతో చేసిన ఒక డిస్క్‌ను అమర్చుతారు. దీన్ని ఎలా అమర్చాలన్న దాన్ని రోగికి అవసరమేమిటన్న అంశంపై డాక్టర్లు నిర్ధారణ చేస్తారు. అంటే.. ఇక్కడ జరిగే ప్రక్రియ ఒక్కటే. గతంలో ఎముకల భారం పడే డిస్క్ భాగాన్ని తొలగించి శస్త్రచికిత్స తర్వాత మెడ కదలికలతో పడే ఒత్తిడి అక్కడి చాలా కండరాలు ఆ భారాన్ని తీసుకునేలా చూస్తారు.

డాక్టర్ టి.దశరథ రామారెడ్డి
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్,
యశోద హాస్పిటల్స్,
సోమాజిగూడ, హైదరాబాద్

సినిమా

నా కథకన్నా ఆమె కథ గొప్పది

● కంగనా రనౌత్

కొన్ని రోజులుగా కంగనా రనౌత్ కాలికి గజ్జెలు కట్టుకుని భరత నాట్యం చేస్తున్నారు. ఓ గురువు ఆధ్వర్యంలో ఆమె శిక్షణ తీసుకుంటున్నారు. ఇదంతా ఓ పాట కోసమే. దివంగత నటి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవితం ఆధారంగా రూపొందనున్న 'తలైవి' సినిమాలో కంగనా నటించనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ఓ రెట్రో సాంగ్ (పాత సినిమాల్లోని పాటలా) ఉందని సమాచారం. ఈ పాట కోసమే కంగనా క్లాసికల్ డ్యాన్స్ శిక్షణ తీసుకుంటున్నారట. నృత్యదర్శకురాలు గాయత్రీ రఘురామ్ ఆధ్వర్యంలో త్వరలో ఈ పాటను చిత్రీకరించనున్నారని తెలిసింది. కంగనాతో పాటు 100 మంది డ్యాన్సర్లు ఈ పాటలో పాల్గొంటారని చెన్నై టాక్. ఎ.ఎల్. విజయ్ దర్శకత్వంలో హిందీలో 'జయ' పేరుతో తమిళ్‌లో 'తలైవి'గా రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది. పాట చిత్రీకరణతో షూటింగ్ మొదలవుతుందని సమాచారం. ఈ చిత్రం గురించి కంగనా మాట్లాడుతూ -''నిజానికి నా జీవితం ఆధారంగా సినిమా తీయాలనుకున్నాను. కానీ జయలలితగారి జీవిత కథ విన్నాక, నా 'సక్సెస్ స్టోరీ'కన్నా ఆమెది ఇంకా గొప్ప అనిపించింది. నా కథకు, ఆమె కథకు కొన్ని పోలికలు ఉన్నాయి. అందుకే ఆమె కథలో నటించాలని నిర్ణయించుకున్నాను'' అన్నారు.

నీకోసం బాగాలేదంటే డబ్బులు వెనక్కి!

''మనిషి చనిపోయాక చాలా ప్రేమను చూపెడతారు. కానీ, బతికున్నప్పుడే ఆ ప్రేమని పంచుకుంటే జీవితం బాగుంటుందని మా 'నీ కోసం'లో చెప్పే ప్రయత్నం చేశాం'' అన్నారు అవినాష్ కోకటి. అరవింద్ రెడ్డి, అజిత్ రాధారామ్, సుభాంగి పంత్, దీక్షితా పార్వతి హీరో హీరోయిన్లుగా అవినాష్ కోకటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నీకోసం'. రాజలింగం సమర్పణలో అల్లూరమ్మ (భారతి) నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. అవినాష్ కోకటి మాట్లాడుతూ- ''మా సినిమాలోని ప్రేమ కథలు చాలాకాలం ప్రేక్షకులతో ప్రయాణం చేస్తాయి. మరచిపోయిన లేదా వదిలేసిన బంధాలన్నీ గుర్తొస్తాయి'' అన్నారు. ''నీకోసం' ఎందుకు చూడాలి? అనేవారికి నేనిచ్చే భరోసా ఒక్కటే. మా సినిమా ఆడుతున్న థియేటర్స్ కౌంటర్ వద్ద నా మొబైల్ నంబర్ ఇస్తాను. సినిమా బాగాలేదనేవాళ్లకు డబ్బులు వెనక్కి ఇస్తాను'' అన్నారు అరవింద్ రెడ్డి. ''యాత్‌కి కనెక్ట్ అయ్యే కథ ఇది''అన్నారు అజిత్ రాధారామ్. ''ఇది లవ్ స్టోరీ మాత్రమే కాదు.. లైఫ్ స్టోరీ కూడా'' అన్నారు సుభాంగి పంత్. ''మంచి టీమ్‌తో పని చేశానని సంతోషంగా ఉంది'' అన్నారు దీక్షితా పార్వతి. సంగీత దర్శకుడు శ్రీనివాస్ శర్మ మాట్లాడారు.

● అజిత్, దీక్షితా పార్వతి

హోమియో కౌన్సెలింగ్స్ — ఫ్యామిలీ డాక్టర్

మైగ్రేన్ తగ్గుతుందా?

నా వయసు 28 ఏళ్లు. నాకు కొంతకాలంగా తలలో ఒకవైపు విపరీతమైన తల నొప్పి వస్తోంది. ఆఫీసులో ఏపనీ చేయలేకపోతున్నాను. డాక్టర్‌ను సంప్రదిస్తే మైగ్రేన్ అన్నారు. హోమియో మందులతో ఇది తగ్గుతుందా?
- ఎన్. విశాల్, సికింద్రాబాద్

పార్శ్వపు నొప్పి అని కూడా పిలిచే ఈ మైగ్రేన్ తలనొప్పిలో తలలో ఒక వైపు తీవ్రమైన నొప్పి వస్తుంది. సాధారణంగా ఇది మెడ వెనక ప్రారంభమై కంటి వరకు వ్యాపిస్తుంది. యువకులతో పోలిస్తే యువతుల్లో ఇది ఎక్కువ.

కారణాలు: తలలోని కొన్ని రకాల రసాయనాలు అధిక మోతాదులో విడుదల కావడం వల్ల పార్శ్వపు నొప్పి వస్తుందని తెలుస్తోంది. ఇక శారీరక, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, చాలాసేపు ఆకలితో ఉండటం, సమయానికి భోజనం చేయకపోవడం, సైనసైటిస్, అతి వెలుగు, గట్టి శబ్దాలు, ఘాటైన సువాసనలు, పొగ, మద్యం వంటి అలవాట్లు, మహిళల్లో నెలసరి సమయాల్లో, మెనోపాజ్ సమయాల్లో స్త్రీలలో హార్మోన్ల హెచ్చుతగ్గుల వంటివి ఈ సమస్యకు కారణాలుగా చెప్పవచ్చు.

లక్షణాలు: పార్శ్వపు నొప్పిలో చాలా రకాల లక్షణాలు కనిపిస్తాయి. వాటిని మూడు రకాలుగా విభజించవచ్చు.

1. పార్శ్వపు నొప్పి వచ్చేముందు కనిపించే లక్షణాలు: పార్శ్వపునొప్పి వచ్చే కొద్ది గంటలు లేదా నిమిషాల ముందు వస్తాయి. చికాకు, నీరసం, అలసట, నిరుత్సాహం.. లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని రకాల తినుబండారాలు ఇష్టపడటం, వెలుతురు, శబ్దాలను తట్టుకోలేకపోవడం, కళ్లు మసకబారడం, కళ్ల ముందు మెరుపులు కనిపించడం జరగవచ్చు. వీటినే 'ఆరా' అంటారు.

2. పార్శ్వపునొప్పి సమయంలో కనిపించే లక్షణాలు: అతి తీవ్రమైన తల నొప్పి, తలలో ఒకవైపు వస్తుంటుంది. ఇది 4-72 గంటల పాటు ఉండొచ్చు.

3. పార్శ్వపు నొప్పి వచ్చాక కనిపించే లక్షణాలు: చికాకు ఎక్కువగా ఉండటం, నీరసంగా ఉండటం, వికారం, వాంతులు విరేచనాలు కావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. **చికిత్స/నివారణ:** కొన్ని అంశాలు మైగ్రేన్‌ను ప్రేరేపిస్తాయి. మనకు ఏయే అంశాలు మైగ్రేన్‌ను ప్రేరేపిస్తున్నాయో జాగ్రత్తగా గమనించి, వాటికి దూరంగా ఉండటం ద్వారా మైగ్రేన్‌ను నివారించవచ్చు. అలాగే కాన్‌స్టిట్యూషన్ పద్ధతిలో ఇచ్చే ఉన్నత ప్రమాణాలతో కూడిన హోమియో చికిత్స ద్వారా దీన్ని పూర్తిగా నయం చేయవచ్చు.

డా॥ శ్రీకాంత్ మొర్లావర్,
సీఎండీ, హోమియోకేర్ ఇంటర్నేషనల్,
హైదరాబాద్

మూత్రం పచ్చగా వస్తోంది.. ఎందుకిలా?

నా వయసు 34 ఏళ్లు. మొన్న కొన్ని ఆఫీసు మీటింగులు ఉండటంతో బయటి ఊళ్లకు వెళ్లి వచ్చాను. అప్పటి నుంచి ఆకలి మందగించింది. మలబద్ధకంగా అనిపించడంతోపాటు మూత్రం పచ్చగా వస్తోంది. ఎందుకిలా జరుగుతోంది. ఫ్రెండ్స్ కొందరు కామెర్లు వచ్చాయని అంటున్నారు. దీనికి హోమియోపతిలో చికిత్స ఉందా?
- ఎమ్. చలపతిరావు, విశాఖపట్నం

కామెర్లు అనేది కాలేయ సంబంధిత వ్యాధి. ఇటీవలి కాలంలో తరచూ తలెత్తుతున్న ఆరోగ్య సమస్యల్లో ఇదీ ఒకటిగా చెప్పవచ్చు. ఒక వ్యక్తి ఈ సమస్యతో బాధపడుతున్నప్పుడు అతని కంటే ముందుగా ఇతరులే దీన్ని గుర్తిస్తారు. రక్తంలో బిలురుబిన్ పాళ్లు పెరిగినప్పుడు (హైపర్ బిలురుబినీమియా) చర్మం, కనుగుడ్లు, మ్యూకస్ మెంబ్రేన్స్‌లో పసుపుపచ్చ రంగు తేలడాన్ని పచ్చ కామెర్లు అంటారు. శరీరానికి ప్రాణవాయువు అయిన ఆక్సిజన్‌ను రక్తంలోకి ఎర్రరక్తకణాలు సరఫరా చేస్తాయి. ఇందులో హిమోగ్లోబిన్ అనే ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుంది. దీని జీవితకాలం 120 రోజులు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత హీమోగ్లోబిన్‌లోని హీమ్ అనే పదార్థం ప్లీహం (స్ప్లీన్)లో విలీనమైపోయి బైలురుబిన్, బైలివర్డిన్ అనే పసుపు రంగు వ్యర్థ పదార్థాలుగా మారిపోతాయి. శరీరంలో పసుపు రంగు పదార్థాలు పేరుకుపోవడాన్ని కామెర్లుగా చెప్పవచ్చు. సాధారణంగా కాలేయం ఈ వ్యర్థ పదార్థాలను సేకరించి, పైత్యరసంతో పాటు కాలేయ వాహిక (బైల్ డక్ట్) ద్వారా పేగుల్లోకి పంపుతుంది. అక్కడి నుంచి మలంతో పాటు ఈ పసుపు రంగు వ్యర్థపదార్థాలు బయటకు వెళ్లిపోతాయి.

కామెర్లుకు కారణాలు: ● హెపటైటిస్ ఏ, బి, సి, డి, ఈ అనే వైరస్‌ల కారణంగా కామెర్లు వచ్చే అవకాశం ఉంది ● ఆల్కహాల్ ఎక్కువగా తీసుకోవడం ● పుట్టుకతో వచ్చే కొన్ని లోపాలు ● కాలేయం పాడైపోవడం ● కాలేయం నుంచి పేగుల్లోకి వెళ్లే కాలేయ వాహికలో అంతరాయం ఏర్పడటం వంటివి జరిగితే కామెర్ల సమస్య తలెత్తే అవకాశం ఉంది.

లక్షణాలు: ● వికారం, వాంతులు ● పొత్తికడుపులో నొప్పి ● జ్వరం, నీరసం, తలనొప్పి ● కడుపు ఉబ్బరంగా ఉండటం ● కామెర్లు సోకినప్పుడు కళ్లు పచ్చబడటం.

వ్యాధి నిర్ధారణ: సీబీపీ, ఎల్ఎఫ్‌టీ, సీటీ స్కాన్, ఎమ్మారై, అల్ట్రా సౌండ్ స్కాన్

చికిత్స: కామెర్లను తగ్గించడానికి హోమియోపతిలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. రోగి లక్షణాలను, శారీరక, మానసిక స్థితిని పరిగణనలోకి తీసుకొని డాక్టర్లు మందులు సూచిస్తారు. ప్రారంభదశలోనే వాడితే కామెర్లను పూర్తిగా నయం చేయవచ్చు. ఈ సమస్యకు హోమియోలో చెలిడోనియం, సెలీనియం, లైకోపోడియం, మెర్క్‌సాల్, నాట్‌సల్ఫ్ వంటి మందులు డాక్టర్ల పర్యవేక్షణలో వాడాలి.

డాక్టర్ కె. శ్రీనివాస్ గుప్తా,
ఎండీ (హోమియో),
స్టార్ హోమియోపతి, హైదరాబాద్

పైల్స్‌కు శాశ్వత పరిష్కారం ఉందా?

నా వయసు 59 ఏళ్లు. నాకు కొంతకాలం నుంచి మలద్వారం వద్ద బుడిపెలా ఏదో బయటకు వస్తోంది. మల విసర్జన సమయంలో రక్తం పడుతోంది. సూదితో గుచ్చినట్లుగా నొప్పి వస్తోంది. డాక్టర్‌ను కలిస్తే పైల్స్ అన్నారు. హోమియోలో శాశ్వత పరిష్కారం ఉందా?
- ఆర్. సుబ్బారాయుడు, మహబూబ్‌నగర్

మలద్వారపు గోడల మార్పుల వల్ల ఆ చివరన ఉండే రక్తనాళాలు (సిరలు) ఉబ్బి మొలలుగా ఏర్పడతాయి. ఇవి మలాశయం లోపల, వెలుపల చిన్నచిన్న బుడిపెల రూపంలో ఏర్పడి ఇబ్బంది పెడతాయి.

మొలల దశలు: గ్రేడ్-1 దశలో మొలలు పైకి కనిపించవు. నొప్పి కూడా ఉండదు. కానీ రక్తం మాత్రం పడుతుంది. గ్రేడ్-2దశలో రక్తం పడవచ్చు, పడకపోవచ్చు కానీ మల విసర్జన సమయంలో బయటకు వస్తాయి. వాటంతట అవే లోపలకు వెళ్లిపోతుంటాయి. గ్రేడ్-3లో మల విసర్జన చేసేటప్పుడు మొలలు బయటకు వస్తాయి. కానీ మల విసర్జన తర్వాత తర్వాత వాటంతట అవి లోపలికి పోకుండా వేలితో నెడితే లోనికి వెళ్తాయి. గ్రేడ్-4 దశలో మొలలు మలద్వారం బయటే ఉండిపోతాయి.

కారణాలు: ● మలబద్ధకం ● మలవిసర్జన సమయంలో గట్టిగా ముక్కడం వల్ల అక్కడే ఉండే కండరబంధనం సాగిపోతుంది. తద్వారా మొలలు బయటకు పొడుచుకుని వస్తాయి ● సరైన వ్యాయామం, శారీరక శ్రమ లేకపోవడం ● స్థూలకాయం (ఒబేసిటీ) ● చాలాసేపు కూర్చొని పనిచేసే ఉద్యోగులకు ఈ సమస్య ఎక్కువ ● మలబద్ధకం మాత్రమే గాక అతిగా విరేచనాలు కావడం కూడా ఈ సమస్యకు దారితీయవచ్చు ● మంచి పోషకాహారం తీసుకోకపోవడం ● నీరు తక్కువగా తాగడం ●ఎక్కువగా ప్రయాణాలు చేయడం ● అధిక వేడి ప్రదేశంలో పనిచేస్తుండటం ● మానసిక ఒత్తిడి ఉన్నప్పుడు ఇవి వచ్చే అవకాశాలు ఎక్కువ.

లక్షణాలు: నొప్పి, రక్తస్రావం, కొన్నిసార్లు దురద, ఏదో గుచ్చుతున్నట్లుగా నొప్పి ● మల విసర్జన సమయంలో ఇబ్బంది కలగడం.

నివారణ: ● మలబద్ధకం లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం ● సమయానికి భోజనం చేయడం ముఖ్యం ● ఆహారంలో పీచుపదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం ● నీరు ఎక్కువ మోతాదులో తీసుకోవడం ● మసాలాలు, జంక్‌ఫుడ్, మాంసాహారం తక్కువగా తీసుకోవడం ● మెత్తటి పరుపు మీద కూర్చోవడం వంటివి పైల్స్ నివారణకు తోడ్పడే కొన్ని జాగ్రత్తలు. హోమియోలో రోగి శారీరక, మానసిక లక్షణాలను బట్టి వ్యాధి నిరోధక శక్తి పెంచేలా ఇచ్చే మందులు ఇచ్చి వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు.

డాక్టర్ ఎ.ఎం. రెడ్డి, సీఎండీ,
పాజిటివ్ హోమియోపతి, హైదరాబాద్

epaper.sakshi.com

సాక్షి భవిత

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

గురువారం
5-9-2019

బీఏ, బీకాం, బీఎస్సీ.. సంప్రదాయ డిగ్రీ కోర్సులు! ఇంజనీరింగ్, మెడిసిన్‌లో ప్రవేశం లభించని విద్యార్థులే.. డిగ్రీలో చేరుతున్నారనే భావన! అంతేకాదు డిగ్రీ కోర్సుల్లో చేరిన చాలామంది విద్యార్థుల్లో భవిష్యత్తు అవకాశాల మాటేంటి? అనే ఆందోళన!! అయితే సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు అవకాశాలకు కొదవలేదు. అకడమిక్స్‌కే పరిమితం కాకుండా అదనపు నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. జాబ్ మార్కెట్‌లో ముందంజలో నిలిచే ఆస్కారం ఉంది. అందుకోసం విద్యార్థులు చేయాల్సిందల్లా.. డిగ్రీలో చేరిన తొలిరోజు నుంచే తమ కోర్సుకు సరితూగే జాబ్ మార్కెట్ డిమాండింగ్ నైపుణ్యాలు సొంతం చేసుకోవడమే! ప్రస్తుత నూతన విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశ ప్రక్రియ పూర్తయి.. కళాశాలల్లో అడుగుపెడుతున్న విద్యార్థులు తమ మూడేళ్ల కోర్సు కాలాన్ని సద్వినియోగం చేసుకొని.. అవకాశాలను ఒడిసిపట్టుకోవడం ఎలాగో తెలుసుకుందాం..

డిగ్రీ.. తొలి అడుగులిలా..!

- సంప్రదాయ డిగ్రీ కోర్సుల విద్యార్థులకు మెరుగవుతున్న అవకాశాలు
- అకడెమిక్స్‌తోపాటు అదనపు నైపుణ్యాలుంటేనే కొలువుకు మార్గం
- డిగ్రీ కోర్సులకు అనుగుణంగా పలు జాబ్ ఓరియెంటెడ్ సర్టిఫికేషన్స్
- డిగ్రీలో చేరిన తొలి రోజునుంచే స్కిల్స్‌పై దృష్టిపెట్టాలంటున్న నిపుణులు

తాజా అంచనాల ప్రకారం దేశంలో ఇంటర్ పూర్తిచేసుకుంటున్న విద్యార్థుల్లో దాదాపు 60 శాతం మంది బీఏ/బీకాం/బీఎస్సీల్లో చేరుతున్నారు. కానీ.. డిగ్రీ పూర్తయిన తర్వాత అవకాశాలను అందుకోవడంలో మాత్రం వెనుకంజలో ఉంటున్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకుంటేనే ఉద్యోగాలు సొంతమవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

అకడమిక్స్+అదనపు నైపుణ్యాలు

ప్రస్తుత పరిస్థితుల్లో సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులు తమ అకడమిక్ సబ్జెక్టులపై పట్టు సాధించాలి. దాంతోపాటే సంస్థలకు అవసరమైన నైపుణ్యాలను సొంతం చేసుకునే దిశగా అడుగులు వేయాలి. ముఖ్యంగా ప్రతి కంపెనీలోనూ డిజిటల్ టెక్నాలజీకి ప్రాధాన్యం పెరుగుతోంది. కంప్యూటర్ ఆధారిత కార్యకలాపాలు తప్పనిసరిగా మారాయి. కాబట్టి విద్యార్థులు కోర్సు చదువుతున్న సమయంలోనే ఆయా నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం పొందాలి.

అకౌంటింగ్, ఈఆర్‌పీ సాఫ్ట్‌వేర్స్

ఇటీవల కాలంలో బీకాంలో అనేక కొత్త కాంబినేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. జాబ్ మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్న కాంబినేషన్లు ఎంచుకోవడం మేలు చేస్తుంది. ముఖ్యంగా బీకాం విద్యార్థులు సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. సంస్థల్లో అకౌంట్ ఎగ్జిక్యూటివ్ కొలువులు అందుకునే వీలుంది. ప్రధానంగా ట్యాలీ, వింగ్స్, ఫోకస్ వంటి అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్స్ నేర్చుకోవచ్చు. ఈఆర్‌పీ సొల్యూషన్స్‌గా పిలిచే శాప్ వంటి సాఫ్ట్‌వేర్ కోర్సులు పూర్తిచేయడం ద్వారా సంబంధిత కంపెనీల్లో ఉజ్వల అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.

లాంగ్వేజ్ స్కిల్స్‌పై దృష్టి

ప్రస్తుతం బహుళజాతి సంస్థలు మన దేశంలోని కంపెనీలతో కలిసి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దాంతో బహుళజాతి కంపెనీల్లో ఇంగ్లిష్‌తో పాటు ఇతర ఫారిన్ లాంగ్వేజెస్‌పై పట్టున్న అభ్యర్థులకు అవకాశాలు లభిస్తున్నాయి. కాబట్టి డిగ్రీ విద్యార్థులు ఇంగ్లిష్‌తోపాటు ప్రస్తుతం డిమాండ్ నెలకొన్న జర్మన్, ఫ్రెంచ్, జపనీస్, స్పానిష్ వంటి ఫారిన్ లాంగ్వేజ్ నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. తద్వారా కాల్ సెంటర్, బీపీఓ మొదలు కోర్ సెక్టార్‌లో మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీల వరకు.. అన్నింటిలోనూ అవకాశాలు సొంతం చేసుకునే వీలుంటుంది.

ఎస్ఈఓ, ఎస్ఈఎం

డిగ్రీతో సంబంధం లేకుండా ఈ-కామర్స్, ఇతర ఆన్‌లైన్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించే విభాగాలు.. ఎస్ఈఓ(సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్), ఎస్ఈఎం(సెర్చ్ ఇంజన్ మేనేజ్‌మెంట్). సంస్థలు తమ ఉత్పత్తులకు సంబంధించిన వివరాలు సెర్చ్ ఇంజన్ వెబ్‌సైట్స్‌లో ముందు వరుసలో ఉండాలని భావిస్తున్నాయి. దాంతో ఎస్ఈఓ, ఎస్ఈఎం నైపుణ్యాలున్న అభ్యర్థులకు జాబ్ మార్కెట్‌లో మంచి డిమాండ్ నెలకొంది. పలు సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా ఈ నైపుణ్యాలు సొంతం చేసుకోవచ్చు. రైటింగ్ స్కిల్స్, సోషల్ మీడియా నాలెడ్జ్, ట్రాన్స్‌లేషన్ స్కిల్స్, టెక్నికల్ నైపుణ్యాలుంటే.. సంప్రదాయ డిగ్రీ విద్యార్థులైనా టెక్ సంస్థల్లో చేరిపోవచ్చు.

బీఎస్సీ.. ప్రాక్టికల్ నైపుణ్యాలు

బీఎస్సీ(ఎంపీసీ), బీఎస్సీ(బీజెడ్‌సీ) విద్యార్థులు కొంత దృష్టిపెడితే డిగ్రీ పూర్తవుతూనే ఉద్యోగంలో చేరిపోవచ్చు. కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్‌కు సంబంధించి ప్రాక్టికల్ నైపుణ్యాలకు పదును పెట్టుకుంటే.. ఫార్మాస్యూటికల్ సంస్థలు, ఇతర మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీల్లో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు (కెమిస్ట్, ల్యాబ్ అసిస్టెంట్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ తదితర) సొంతమవుతాయి. బీజెడ్‌సీలో ఇటీవల కాలంలో పలు కొత్త కాంబినేషన్లు (మైక్రోబయాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్, బయోటెక్నాలజీ తదితర) అందుబాటులోకి వచ్చాయి. వీటికి సంబంధించి ప్రాక్టికల్ నైపుణ్యాలు అందిపుచ్చుకుంటే.. హెల్త్‌కేర్, బయోటెక్నాలజీ సంస్థల్లో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు లభిస్తాయి.

ఇవెంతో ముఖ్యం

డిగ్రీ ఏదైనా భవిష్యత్తులో ఉద్యోగం, ఉన్నతవిద్య పరంగా కొన్ని నైపుణ్యాలు తప్పనిసరి. **అవి..**

- కమ్యూనికేషన్ స్కిల్స్
- అనలిటికల్ నైపుణ్యాలు
- ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు
- ఎమోషనల్ స్కిల్స్
- క్రిటికల్ థింకింగ్
- అడాప్టబిలిటీ వంటివి.

ఇలా చేస్తే..

- ప్రాక్టికల్ అప్రోచ్‌తో అభ్యసనం.
- సమకాలీన అంశాలపై అవగాహన.
- చదువుతున్న కోర్సుకు సరితూగే సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకోవడం.
- భవిష్యత్తు లక్ష్యాలపై స్పష్టత.. దానికి అనుగుణంగా నైపుణ్యార్జన.

ఉన్నత విద్య

- ఉన్నత విద్య లక్ష్యంగా పెట్టుకున్న డిగ్రీ కోర్సుల విద్యార్థులకు అవకాశాలు అనేకం. బీఏ కోర్సుల విద్యార్థులు జాబ్ ఓరియెంటెడ్ పీజీ కోర్సుల్లో చేరొచ్చు. వీటిలో సోషల్ వర్క్, సోషల్ సైన్స్‌లకు డిమాండ్ నెలకొంది. ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీ వంటి పీజీ కోర్సులను అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో పురాతత్వ శాఖల్లో, టూరిజం సంస్థల్లో కొలువుదీరే అవకాశముంది.
- బీఎస్సీ(ఎంపీసీ) విద్యార్థులు పీజీ స్థాయిలో స్టాటిస్టిక్స్, ఎంసీఏ, అప్లైడ్ మ్యాథమెటిక్స్, అప్లైడ్ సైన్సెస్ వంటి కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. తద్వారా భవిష్యత్తులో రీసెర్చ్ అసిస్టెంట్స్‌గా ప్రముఖ రీసెర్చ్ ల్యాబ్స్‌లో ఉద్యోగం సొంతం చేసుకునే వీలుంటుంది. అంతేకాకుండా బీఎస్సీ మ్యాథ్స్ విద్యార్థులు ప్రస్తుతం హాట్ కెరీర్‌గా నిలుస్తున్న బిగ్‌డేటా అనలిటిక్స్‌కు సంబంధించిన కోర్సులను పూర్తిచేసుకోవచ్చు. ఫలితంగా ఎంఎన్‌సీ సంస్థల్లో ఉన్నతస్థాయి కొలువులు అందుకునే వీలుంది. అదే విధంగా ఐఐటీల్లో ఎమ్మెస్సీ పూర్తిచేసుకుంటే.. క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ద్వారా కార్పొరేట్ ఉద్యోగం సొంతమవుతుంది.
- బీజెడ్‌సీ విద్యార్థులు నైపర్, ఐఐఎస్ఈఆర్, ఐఐఎస్సీ వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో పీజీ కోర్సులు అభ్యసించే వీలుంది. వీరు ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సుల్లో కూడా చేరే అవకాశం ఉంది. వీటిద్వారా భవిష్యత్తులో రీసెర్చ్ లేబొరేటరీస్‌లో రీసెర్చ్ అసోసియేట్స్‌గా ఉద్యోగం సొంతం చేసుకోవచ్చు. ఫార్మసీ సంస్థలు, క్లినికల్ రీసెర్చ్ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి.
- డిగ్రీలో ఏ గ్రూప్ విద్యార్థులైనా ప్రొఫెషనల్ పీజీలు పూర్తిచేసుకునే అవకాశం ఉంది. వీటిద్వారా భవిష్యత్తులో కార్పొరేట్ సంస్థల్లో కాలుమోపొచ్చు. వీటిలో ఎంబీఏ, బీఏఎల్ ఎల్‌బీ(లా) కోర్సులు ప్రధానమైనవి. ఈ సర్టిఫికెట్లు చేతిలో ఉంటే కార్పొరేట్ కంపెనీల్లో, ఎల్‌పీఓ/కేపీఓల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. అలాగే బీఈడీ పూర్తిచేయడం ద్వారా టీచింగ్ వృత్తిలో స్థిరపడొచ్చు.

సర్కారీ కొలువు

ప్రభుత్వ ఉద్యోగం లక్ష్యంగా నిర్దేశించుకుంటే.. డిగ్రీ పూర్తవుతూనే అత్యున్నత సివిల్ సర్వీసెస్ నుంచి రాష్ట్ర స్థాయిలో జరిగే గ్రూప్-1, 2, 4 ఉద్యోగాలకు పోటీ పడొచ్చు. అందుకోసం విద్యార్థులు డిగ్రీలో చేరిన తొలి రోజు నుంచే కసరత్తు ప్రారంభించాలి. సమకాలీన పరి ణామాలు, సాంస్కృతిక, వారసత్వ అంశాలు, ఆర్థిక, రాజకీయ పరిణామాలపై నిరంతరం అవగాహన పెంచుకోవాలి. దాంతోపాటు కోర్ సబ్జెక్ట్‌పైనా పట్టు సాధించాలి. మరోవైపు సీడీఎస్ వంటి పరీక్షల్లో విజయం సాధించడం ద్వారా త్రివిధ దళాల్లో ఉద్యోగం సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా ఐబీపీఎస్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే నియామక పరీక్షల్లో ప్రతిభ చూపి... బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో కొలువులు అందుకోవచ్చు.

విస్తృత ఆలోచన పరిధి అవసరం

డిగ్రీ కోర్సుల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. అదే విధంగా అకడమిక్స్ కోణంలో చూస్తే సీబీసీఎస్ విధానంలో అభ్యర్థులు మల్టీ డిసిప్లినరీ కోర్సులు అభ్యసించే అవకాశం లభిస్తోంది. ఫలితంగా విద్యార్థులకు తమ కోర్ సబ్జెక్ట్‌తోపాటు ఇతర అంశాలపైనా అవగాహన ఏర్పడుతుంది. దీనిపై దృష్టిసారించాలి.

- ప్రొఫెసర్ వి.వెంకట రమణ,
టీఎస్‌సీహెచ్‌ఈ వైస్‌ప్రెసిడెంట్.

ఉద్యోగాలు

కేఐఓసీఎల్‌లో ఉద్యోగాలు

బెంగళూరులోని మినీరత్న కంపెనీ.. కుద్రేముఖ ఐరన్ ఓర్ కంపెనీ లిమిటెడ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల వివరాలు:** జనరల్ మేనేజర్-1, డిప్యూటీ జనరల్ మేనేజర్/అసిస్టెంట్ జనరల్ మేనేజర్-1, కంపెనీ సెక్రటరీ-1, మేనేజర్ అకౌంట్స్-1, మేనేజర్ కార్పొరేట్ కమ్యూనికేషన్-1, కన్సల్టెంట్ బ్లాస్ట్ ఫర్నేస్ యూనిట్-1.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ ఉత్తీర్ణత, అనుభవం.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** 27.09.2019.
- **వెబ్‌సైట్:** www.kioclltd.in

నిఫ్టెమ్‌లో టీచింగ్ పోస్టులు

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్(నిఫ్టెమ్)... టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల వివరాలు:** 14 (ప్రొఫెసర్-5, అసోసియేట్ ప్రొఫెసర్-4, అసిస్టెంట్ ప్రొఫెసర్-5).
- **అర్హత:** సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, నెట్/సెట్/సెట్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం.
- **విభాగాలు:** ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్, కెమికల్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషియన్, ఫుడ్ ఇంజనీరింగ్, డెయిరీ అండ్ ఫుడ్ టెక్నాలజీ, బయోకెమికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ తదితరాలు.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 08.10.2019.
- **వెబ్‌సైట్:** www.niftem.ac.in.

హెచ్‌పీసీఎల్, విశాఖ రిఫైనరీలో ఉద్యోగాలు

నవరత్న కంపెనీ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్).. విశాఖ రిఫైనరీలో పలు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల సంఖ్య:** 36 (మెయింటెనెన్స్ టెక్నీషియన్-20, ల్యాబ్ అనలిస్ట్-4, జూనియర్ ఫైర్ అండ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్-12).
- **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ, ఎంఎస్సీ ఉత్తీర్ణత. ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అనర్హులు.
- **వయసు:** 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 30.09.2019.
- **వెబ్‌సైట్:** www.hindustanpetroleum.com

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..
ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ పరీక్షల జనరల్ స్టడీస్ మెటీరియల్
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

రాష్ట్రపతి పాలన గురించి తెలిపే ఆర్టికల్?

- భారత రాజ్యాంగం ప్రకారం డిజ్యూర్ సార్వభౌమాధికారిగా ఎవరు వ్యవహరిస్తారు? *-భారత రాష్ట్రపతి*
- రాష్ట్రపతి పదవీ కాలంలో ప్రథమ పౌరునిగా ఉంటే పదవీ విరమణ తర్వాత హోదా క్రమంలో ఎన్నో స్థానాన్ని పొందుతాడు? *- 5వ స్థానం*
- భారత రాజ్యాంగంలో కేంద్ర ప్రభుత్వం గురించి తెలిపే అధికరణలు? *- ఆర్టికల్-52 నుంచి ఆర్టికల్-151 వరకు*
- భారతదేశంలో మూడు ప్రభుత్వాంగాలు ఏ సూత్రంపై పనిచేస్తాయి? *- చెక్స్, బ్యాలెన్స్ విధానంలో*
- భారతదేశానికి ప్రధాన కార్యనిర్వాహక అధికారి రాష్ట్రపతి అని తెలిపే ఆర్టికల్? *- ఆర్టికల్-53*

రాష్ట్రపతికి సంబంధించిన వివిధ అంశాలు

- పదవీ కాలం ముగియడానికి ఎన్ని రోజుల ముందు కొత్త రాష్ట్రపతి ఎన్నిక పూర్తి కావాలి? *- 15 రోజులు*
- రాష్ట్రపతిని తొలగించే తీర్మానం గురించి ఎన్ని రోజులు ముందు తెలియజేయాలి? *-14 రోజులు*
- రాష్ట్రపతిపై సివిల్ కేసు పెట్టాలంటే ఎన్ని రోజుల ముందు అతనికి నోటీస్ ఇవ్వాలి? *- 2 నెలలు*
- రాష్ట్రపతి జారీచేసే ఆర్డినెన్స్ కాల పరిమితి? *- 6 నెలలు*
- రాష్ట్రపతి పదవి ఖాళీ అయితే తిరిగి ఎంత కాలం లోపు ఎన్నికలు నిర్వహించాలి? *- 6 నెలలు*

- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల చట్టాన్ని ఎప్పుడు చేశారు? *- 1952*
- రాష్ట్రపతిని ఎన్నుకునే ఎన్నికల గణంలో అతని అభ్యర్థిత్వాన్ని ఎంతమంది ప్రతిపాదించాలి, ఎంతమంది బలపర్చాలి? *- 50, 50*
- రాష్ట్రపతి ఎన్నికను సవాల్ చేయాలంటే నియోజక గణంలోని ఎంతమంది సభ్యులు బలపరచాలి? *- 20*
- ఏ రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్రపతి ఎన్నిక వివాదాలకు సంబంధించిన మార్గదర్శకాలను రాజ్యాంగంలో చేర్చారు? *- 11వ సవరణ, 1961*
- రాష్ట్రపతి భవన్ రూపశిల్పులు? *- హెర్బర్ట్ బేకర్, ఎడ్వర్ట్ లుట్టియాన్స్*
- రాష్ట్రపతిని తొలగించే మహాభియోగ తీర్మానం గురించి తెలిపే ఆర్టికల్? *- ఆర్టికల్-61*
- రాష్ట్రపతి పార్లమెంటు ఉభయ సభలను సమావేశపరచడాన్ని ఏమంటారు? *- సమన్*
- రాష్ట్రపతి పార్లమెంటు సమావేశాలను దీర్ఘకాలం వాయిదా వేయడం? *- ప్రోరోగ్*
- రాష్ట్రపతి.. బిల్లును పూర్తిగా తిరస్కరించడం? *- నిరపేక్ష వీటో*

రాష్ట్రపతికి సంబంధించి వివిధ అంశాల స్వీకరణ

- ఏ ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతి ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేస్తాడు? *- ఆర్టికల్-108*
- ఇప్పటివరకు ఎన్నిసార్లు ఉభయ సభల సంయుక్త సమావేశాలు జరిగాయి? *- మూడుసార్లు (1961, 1978, 2002)*
- ఐర్లాండ్ రాజ్యాంగం నుంచి *-ఎన్నుకునే విధానం*
- అమెరికా రాజ్యాంగం నుంచి *-తొలగించే విధానం*
- పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశం *-ఆస్ట్రేలియా రాజ్యాంగం నుంచి*
- అత్యవసర అధికారాలు *-జర్మనీ వైమూర్ రాజ్యాంగం నుంచి*
- సుప్రీంకోర్టును న్యాయ సలహా కోరటం *-కెనడా రాజ్యాంగం నుంచి*

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

- భారత రాష్ట్రపతి ఏ ఆర్టికల్ ప్రకారం ఆర్డినెన్స్ జారీ చేస్తాడు? *- ఆర్టికల్-123*
- ఆర్డినెన్స్ కాల పరిమితి? *- 6 నెలలు*
- రాష్ట్రపతి జారీచేసే ఆర్డినెన్స్ దురుద్దేశ కారణాలతో ఉంటే న్యాయ సమీక్ష చేయొచ్చని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెప్పింది? *- కూపర్ Vs కేంద్ర ప్రభుత్వం 1970*
- రాష్ట్రపతి వద్ద ఉండే నిధి? *-ఆగంతుక నిధి*
- రాష్ట్రపతికి క్షమాభిక్ష అధికారం కల్పించిన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్? *- ఆర్టికల్-72*
- ఆర్థిక సంఘం, కాగ్ తమ నివేదికలను ఎవరికి సమర్పిస్తాయి? *- రాష్ట్రపతికి*
- ఉరిశిక్షను అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే విధించాలని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెప్పింది? *- బచన్ సింగ్ కేసు*
- భారత రాష్ట్రపతి సర్వ సైన్యాధ్యక్షుడు అని తెలిపే ఆర్టికల్? *- ఆర్టికల్-53 (2)*
- రాజ్యాంగంలోని ఏ భాగం రాష్ట్రపతి అత్యవసర అధికారాలను గురించి తెలుపుతోంది? *- 18వ భాగం*
- రాష్ట్రపతి అత్యవసర అధికారాలకు మూలాధారం? *- జర్మనీ వైమూర్ రాజ్యాంగం, భారత ప్రభుత్వ చట్టం - 1935*
- జాతీయ అత్యవసర పరిస్థితి గురించి తెలిపే ఆర్టికల్? *- ఆర్టికల్-352*
- రాష్ట్రపతి పాలన గురించి తెలిపే 'ఆర్టికల్ 356'ను మృత పత్రంగా పేర్కొంది? *- బి.ఆర్. అంబేద్కర్*
- జాతీయ అత్యవసర పరిస్థితిని ఎన్నిసార్లు విధించారు? *- మూడుసార్లు (1962, 1971, 1975)*
- అత్యవసర అధికారాలను దుర్వినియోగం చేయకుండా మార్గదర్శకాలను కల్పించిన రాజ్యాంగ సవరణ? *- 44వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978*
- రాష్ట్రపతి పాలనను దుర్వినియోగం చేయకుండా సుప్రీంకోర్టు ఏ కేసులో మార్గదర్శకాలను ఇచ్చింది? *- ఎస్.ఆర్. బొమ్మై కేసు (1994)*
- ఆర్థిక అత్యవసర పరిస్థితి గురించి తెలిపే ఆర్టికల్? *- ఆర్టికల్ -360*
- అమెరికా అధ్యక్షునికి ఉండి, భారత రాష్ట్రపతికి లేని వీటో? *- క్వాలిఫైడ్ వీటో*
- రెండుసార్లు తాత్కాలిక రాష్ట్రపతిగా వ్యవహరించిన వారు? *- హిదయతుల్లా (1969, 1983)*
- మొదటి రాష్ట్రపతి ఎన్నికల్లో (1952) బాబూ రాజేంద్రప్రసాద్‌పై పోటీచేసి ఓడిపోయిన వ్యక్తి? *- కె.టి. షా*
- హిందూ కోడ్ బిల్లులో సవరణల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన రాష్ట్రపతి? *- బాబూ రాజేంద్రప్రసాద్*
- అతి తక్కువ కాలం రాష్ట్రపతిగా పనిచేసింది? *- జాకీర్ హుస్సేన్ (1967-69)*
- ఎప్పుడు జరిగిన రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా ఆత్మ ప్రభోదానుసారం ఓటు వేయాలని ఇందిరాగాంధీ పార్టీకి చెందిన ఓటర్లకు (ఎంపీ, ఎమ్మెల్యేలు) పిలుపు నిచ్చారు? *- 1969 రాష్ట్రపతి ఎన్నిక*
- తన ఎన్నికపై వచ్చిన వివాదంపై సుప్రీం కోర్టుకు స్వయంగా హాజరై తన వాదనను వినిపించిన రాష్ట్రపతి? *- వి.వి. గిరి*
- ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, స్పీకర్, రాష్ట్రపతిగా పనిచేసిన వ్యక్తి? *- నీలం సంజీవరెడ్డి*
- 'ఆపరేషన్ బ్లూ స్టార్' సైనిక చర్య ఏ రాష్ట్రపతి కాలంలో జరిగింది? *- జ్ఞానీ జైల్‌సింగ్ (1984)*
- అత్యధికంగా నలుగురు ప్రధానమంత్రుల ప్రమాణ స్వీకారం ఏ రాష్ట్రపతి కాలంలో జరిగింది? *- ఆర్. వెంకట్రామన్ (1987-92)*
- సుఖోయ్ యుద్ధ విమానంలో ప్రయాణించిన తొలి రాష్ట్రపతి? *- ఎ.పి.జె. అబ్దుల్ కలాం*
- అలీన విధానం (NAM) సెక్రెటరీ జనరల్‌గా పనిచేసిన మాజీ రాష్ట్రపతి? *- జ్ఞానీ జైల్‌సింగ్*
- బ్రిటీష్ రాణి ఎలిజబెత్ ఆహ్వానం అందుకున్న భారత రాష్ట్రపతి? *- ప్రతిభా పాటిల్*
- 'ఇండియా డివైడెడ్' రచయిత? *- డాక్టర్ రాజేంద్రప్రసాద్*

రాష్ట్రపతికి సంబంధించిన పదజాలం

- లోక్‌సభను 5 సంవత్సరాల కంటే ముందు రద్దు చేయడం? *- డిసల్యూషన్*
- క్షమాభిక్ష పెట్టడం? *- పార్డన్*
- బిల్లులను నిలిపేయడం? *- వీటో*
- రాష్ట్రపతి జారీ చేసే తాత్కాలిక శాసనం? *-ఆర్డినెన్స్*

- కొప్పుల మల్లేశం, అసిస్టెంట్ ప్రొఫెసర్

సాక్షి స్పోర్ట్స్
గురువారం
5-9-2019

దిమిత్రోవ్ సంబరం

ఇరవై గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత, దిగ్గజ క్రీడాకారుడు రోజర్ ఫెడరర్ మరో మేజర్ టైటిల్ కల నెమ్మదిగా చెదిరిపోతోంది. గత ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్ తర్వాత మళ్లీ గ్రాండ్‌స్లామ్ నెగ్గలేకపోయిన స్విస్ స్టార్ పోరాటం ఈ ఏడాదికి ముగిసింది. 2019 చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో అతని ఆట క్వార్టర్ ఫైనల్ వరకే పరిమితమైంది. అద్భుత పోరాటపటిమతో ఫెడరర్‌ను చిత్తు చేసి బల్గేరియా ఆటగాడు గ్రిగర్ దిమిత్రోవ్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ విజయాన్ని అందుకున్నాడు. గత ఏడాది కూడా ఇదే టోర్నీలో అనామకుడు మిల్‌మన్ చేతిలో ప్రిక్వార్టర్‌లోనే వెనుదిరిగిన ఫెడెక్స్‌కు 2008 తర్వాత యూఎస్ ఓపెన్ అందని ద్రాక్షే అయింది. మాజీ వరల్డ్ నంబర్‌వన్‌తో గతంలో ఏడు సార్లు తలపడి ప్రతీసారి ఓడిన దిమిత్రోవ్ ఈసారి మాత్రం గెలుపును తన ఖాతాలో వేసుకున్నాడు.

ఫెడరర్ ఖేల్ ఖతం

క్వార్టర్ ఫైనల్లో ఓడిన స్విస్ స్టార్
సంచలన విజయంతో సెమీస్‌కు దిమిత్రోవ్
మెద్వెదేవ్‌తో పోరుకు సిద్ధం
యూఎస్ ఓపెన్ టోర్నీ

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ విభాగంలో మరో సంచలనం నమోదైంది. టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకడైన ఫెడరర్‌కు క్వార్టర్ ఫైనల్లోనే చుక్కెదురైంది. హోరాహోరీగా సాగిన పోరులో ప్రపంచ 78వ ర్యాంకర్ గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 3-6, 6-4, 3-6, 6-4, 6-2తో ఫెడరర్ (స్విట్జర్లాండ్)ను చిత్తు చేశాడు. 3 గంటల 12 నిమిషాల పాటు సాగిన ఈ ఐదు సెట్‌ల మ్యాచ్‌లో చివరకు ఫెడరర్‌కు ఓటమి తప్పలేదు. మ్యాచ్ చివర్లో వెన్ను నొప్పి కొంత వరకు ఇబ్బంది పెట్టడం కూడా ఫెడరర్‌కు ప్రతికూలంగా మారింది. మ్యాచ్‌లో ఏకంగా 61 అనవసర తప్పిదాలు చేసి ఫెడరర్ ఓటమిని ఆహ్వానించాడు. 2008లో రైనర్ షట్లర్ (94వ ర్యాంక్) వింబుల్డన్‌లో సెమీఫైనల్ చేరిన తర్వాత ఇంత తక్కువ ర్యాంకర్ (78) ఒక గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్ చేరడం ఇదే మొదటిసారి. దిమిత్రోవ్ గతంలో రెండుసార్లు (2014 వింబుల్డన్, 2017 ఆస్ట్రేలియన్ ఓపెన్) గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్ వరకు చేరాడు. సెమీస్‌లో ఐదో సీడ్ డానిల్ మెద్వెదేవ్ (రష్యా)తో దిమిత్రోవ్ తలపడతాడు.

శుభారంభం చేసినా...

గతంలో ఏడుసార్లు ఫెడరర్ చేతిలో ఓడినప్పుడు మొత్తం కలిపి దిమిత్రోవ్ రెండు సెట్‌లు మాత్రమే గెలవగలిగాడు. ఈ మ్యాచ్‌ను ఫెడరర్ ఆరంభించిన తీరు చూస్తే ఎలాంటి సంచలనానికి అవకాశం ఉండదని అనిపించింది. జోరుగా దూసుకుపోయి 3-0తో ఆధిక్యంలో నిలిచిన ఫెడెక్స్‌కు ప్రత్యర్థి 3 డబుల్ ఫాల్ట్‌లు కూడా చేయడం కలిసొచ్చింది. 29 నిమిషాల్లోనే అతను సెట్‌ను గెలుచుకున్నాడు. అయితే రెండో సెట్‌లో తేరుకున్న దిమిత్రోవ్ 4-2తో ముందంజలో నిలిచాడు. 5-3 వద్ద సర్వీస్‌ను నిలబెట్టుకోలేకపోయినా తర్వాతి గేమ్‌ను గెలుచుకోవడంతో సెట్ బల్గేరియన్ వశమైంది. మూడో సెట్‌లోనూ రెండు సార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి ఫెడరర్ ఆధిక్యం ప్రదర్శించాడు. నాలుగో సెట్ ఆరంభంలోనే దూకుడు ప్రదర్శించిన దిమిత్రోవ్‌కు సెట్‌ను అందుకునేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. పదో గేమ్‌లో ఐదు సార్లు బ్రేక్ పాయింట్ సాధించే అవకాశం వచ్చినా ఫెడరర్ విఫలమయ్యాడు. ఈ సెట్ తర్వాత వెన్ను నొప్పికి చికిత్స చేయించుకొని తిరిగొచ్చిన స్విస్ దిగ్గజం ప్రభావం చూపలేక చేతులెత్తేశాడు. 4-0తో ముందంజ వేసిన దిమిత్రోవ్‌కు ఆట ముగించేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. ఫెడరర్ కొట్టిన ఫోర్‌హ్యాండ్ షాట్ కోర్టు బయట పడటంతో దిమిత్రోవ్ గెలుపు ఖాయమైంది.

సెమీఫైనల్లో మెద్వెదేవ్...

రష్యా ఆటగాడు డానిల్ మెద్వెదేవ్ ఒక గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలిసారి సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. క్వార్టర్ ఫైనల్లో మెద్వెదేవ్ 7-6 (8/6), 6-3, 3-6, 6-1తో 2016 చాంపియన్ స్టానిస్లాస్ వావ్రింకా (స్విట్జర్లాండ్)ను చిత్తు చేశాడు. 2 గంటల 34 నిమిషాల పాటు ఈ మ్యాచ్ సాగింది. కాలి గాయంతో ఒక దశలో మ్యాచ్ నుంచి తప్పుకోవాలని భావించిన 23 ఏళ్ల మెద్వెదేవ్ పెయిన్ కిల్లర్స్‌తో ఆటను కొనసాగించి విజయాన్ని అందుకోవడం విశేషం. **బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో క్వార్టర్ ఫైనల్లో 13వ సీడ్ బెలిండా బెన్సిచ్ (స్విట్జర్లాండ్) 7-6 (7/5), 6-3తో 23వ సీడ్ డోనా వెకిచ్ (క్రొయేషియా)పై విజయం సాధించింది. తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరింది.**

> నాకు లభించిన ఆరంభాన్ని బట్టి చూస్తే బాగా ఆడుతున్నానని అనిపించింది. అందుకే ఈ ఓటమి కొంత నిరాశ కలిగించింది. ఆధిక్యంలో ఉండి కూడా వెనుకబడటం అంటే ఒక మంచి అవకాశం చేజార్చుకున్నట్లే. అయితే పరాజయాలను ఎదుర్కొనేందుకు కూడా సిద్ధంగా ఉండాలి. ఇదంతా ఆటలో భాగం. వెన్నులో కొంత ఇబ్బందిగా అనిపించడంతో శరీరం తేలికయ్యేందుకు కొంత చికిత్స తీసుకున్నాను. నేను బాగానే ఉన్నాను. నా ఓటమికి ఇది కారణం కాదు. నేను ఎంత పోరాడగలనో అంతా చేశాను. అయినా ఇది దిమిత్రోవ్ విజయం గురించి మాట్లాడాల్సిన సమయమే తప్ప నా గాయం గురించి కాదు. భవిష్యత్తులో మరో గ్రాండ్‌స్లామ్ నెగ్గుతానా లేదా చెప్పేందుకు నా దగ్గర మంత్రదండమేమీ లేదు. ఏదైనా జరగొచ్చు కాబట్టి గెలవాలనే ఆశిస్తున్నా. కొంత విశ్రాంతి తీసుకొని తర్వాతి టోర్నీకి సిద్ధమవుతా.
> -ఫెడరర్

సెరెనా సెంచరీ...

అమెరికా దిగ్గజ క్రీడాకారిణి సెరెనా విలియమ్స్ సొంత గడ్డపై సివంగిలా విరుచుకు పడింది. క్వార్టర్ ఫైనల్లో 18వ సీడ్ వాంగ్ కియాంగ్ (చైనా)ను 6-1, 6-0తో చిత్తుగా ఓడించి 13వసారి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. కేవలం 44 నిమిషాల్లో ఈ మ్యాచ్ ముగియడం ఆమె దూకుడుకు నిదర్శనం. ఆరుసార్లు యూఎస్ ఓపెన్ గెలిచిన సెరెనాకు ఈ టోర్నీలో ఇది 100వ విజయం కావడం విశేషం. కియాంగ్‌పై సాధించిన ఈ గెలుపు 2019లో అతి తక్కువ వ్యవధిలో ముగిసిన రెండో మ్యాచ్. మాడ్రిడ్ ఓపెన్‌లో కుజ్నోవాను హలెప్ కూడా 44 నిమిషాల్లోనే చిత్తు చేసింది. గత రౌండ్‌లో రెండో సీడ్ యాష్లే బార్టీని ఓడించిన కియాంగ్ ఆటలు సెరెనా ముందు సాగలేదు. సెరెనా 25 విన్నర్లు కొడితే కియాంగ్ ఒక్కటీ కొట్టలేకపోయింది. సెమీఫైనల్లో ఐదో సీడ్ స్విటోలినా (ఉక్రెయిన్)తో సెరెనా తలపడుతుంది. 38 ఏళ్ల సెరెనా 1999లో తొలిసారి యూఎస్ ఓపెన్ నెగ్గింది. 20 ఏళ్ల తర్వాత ఆమె తన 24వ గ్రాండ్‌స్లామ్ సాధించేందుకు రెండు విజయాల దూరంలో నిలిచింది.

ఆస్ట్రేలియా 170/3

లబషేన్, స్మిత్ అర్ధసెంచరీలు

మాంచెస్టర్: యాషెస్ నాలుగో టెస్టుకు వరుణుడు అడ్డుగా నిలిచాడు. బుధవారం ఇక్కడ ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ పరస్పరం పైచేయికి యత్నిస్తున్న సమయంలో పలు సార్లు అంతరాయం కలిగించాడు. దీంతో 44 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కాగా... ఆసీస్ మూడు వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా ఓపెనర్లు వార్నర్ (0), హారిస్ (13) వికెట్లను త్వరగానే కోల్పోయింది. బ్రాడ్ (2/35) ఇన్నింగ్స్ నాలుగో బంతికే వార్నర్‌ను ఔట్ చేశాడు. అయితే, వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ లబషేన్ (128 బంతుల్లో 67; 10 ఫోర్లు); స్టీవ్ స్మిత్ (60 బ్యాటింగ్; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. మూడో వికెట్‌కు 116 పరుగులు జోడించారు. ప్రస్తుతం స్మిత్‌కు తోడుగా హెడ్ (18 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

బెయిల్స్ తీసేసి...

తొలి రోజు ఈ మ్యాచ్‌లో అరుదైన దృశ్యం కనిపించింది. తీవ్రంగా గాలి వీయడంతో పలుమార్లు బెయిల్స్ కింద పడ్డాయి. దాంతో అంపైర్లు ధర్మసేన, ఎరాస్మస్ ఇన్నింగ్స్ 32వ ఓవర్లో బెయిల్స్‌ను తొలగించి ఆటను కొనసాగించారు. ఇలా ఆడించడంపై ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్, బౌలర్ బ్రాడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

బంగర్... ఏమిటీ తీరు?

- సెలక్టర్ దేవాంగ్ గాంధీతో దురుసు ప్రవర్తన
- మాజీ బ్యాటింగ్ కోచ్‌ను ప్రశ్నించనున్న బీసీసీఐ

న్యూఢిల్లీ: టీమిండియా బ్యాటింగ్ కోచ్ పదవి నుంచి ఉద్వాసనకు గురైన అనంతరం సంజయ్ బంగర్ ప్రవర్తించిన తీరు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)కి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. మిగతా కోచింగ్ సిబ్బందికి పొడిగింపు ఇచ్చి తనను విస్మరించినందుకు రగిలిపోయిన బంగర్... ఇటీవలి వెస్టిండీస్ పర్యటనలో జట్టుతో పాటు ఉన్న జాతీయ సెలక్టర్ దేవాంగ్ గాంధీ పట్ల దురుసుగా వ్యవహరించాడు. హోటల్‌లోని దేవాంగ్ గాంధీ గదికి వెళ్లి వాగ్వాదానికి దిగాడు. ఓ దశలో మరింత కోపోద్రిక్తుడయ్యాడు. ఈ విషయమంతా బోర్డు దృష్టికి వచ్చింది. దీంతో బంగర్‌ను ప్రశ్నించాలని నిర్ణయించింది. అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ సునీల్ సుబ్రమణియన్, చీఫ్ కోచ్ రవిశాస్త్రిలను ఘటనపై నివేదిక కోరింది. బంగర్ ఆవేదనలో అర్థం ఉన్నా సెలక్టర్లను ప్రశ్నించే హక్కు అతడికి లేదని స్పష్టంచేసింది. 'రవిశాస్త్రి, బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్, ఫీల్డింగ్ కోచ్ శ్రీధర్‌ల పనితీరు బాగున్నందుకే కొనసాగింపు ఇచ్చాం. అదేమీ లేని బంగర్ మళ్లీ అవకాశం దక్కుతుందని ఎలా అనుకుంటాడు? ఎవరైనా సరే నిబంధనలు పాటించాల్సిందే. జట్టు మేనేజ్‌మెంట్ నివేదిక వచ్చాక దానిని క్రికెట్ పాలకుల కమిటీ (సీవోఏ) ముందుంచుతాం' అని బోర్డు అధికారి ఒకరు స్పష్టం చేశారు. ఇటీవలి ప్రక్రియలో హెడ్ కోచ్ నియామకాన్ని క్రికెట్ సలహా మండలి చూసుకోగా, సహాయ కోచ్‌లను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. మరోవైపు జట్టులోకి తీసుకోకపోవడంపై ఆటగాళ్లు సోషల్ మీడియాలో సెలక్టర్లపై కామెంట్లు చేస్తుండటం పైనా చర్చ నడుస్తోంది. గత సీజన్‌లో 850 పైగా పరుగులు చేసినా దులీప్ ట్రోఫీకి పరిగణనలోకి తీసుకోని వైనాన్ని సౌరాష్ట్ర బ్యాట్స్‌మన్ షెల్డన్ జాక్సన్ ప్రశ్నించాడు. ఇలాంటివాటిపై చర్యలు తీసుకునేలా సీవోఏ ఓ విధానం రూపొందించాల్సిన సమయం వచ్చిందని భావిస్తున్నారు.

భారత జట్టులో ముగ్గురు తెలంగాణ షట్లర్లు

ప్రపంచ జూ. బ్యాడ్మింటన్ పోటీలకు టీమిండియా ప్రకటన

ప్రణవ్

న్యూఢిల్లీ: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత బృందాన్ని భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) ప్రకటించింది. బాలురు, బాలికల విభాగాల్లో కలిపి మొత్తం 23 మంది ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఇందులో ముగ్గురు తెలంగాణ షట్లర్లకు చోటు దక్కింది. బాలుర విభాగంలో ప్రణవ్ రావు గంధం, నవనీత్ బొక్కా, ఖదీర్ మొయినుద్దీన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనబోతున్నారు. బాలికల విభాగంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఎవరూ ఎంపిక కాలేదు. ఆగస్టులో పంచకుల, బెంగళూరులలో జరిగిన ఆలిండియా జూనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో ప్రదర్శన, సాధించిన పాయింట్ల ఆధారంగా భారత జట్టును ఎంపిక చేశారు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 13 వరకు రష్యాలోని కజాన్‌లో ఈ టోర్నీ జరుగుతుంది.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనముల శాఖ
(జాతీయ రహదారుల విభాగము)
NIT No. SE(R&B) NH/KMNR/02/2019-20 టెండర్లు కోరుతూ ప్రకటన తేది: 30-08-2019
a) "తెలంగాణ రాష్ట్రంలోని NH 365A లోని కోదాడ-ఖమ్మం-కురవి సెక్షన్ యొక్క కి.మీ. 5/0 నుండి 13/7 వరకు ఎర్తెన్ షోల్డర్స్‌కు ER b) తెలంగాణ రాష్ట్రంలోని NH 365A లోని కోదాడ-ఖమ్మం-కురవి సెక్షన్‌లోని కి.మీ. 10/200 నుండి 500 వరకు బ్రిడ్జికి ER" పని నిర్వహించుట కోసం కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైన్‌లో బిడ్లు కోరబడుచున్నవి. సవివరమైన NIT ని 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ మార్కెట్ ప్లేస్ అనగా " www.tender.telangana.gov.in లో 05-09-2019న మ.3.00 గం. నుండి చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B), NH సర్కిల్, కరీంనగర్
DIPR RO. No.1065-DP/CL/Advt/1/2019-20, Dt: 04.09.2019

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e-NIT No.: 11/S.E. (R&B) KNR/01 to 05/2019-20 తేది: 27-08-2019
సిరిసిల్లా టౌన్‌లో ఎడమ వైపు కి.మీ.2 నుండి 2/950 వరకు, 3 నుండి 3/950 వరకు, 4 నుండి 4/500 వరకు మరియు సిరిసిల్లా టౌన్‌లో కుడివైపు కి.మీ 2 నుండి 2/950 వరకు, 3 నుండి 3/950 వరకు సిరిసిల్లా నుండి సిద్దిపేట రోడ్డుపై సిమెంట్, కాంక్రీట్, టైల్స్‌తో ఫుట్‌పాత్‌ల నిర్మాణం కోసం దిగువ సంతకందారు నుండి ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. పనుల సంఖ్య (5). మొత్తం ECV: రూ. 247.5 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ తేది & సమయం: 04.09.2019న సా. 4.00 గం.కు. బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం: 11.09.2019న మ. 3.30 గం.కు. కమర్షియల్ స్టేజ్: 11-09-2019న సా. 4.00 గం.కు. ఫోన్ నం. 0878-2243754. తదుపరి వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B) సర్కిల్, కరీంనగర్
DIPR RO. No.1063-DP/CL/Advt/1/2019-20, Dt: 04.09.2019

భారత్ 'ఎ' లక్ష్యం 193

- దక్షిణాఫ్రికా 'ఎ'తో నాలుగో వన్డే
- వాన అడ్డంకి.. నేడు కొనసాగింపు

తిరువనంతపురం: దక్షిణాఫ్రికా 'ఎ'తో జరుగుతున్న అనధికారిక వన్డే సిరీస్‌లో జోరు మీదున్న భారత్ 'ఎ'పై వరుణుడు నీళ్లుచల్లాడు. దీంతో ఈ 50 ఓవర్ల వన్డే కాస్తా 25-25 ఓవర్ల మ్యాచ్‌గా మారింది. అది కూడా పూర్తికాకపోవడంతో గురువారం రిజర్వ్ డేలో కొనసాగించనున్నారు. మొదట దక్షిణాఫ్రికా 'ఎ' 25 ఓవర్లలో వికెట్ నష్టానికి 137 పరుగులు చేసింది. హెంద్రిక్స్ (60 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం తర్వాత భారత్ లక్ష్యాన్ని 25 ఓవర్లలో 193 పరుగులుగా నిర్దేశించారు. శిఖర్ ధావన్ (21 బంతుల్లో 34 బ్యాటింగ్; 6 ఫోర్లు) చెలరేగాడు. వర్షంతో ఆట నిలిచే సమయానికి భారత్ 'ఎ' 7.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 56 పరుగులు చేసింది. గెలవాలంటే ఇంకా 17.2 ఓవర్లలో 137 పరుగులు చేయాలి.

భారత్ X ఒమన్

గువాహటి: ఖతర్ ఆతిథ్యమివ్వనున్న ఫిఫా వరల్డ్‌కప్-2022 అర్హత పోటీల్లో భాగంగా నేడు భారత్ ఒమన్‌తో తలపడనుంది. తమ కంటే ర్యాంకింగ్‌లో మెరుగైన ఒమన్‌తో పోరుకు సిద్ధంగా ఉన్నామని భారత ఫుట్‌బాల్ కోచ్ ఇగోర్ స్టిమాక్ తెలిపారు. 'వాస్తవంగా చెప్పాలంటే భారత్ ఉన్న గ్రూప్‌లో ఖతర్, ఒమన్‌లు పటిష్టమైన జట్లు. ప్రపంచ కప్ అర్హత పోటీల్లో వాటిని ఇంతవరకూ మేము ఓడించలేదు. కానీ మేము గెలుపే లక్ష్యంగా బరిలో దిగుతాం.' అని ఆయన అన్నారు. మూడో రౌండ్ అర్హత పోటీలకు క్వాలిఫై కావలంటే భారత్ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలవాలి. భారత్ ఒమన్‌లతో పాటు గ్రూప్‌లో ఖతర్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లున్నాయి.

అశ్విన్ ఇకపై ఢిల్లీ క్యాపిటల్స్‌కు

ఫ్రాంచైజీ మారనున్న ఆఫ్ స్పిన్నర్

న్యూఢిల్లీ: టీమిండియా ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రాబోయే ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడనున్నాడు. అతడిని 2018 సీజన్‌లో రూ.7.6 కోట్లకు కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్ ఎలెవెన్ సారథ్య బాధ్యతలూ అప్పజెప్పింది. రెండు సీజన్లలో అశ్విన్ కెప్టెన్సీలో జట్టు 12 మ్యాచ్‌ల్లో గెలిచి, 16 మ్యాచ్‌ల్లో ఓడింది. ఓ దశలో మెరుగైన ఆటతో ప్లే ఆఫ్స్ రేసులో నిలిచినా తర్వాత వెనుకబడింది. ఇప్పుడు ఢిల్లీ నగదు ఒప్పందంపైనే అతడిని తీసుకోనుందని సమాచారం. 'అశ్విన్ ఫ్రాంచైజీ మార్పు అంశంపై బీసీసీఐ నుంచి త్వరలో ప్రకటన రానుంది. జట్టులోకి యువ స్పిన్నర్‌ను తీసుకోవాలనే ఉద్దేశంతో ఉన్న పంజాబ్ అశ్విన్‌ను వదులుకునేందుకు సిద్ధపడిం ది' అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. అశ్విన్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా ప్రయత్నించినా అది ముందుకు కదల్లేదని సమాచారం.

దబంగ్ ఢిల్లీ జోరు

ఉత్కంఠ పోరులో జైపూర్‌పై గెలుపు

బెంగళూరు: ప్రస్తుత కబడ్డీ లీగ్ సీజన్‌లో దబంగ్ ఢిల్లీ వరుస విజయాలతో దూసుకెళ్తుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 46-44తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలిచింది. అదిరే ఆరంభంతో మ్యాచ్‌ను మొదలు పెట్టి... వెంటనే చతికిలపడ్డ ఢిల్లీ చివరి మూడు నిమిషాల్లో విజృంభించి విజేతగా నిలిచింది. ఆ జట్టు స్టార్ రైడర్ నవీన్ కుమార్ ఈ సీజన్‌లో పదో సూపర్ 'టెన్' (16 పాయింట్లు)ను నమోదు చేశాడు. ఇవి వరుస మ్యాచ్‌ల్లో నమోదు కావడం విశేషం. జైపూర్ రైడర్ దీపక్ హుడా 11 పాయింట్లతో రాణించినా నవీన్ దూకుడు ముందు అదేమి కనిపించలేదు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 40-39తో పట్నా పైరేట్స్‌పై నెగ్గింది. విజయం అంచుల వరకు వచ్చిన పట్నాను పవన్ షెరావత్ (17 పాయింట్లు) చివర్లో తన రైడ్‌తో బోల్తా కొట్టించి బెంగళూరును విజేతగా నిలిపాడు. నేడు పుణేరి పల్టన్‌తో యు ముంబా తలపడుతుంది.

ఢిల్లీ - జైపూర్ మ్యాచ్

పాకిస్తాన్ హెడ్ కోచ్, చీఫ్ సెలక్టర్‌గా మిస్బా

లాహోర్: ఆశ్చర్యకర నిర్ణయాలకు వేదికైన పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఉన్నపళంగా తమ మాజీ కెప్టెన్ మిస్బా ఉల్ హక్‌కు రెండు కీలక బాధ్యతల్ని అప్పగించింది. అతన్ని హెడ్ కోచ్, చీఫ్ సెలక్టర్‌గా నియమించింది. కోచ్‌గా అయితే ఏకంగా మూడేళ్ల కాంట్రాక్టును కట్టబెట్టింది. 'మాజీ కెప్టెన్ మిస్బాను కొత్త కోచ్‌గా నియమించాం. అన్ని ఫార్మాట్లకు అతను ప్రధాన కోచ్‌గా మూడేళ్లపాటు వ్యవహరిస్తాడు' అని పీసీబీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌లో పాక్ లీగ్ దశలోనే నిష్క్రమించడంతో కోచింగ్ సిబ్బందిని తొలగించింది. హెడ్ కోచ్ మికీ ఆర్థర్, బౌలింగ్ కోచ్ అజహర్ మహమూద్, బ్యాటింగ్ కోచ్ గ్రాంట్ ఫ్లవర్‌ల కాంట్రాక్టును పొడిగించలేదు.

రాణించిన ఉనాద్కట్: ఇండియా గ్రీన్ 147/8

బెంగళూరు: లెఫ్టార్మ్ పేసర్ జైదేవ్ ఉనాద్కట్ (4/58) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో ఇండియా గ్రీన్‌ను వణికించాడు. దీంతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో తొలిరోజు ఇండియా రెడ్ పైచేయి సాధించింది. ఆటకు వర్షం ఆటంకం కలిగించడంతో మొదటి రోజు కేవలం 49 ఓవర్ల ఆటే సాగింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇండియా గ్రీన్ 8 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫయాజ్ ఫజల్ (12), అక్షత్ రెడ్డి (16) సహా టాపార్డర్, మిడిలార్డర్ అంతా విఫలమైంది. రెడ్ బౌలర్లలో సందీప్ వారియర్, అవేశ్ ఖాన్, ఆదిత్య సర్వతే తలా ఒక వికెట్ తీశారు.

భారత ప్రభుత్వం
అంతరిక్ష శాఖ
భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ
నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్
బాలానగర్, హైదరాబాద్-500037
గమనిక
నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, బాలానగర్, హైదరాబాద్ ఉద్యోగి అయిన శ్రీ ఎన్.టి.చక్రవర్తి, Sci/Engr-SD, E.C.No. NR01566 కు 18.03.2014 నుండి విధుల నుండి అతని అనధికారిక గైర్హాజరు మరియు ఇతర దుష్ప్రవర్తనకు సంబంధించి DOS ఎంప్లాయీస్ CCA రూల్స్ 1976 క్రింద చార్జ్‌షీట్ 27.02.2019న జారీ చేయబడినది మరియు అతని నివాస చిరునామా అంటే H.No.18-08-410/16, లలితాబాగ్, ఉప్పుగూడ, హైదరాబాద్‌లోని అతనికి అధికారిక రికార్డుల ప్రకారం స్పీడ్ పోస్ట్ అక్నాలెడ్జ్‌మెంట్ ద్యూతో రెండుసార్లు 12.03.2019న మరియు 22.04.2019న పంపబడినది. "క్లెయిమ్ చేయబడలేదు" అని పోస్టల్ అధికారులచే ఇది వాపసు చేయబడినది మరియు ఆ తరువాత చత్రినాకాలోని అతని నివాసం అనగా H.No. 18-3-15/1, సుజాత నిలయం, చత్రినాకా, హైదరాబాద్ వద్ద 10.06.2019న NRSC అధికారుల ద్వారా వ్యక్తిగతంగా అతనికి అందజేసేందుకు ప్రయత్నం చేయగా అది అతనిచే స్వీకరించబడలేదు. ఆ సందర్భన తరువాత 11.06.2019న అక్నాలెడ్జ్‌మెంట్ ద్యూతో స్పీడ్ పోస్ట్ ద్వారా చత్రినాకాలోని అతని నివాస చిరునామాకు చార్జ్‌షీట్ పంపగా, అది కూడా "క్లెయిమ్ చేయబడలేదు" అని పోస్టల్ అధికారులచే తిప్పి పంపబడినది. చత్రినాకాలోని అతని నివాసానికి ఆర్డినరీ పోస్ట్‌ద్వారా 29.07.2019న మరోసారి చార్జ్‌షీట్ పంపబడినది. తదుపరి 20.08.2019న చత్రినాకాలోని అతని నివాసం యొక్క మెయిన్ గేట్ ప్రక్కన గల గోడ పైన కూడా చార్జ్‌షీట్ కాపీ అతికించబడినది.
2. ఈ నోటీసు ప్రచురించబడిన 15 రోజులలోగా శ్రీ ఎన్.టి.చక్రవర్తి నుండి ఒకవేళ ఎటువంటి ప్రతిస్పందన అందనట్లయితే, అమలులో ఉన్న నియమాల ప్రకారం ఈ విషయంలో తదుపరి ముందుకు సాగేందుకు ఈ కార్యాలయానికి స్వేచ్ఛ కలదు.
సం/- భారత ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ
అంతరిక్ష శాఖ

సాక్షి బిజినెస్
గురువారం
5-9-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
162 ▲	47 ▲
36,725	10,845

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	7,966	▲ 92
డోజోన్స్	26,322	▲ 204
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,311	▲ 43
డాక్స్	12,025	▲ 114
షాంఘై	2,957	▲ 27
నికాయ్	20,649	▲ 24

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	71.45	73.10
బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	85.99	89.07
యూరో	ఎస్‌బీఐ	77.84	80.78
జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	66.96	69.49
ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.98	50.15
సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	51.13	52.89
సౌదీ రియాల్	ధామన్‌కుర్	18.44	20.05
యూఏఈ దిర్హామ్	ధామన్‌కుర్	19.17	20.18
చైనా యువాన్	ధామన్‌కుర్	9.46	10.71

జియో బ్రాడ్‌బ్యాండ్‌తో సెట్‌టాప్ బాక్స్ ఉచితం!

నేటి నుంచే జియోఫైబర్ సర్వీసులు ప్రారంభం

న్యూఢిల్లీ: డీటీహెచ్, కేబుల్ టీవీ కస్టమర్లను ఆకర్షించే దిశగా టెలికం దిగ్గజం రిలయన్స్ జియో ప్రతి బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్‌పై ఉచితంగా సెట్‌టాప్ బాక్స్ కూడా అందించనున్నట్లు తెలుస్తోంది. 'జియోఫైబర్ కస్టమర్లందరికీ కాంప్లిమెంటరీ సెట్ టాప్ బాక్స్ కూడా లభిస్తుంది' అని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అలాగే, పేరొందిన ఎంటర్‌టైన్‌మెంట్ మొబైల్ యాప్స్‌లోని వీడియో కంటెంట్, సినిమాలు మొదలైనవన్నీ కూడా జియోఫైబర్ కస్టమర్లకు అందుబాటులో ఉంటాయి. వీటి సబ్‌స్క్రిప్షన్ ఫీజు కూడా కలిపే బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ చార్జీలు ఉంటాయి. ప్రత్యేకంగా కంటెంట్‌కు చెల్లించనక్కర్లేదు. ఇక సెట్‌టాప్‌కు కెమెరాను అమర్చుకుంటే టీవీ ద్వారా వీడియో కాలింగ్ సేవలు కూడా పొందవచ్చని సమాచారం.

నేటి నుంచి (సెప్టెంబర్ 5) ఆప్టికల్ ఫైబర్ ఆధారిత జియోఫైబర్ సర్వీసులను జియో ప్రారంభిస్తున్న సంగతి తెలిసిందే. జియోఫైబర్ కస్టమర్లకు ల్యాండ్‌లైన్ నుంచి జీవితాంతం ఉచిత వాయిస్ కాల్స్, సెకనుకు 100 మెగాబిట్ నుంచి 1 గిగాబిట్ దాకా స్పీడ్‌తో బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందనున్నాయి. దీని చార్జీలు నెలకు రూ. 700 నుంచి ప్రారంభమవుతాయి. వార్షిక ప్లాన్ తీసుకున్న వారికి ఉచితంగా హెచ్‌డీ టీవీ సెట్ కూడా అందిస్తామంటూ రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ గతంలో వెల్లడించారు. మొత్తం మీద జియోఫైబర్ రాకతో చాలామటుకు డైరెక్ట్ టు హోమ్ సేవలందించే సంస్థల వ్యాపారాలకు గట్టి దెబ్బే తగిలే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ

వర్గాలు భావిస్తున్నాయి. దీన్ని తట్టుకునేందుకు ఆయా సంస్థలు ఇప్పటికే వివిధ ప్యాకేజీలు ప్రకటిస్తున్నాయి. జీ5, హుక్ వంటి పలు వీడియో స్ట్రీమింగ్ మొబైల్ యాప్స్ కంటెంట్ అందుబాటులోకి తెస్తూ భారతీ ఎయిర్‌టెల్ కొత్తగా రూ. 3,999కి సెట్ టాప్ బాక్స్‌ను ఆవిష్కరించింది. తొలి ఏడాది తర్వాత రూ. 999 వార్షిక ఫీజుతో సబ్‌స్క్రిప్షన్‌ను కొనసాగించవచ్చు.

సెక్యూరిటీ సేవల్లోకి జియో

- అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు సర్వీసులు
- జియోగేట్ పేరుతో యాప్...

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన టెలికం దిగ్గజం రిలయన్స్ జియో మరిన్ని కొత్త రంగాల్లోకి కార్యకలాపాలు విస్తరిస్తోంది. తాజాగా అపార్ట్‌మెంట్ల భద్రత నిర్వహణ సేవల విభాగంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకు సంబంధించి యాపిల్ యాప్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్‌లో జియో గేట్ పేరిట కొత్త యాప్ ప్రత్యక్షమవడం ఈ వార్తలకు ఊతమిస్తోంది. గేటెడ్ కమ్యూనిటీల్లో విజిటర్లు మొదలుకుని రోజువారీ సిబ్బంది, డెలివరీ బాయ్స్, క్యాబ్స్ దాకా అన్నింటి రాకపోకల వివరాల నిర్వహణ అంతా జియోగేట్ క్రమబద్ధీకరిస్తుందని యాప్ గురించిన వివరణలో ఉంది. 'దొంగతనాలు, నేరాలపై ఆందోళన లేకుండా కమ్యూనిటీ పరిసర ప్రాంతాలను సురక్షితంగా తీర్చిదిద్దేలా సెక్యూరిటీ నిర్వహణ ప్రక్రియను సమూలంగా మారుస్తున్నాం' అని యాప్ గురించి జియో పేర్కొంది.

ప్రత్యర్థి సంస్థలకు గట్టి పోటీ..: ప్రస్తుతం మైగేట్, అపార్ట్‌మెంట్ అడ్డా, స్మార్ట్‌గార్డ్ వంటి సంస్థలు యాప్ ఆధారిత అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ మేనేజ్‌మెంట్ సేవలు అందిస్తున్నాయి. జియో గానీ భారీ యెత్తున వస్తే వీటికి గట్టి పోటీనివ్వొచ్చని పరిశ్రమవర్గాలు భావిస్తున్నాయి. జియోగేట్ ఫీచర్స్‌ను బట్టి చూస్తే యూజర్లు తమ స్మార్ట్‌ఫోన్‌నే ఇంటర్‌కామ్ డివైజ్‌గా కూడా వాడుకోవచ్చన్నట్లు తెలుస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో తామెక్కడ ఉన్నామో కుటుంబ సభ్యులు, సెక్యూరిటీ గార్డుకు తెలియజేసేందుకు వీలుగా పానిక్ అలర్ట్ ఫీచర్ కూడా ఇందులో ఉంది. అయితే, సెక్యూరిటీ సేవల విభాగంలోకి ఎంట్రీపై జియో ఇంకా స్పందించాల్సి ఉంది.

ప్యాకేజింగ్‌లో 'ప్లాస్టిక్' తగ్గించనున్న అమెజాన్

న్యూఢిల్లీ: ఒకసారి మాత్రమే ఉపయోగించడానికి పనికొచ్చే ప్లాస్టిక్‌తో ప్యాకేజింగ్‌ను 2020 జూన్ నాటికి పూర్తిగా నిలిపివేయాలని ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా నిర్దేశించుకుంది. ప్రస్తుతం తమ గిడ్డంగుల్లో ప్యాకేజింగ్‌కు ఉపయోగించే ప్లాస్టిక్‌లో సింగిల్ యూజ్ తరహా ప్లాస్టిక్ వాటా ఏడు శాతం కన్నా తక్కువే ఉంటుందని సంస్థ వైస్ ప్రెసిడెంట్ అఖిల్ సక్సేనా తెలిపారు. వ్యర్థాలను తగ్గించుకుని, పర్యావరణ అనుకూల ప్యాకేజింగ్‌ను ప్రోత్సహించాలన్న లక్ష్యానికి అమెజాన్ కట్టుబడి ఉందని ఆయన వివరించారు. బబుల్ ర్యాప్స్, ఎయిర్ పిల్లో మొదలైన ప్లాస్టిక్ ప్యాకేజింగ్ ఉత్పత్తుల స్థానంలో 'పేపర్ కుషన్స్'ను వినియోగించనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఆఖరుకి అన్ని గిడ్డంగులకు విస్తరించనున్నట్లు సక్సేనా వివరించారు. 2021 మార్చికి 100% రీసైకిల్డ్ ప్లాస్టిక్ వినియోగం దిశగా.. ఇప్పటికే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని 25% తగ్గించుకున్నట్లు ఫ్లిప్‌కార్ట్ ఇప్పటికే ప్రకటించింది.

ఫుడ్ యాప్స్.. డిస్కౌంటు పోరు!

- అగ్రిగేటర్స్, హోటళ్ల మధ్య చిచ్చు
- భారీ డిస్కౌంట్లు ఇవ్వలేమంటున్న హోటళ్లు
- ఫుడ్ యాప్స్ నుంచి నిష్క్రమణ

వంద రూపాయలు ఖరీదు చేసే టిఫిన్.. యాభైకే, ఒకటి తీసుకుంటే ఒకటి ఫ్రీ అంటూ సగానికి సగం డిస్కౌంట్లు ఆఫర్ చేసే ఫుడ్ అగ్రిగేటర్ యాప్స్‌కి ప్రస్తుతం పెద్ద చిక్కొచ్చి పడింది. ఇలాంటి భారీ డిస్కౌంట్లు మేం ఇవ్వలేమంటూ యాప్స్ నుంచి హోటల్స్ ఒక్కొక్కటిగా తప్పుకుంటున్నాయి. ముందుగా బెట్టు చేసినా .. ఆ తర్వాత సమస్య సామరస్యంగా పరిష్కరించుకుందాం అంటూ అగ్రిగేటర్స్ ముందుకొచ్చినప్పటికీ.. హోటళ్ల యాజమాన్యాలు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. దీంతో.. అగ్రిగేటర్స్, హోటళ్ల మధ్య డిస్కౌంటు పోరు మరింతగా ముదురుతోంది. బడా రెస్టారెంట్లు, చోటా మోటా హోటళ్ల మధ్య పోరు కింద మారుతోంది. జొమాటో వంటి ఫుడ్ యాప్స్.. ప్రత్యేక మెంబర్‌షిప్ తీసుకున్న యూజర్లకు అందిస్తున్న డైన్-ఇన్ ఆఫర్లు ఈ వివాదానికి దారితీశాయి. వాస్తవానికి ఈ ఆఫర్ల ఉద్దేశం మెరుగైన రేటింగ్ హోటళ్లలో భోంచేసేలా కస్టమర్లను ఆకర్షించడమే అయినా.. ఆయా హోటళ్లు ఇవే తమకు గుదిబండగా మారుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో లాగ్‌అవుట్ ఉద్యమం లేవనెత్తాయి. ఫుడ్ యాప్స్ నుంచి తప్పుకుంటున్నాయి.

ఆకర్షణీయ ఆఫర్లు ..

అగ్రిగేటర్ యాప్స్.. యూజర్లను ఆకర్షించేందుకు రకరకాల ఆఫర్స్ ఇస్తున్నాయి. ఉదాహరణకు జొమాటో సంగతి తీసుకుంటే ఈ సంస్థ గోల్డ్ పేరిట ప్రత్యేక మెంబర్‌షిప్ ప్రోగ్రాం నిర్వహిస్తోంది. ఇందులో సభ్యత్వం తీసుకున్న యూజర్లు.. ఇందులో లిస్టయిన హోటళ్లలో ఒకటి

తీసుకుంటే మరొకటి ఉచితం తరహాలో మెనూలో ఏ వంటకాన్నైనా, ఎంత పరిమాణమైనా, ఏ హోటల్లోనైనా, ఎన్నిసార్లయినా తినొచ్చని ఆఫర్ ఇచ్చింది. ఈ గోల్డ్ ప్రోగ్రాంలో చేరాలంటే ఆయా రెస్టారెంట్లకు మంచి రేటింగు ఉండాలి. ఫుడ్ డెలివరీ సర్వీసు బాగుండాలి వంటి ప్రమాణాలు ఉన్నాయి. కాబట్టి అన్ని హోటళ్లు కాకుండా కొన్ని హోటళ్లకే ఈ గోల్డ్‌లో సభ్యత్వం లభిస్తోంది.

రెస్టారెంట్ల వాదనేంటంటే..

కస్టమర్లను హోటళ్ల వైపు ఆకర్షించేందుకు ప్రవేశపెట్టిన ఈ ఆఫర్ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ.. ఇందులో భారీ డిస్కౌంట్లు ఇవ్వాల్సి వస్తుండటం తమను దెబ్బతీస్తోందని రెస్టారెంట్లు వాదిస్తున్నాయి. తాము అత్యంత తక్కువగా 10 శాతం మార్జిన్లతో హోటళ్లు నిర్వహిస్తుంటామని ఏకంగా 50 శాతం డిస్కౌంటు ఇవ్వాల్సి వస్తుండటంతో తమ వ్యాపారాలపై చాలా ప్రతికూల ప్రభావం పడుతోందని ది నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ (ఎన్ఆర్ఏఐ) మాజీ ప్రెసిడెంట్ రియాజ్ అమ్లానీ పేర్కొన్నారు. పైపెచ్చు అగ్రిగేటర్స్ యాప్‌లో తాము లిస్ట్ చేసుకోవాలంటే భారీగా చెల్లించుకోవాల్సి వస్తోందని, దానితో పాటు కమీషన్లూ ఇచ్చుకోవాల్సి ఉంటోందని చెప్పారు. సందర్భాన్ని బట్టి కొన్ని సార్లు రెస్టారెంట్లు ఏకంగా రూ. 75,000 దాకా సైన్-అప్ ఫీజు చెల్లించుకోవాల్సి వస్తోందని వివరించారు. ఇక కొన్నింటికి మాత్రమే ఎక్స్‌క్లూజివ్ సభ్యత్వం అన్న యాప్స్.. ఆ తర్వాత కుప్పలు తెప్పలుగా మెంబర్‌షిప్స్ ఇచ్చేస్తుండటంతో పోటీ మరింత పెరిగిపోతోందని హోటల్స్ ఆక్షేపిస్తున్నాయి. ఈ పరిణామాల కారణంగా జొమాటో, నియర్‌బై, మ్యాజిక్‌పిన్, ఈజీడైనర్ వంటి యాప్స్ పాటించే భారీ డిస్కౌంటు విధానాలను వ్యతిరేకిస్తూ.. వాటి నుంచి నిష్క్రమించేందుకు ఆగస్టు 15 సుమారు 300 రెస్టారెంట్లు లాగ్‌అవుట్ ఉద్యమాన్ని మొదలెట్టాయి. ఇప్పటిదాకా దాదాపు 2,500 పైగా రెస్టారెంట్లు ఇలా యాప్స్ నుంచి లాగవుట్ అయినట్లు అంచనా. ఎన్ఆర్ఏఐలో దాదాపు 6,000 పైచిలుకు రెస్టారెంట్లకు సభ్యత్వం ఉంది.

వెనక్కి తగ్గని రెస్టారెంట్లు

అయితే, ఈ ప్రతిపాదనలను రెస్టారెంట్లు కొట్టిపారేశాయి. గతంలో నోటీసు ఇవ్వకుండా తప్పుకున్నందుకు పెనాల్టీలు అంటూ బెదిరించిన అగ్రిగేటర్లు ప్రస్తుతం ఉచితంగా సభ్యత్వం అంటూ ఊరించినా ఉపయోగం లేదని పేర్కొన్నాయి. దీంతో... లాగ్‌అవుట్ పరిష్కార ప్రయత్నాలను విరమించుకుంటున్నట్లు గోయల్ గురువారం ప్రకటించారు. అదే సందర్భంలో లాగ్‌అవుట్ ఉద్యమానికి మూలకారకుడైన ఎన్ఆర్ఏఐ ప్రెసిడెంట్ రాహుల్ సింగ్‌పై కూడా వ్యాఖ్యలు చేశారు. డిస్కౌంట్లను వ్యతిరేకిస్తూ ఉద్యమం లేవనెత్తిన రాహుల్ సింగ్ స్వయంగా తాను నిర్వహించే ది బీర్ కెఫే అవుట్‌లెట్స్‌లో మాత్రం డిస్కౌంట్లు ఇస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. ఇదంతా చూస్తుంటే అగ్రిగేటర్స్‌ను దెబ్బతీసి, లబ్ధి పొందేందుకు కొందరు బడా రెస్టారెంటు ఓనర్లు ఎన్ఆర్ఏఐని వాడుకుంటున్నట్లుగా కనిపిస్తోందంటూ విమర్శలు గుప్పించారు. అయితే, ఏ వ్యాపారానికైనా విశ్వాసవంతమైన కస్టమర్లు అవసరమన్నది తమకూ తెలుసని రాహుల్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఎవరికి పడితే వారికి కాకుండా తమ టాప్ 500 కస్టమర్స్‌కే ఇలాంటి ఆఫర్లు ఇస్తున్నామని, జొమాటో పిల్ల దశలో ఉన్నప్పుడే తమ యాప్‌కు 3.5 లక్షల డౌన్‌లోడ్‌లు ఉన్నాయన్నారు. 'ఓనర్లలాగా బ్రోకర్లకు అధికారాలు ఉండవు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏదైతేనేం.. ఇప్పటికైతే ఈ విమర్శలు, ప్రతి విమర్శలకు ఇప్పుడప్పుడే ఫుల్‌స్టాప్ పడేట్లు కనిపించడం లేదు.

ప్రాఫిట్ ప్లస్ డైలీ

మీ ఐటీఆర్ ఏ దశలో ఉంది?

గత నెల 31తో ఆదాయపన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలు గడువు ముగిసింది. గడువులోపు రిటర్నులను ఆన్‌లైన్‌లో ఫైల్ చేసిన వారు, సంబంధిత ఐటీఆర్ ఏ దశలో ఉందో (స్టాటస్) తెలుసుకోవడం అవసరం. దీనివల్ల మీ ఐటీఆర్ ప్రాసెస్ అయిందా? లేక పన్ను చెల్లింపు దారు వైపు నుంచి తదుపరి చర్య ఏదైనా అవసరం ఉందా? అన్నది తెలుస్తుంది. మీ ఐటీఆర్ ఏ దశలో ఉందో తెలుసుకోవడం ఎంతో సులభం. ఈ ఫైలింగ్ పోర్టల్‌కు లాగిన్ అయిన తర్వాత 'వ్యూ రిటర్న్స్/ఫామ్స్' ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే, దాఖలు చేసిన ఐటీఆర్‌ల జాబితా కనిపిస్తుంది. 'రిటర్న్ అప్‌లోడెడ్, పెండింగ్ ఫర్ ఐటీఆర్‌వీ/ఈ వెరిఫికేషన్' అని చూపిస్తే.. మీరు వెరిఫై చేసిన తర్వాతే మీ ఐటీఆర్ ప్రాసెస్‌కు వెళుతుందని అర్థం. మీ ఐటీఆర్‌ను ఆదాయపన్ను శాఖ ప్రాసెస్ చేస్తే అక్కడే అదే కనిపిస్తుంది. ఇలా మీ ఐటీఆర్‌కు సంబంధించి పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

దిద్దుబాటు ప్రయత్నాల్లో అగ్రిగేటర్స్..

రెస్టారెంట్లు హఠాత్తుగా కీలక ప్రోగ్రాం నుంచి తప్పుకుంటుండటంతో ఫుడ్ యాప్స్ హడావుడిగా సమస్యల పరిష్కారం కోసం రంగంలోకి దిగాయి. గోల్డ్ ఆఫర్‌లో మార్పులు, చేర్పులు చేస్తామంటూ జొమాటో ప్రతిపాదించింది. 'కొందరు యూజర్లు ఒక హోటల్లో 1+1 స్టార్టరు తీసుకుని, మరో చోట 1+1 మెయిన్ కోర్స్ తిని, మరో చోట 2+2 డ్రింక్స్ తీసుకోవడం వంటివి చేస్తున్నారు. ఇలాంటి వాటి వల్ల డిస్కౌంటింగ్ భారం భారీగా పెరుగుతోంది. ఇకపై అలా జరగకుండా యూజర్లు గోల్డ్ ఆఫర్‌ను రోజులో ఒక్కసారి, ఒక్క హోటల్లో మాత్రమే వినియోగించుకునేలా సవరిస్తాం' అంటూ జొమాటో సీఈవో దీపిందర్ గోయల్ ప్రతిపాదించారు. అలాగే, గోల్డ్ మెంబర్‌షిప్ ఉన్న హోటళ్లకు ఉచిత ప్రకటనలు మొదలైన వాటి రూపంలో ప్రత్యేక ప్రయోజనాలూ కల్పిస్తామన్నారు. లాగ్‌అవుట్ ఉద్యమంలో భాగంగా తమ యాప్ నుంచి తప్పుకున్న రెస్టారెంట్లకు మళ్లీ ఉచితంగా సభ్యత్వం కూడా ఇస్తామని చెప్పారు. ఇందుకు సెప్టెంబర్ 15 దాకా గడువివ్వాలంటూ కోరారు.

9న యూనియన్ బ్యాంక్ బోర్డు సమావేశం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఆంధ్రా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంకులను విలీనం చేసుకునే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసే క్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బోర్డు సెప్టెంబర్ 9న సమావేశం కానుంది. రూ. 11,700 కోట్ల మూలధన సమీకరణ అంశంపై కూడా ఇందులో చర్చించనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు బ్యాంకు తెలియజేసింది. మరోవైపు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో విలీన ప్రతిపాదనను ఆమోదించేందుకు సెప్టెంబర్ 6న బోర్డు సమావేశం కానున్నట్లు యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. 10 ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనం చేస్తూ కేంద్రం ఆగస్టు 30న సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

హాట్‌కేకుల్లా వేరబుల్స్

- 30 లక్షల మార్కును దాటిన సేల్స్
- మూడో స్థానంలో నిలిచిన భారత్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వేరబుల్ డివైజెస్ స్మార్ట్‌ఫోన్లతో పోటీపడుతున్నట్టుగా ఉంది. భారత్‌లో వీటి విక్రయాలు కనీవినీ ఎరుగని రీతిలో ఆల్‌టైం హైకి చేరుకున్నాయి. ఏప్రిల్-జూన్ కాలంలో ఏకంగా 30 లక్షల యూనిట్లకుపైగా అమ్మకాలు నమోదయ్యాయంటే వీటికి ఉన్న క్రేజ్ అర్థం చేసుకోవచ్చు. వృద్ధి క్రితం త్రైమాసికంతో పోలిస్తే 30.9 శాతం నమోదైంది. అంతర్జాతీయంగా మొత్తం విక్రయాల పరంగా చూస్తే భారత్ మూడో స్థానాన్ని పదిలపరుచుకుంది. వేరబుల్ డివైజెస్ వినియోగంలో తొలి రెండు స్థానాల్లో చైనా, యూఎస్ మార్కెట్లు నిలిచాయి. ఫిట్‌నెస్ బ్యాండ్స్, స్మార్ట్‌వాచ్‌లు, హియరేబుల్స్ వంటి వేరబుల్ డివైజెస్‌ను విభిన్న ఫీచర్లు, ధరల శ్రేణితో కంపెనీలు పోటీపడుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ కంపెనీలు సైతం వేరబుల్ డివైజెస్‌ను తయారు చేస్తున్నాయి.

హియరేబుల్స్‌కు ఆదరణ..

ఐడీసీ గణాంకాల ప్రకారం 2019 జనవరి-మార్చిలో భారత్‌లో 23.1 లక్షల యూనిట్ల వేరబుల్ డివైజెస్ కస్టమర్ల చేతుల్లోకి చేరాయి. అదే 2018 ఏప్రిల్-జూన్ కాలంతో పోలిస్తే క్రితం త్రైమాసికం వృద్ధి ఏకంగా 123.6 శాతం నమోదైంది. ఈ అంకెలనుబట్టి చూస్తుంటే వేరబుల్ డివైజెస్‌కు పెరుగుతున్న డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అవగతమవుతోంది. మరో విశేషమేమంటే ఏప్రిల్-జూన్‌లో రిస్ట్ బ్యాండ్స్‌ను మించి హియరేబుల్స్ సేల్స్ నమోదయ్యాయి. ఈ విభాగం అంత క్రితం త్రైమాసికంతో పోలిస్తే 122.7 శాతం, క్రితం ఏడాది ఏప్రిల్-జూన్‌తో పోలిస్తే 374.9 శాతం వృద్ధిని నమోదు చేసింది. హెల్త్, ఫిట్‌నెస్‌ను ట్రాక్ చేసే వైర్‌లెస్ ఇయర్ వేర్ మోడళ్లకు డిమాండ్ పెరుగుతోంది. ఇయర్ వేర్ విభాగం 55.9 శాతం, రిస్ట్ బ్యాండ్స్ 35.2, స్మార్ట్ వాచెస్ 6.9 శాతం వాటాను కైవసం చేసుకున్నాయి.

రుణాలన్నీ ఇక 'రెపో'తో జత!

- అనుసంధానం చేయాల్సిందేనని బ్యాంకులకు ఆర్‌బీఐ స్పష్టీకరణ
- అక్టోబర్ 1 నుంచీ అమల్లోకి...

ముంబై: బ్యాంకింగ్ రుణ రేట్లు అన్నీ రెపోసహా ద్రవ్య విధాన నిర్ణయ రేట్లకు, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రేట్లకు అనుసంధానం కావాల్సిందేనని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులకు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆర్‌బీఐ బుధవారం ఒక సర్క్యులర్ జారీ చేసింది. మూడు నెలలకు ఒకసారి ఇలాంటి అనుసంధాన నిర్ణయాలు (రిసెట్) జరగాలని సర్క్యులర్ నిర్దేశించింది. ''వ్యక్తిగత లేదా గృహ, ఆటో అలాగే లఘు, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) ఇచ్చే కొత్త ఫ్లోటింగ్ (చర వడ్డీరేటు) రేట్లు ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నుంచీ తప్పనిసరిగా రెపో సహా ద్రవ్య, పరపతి విధాన నిర్ణయ రేట్లకు, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రేట్లకు తప్పనిసరిగా అనుసంధానం చేయాల్సి ఉంటుంది'' అని సర్క్యులర్ స్పష్టం చేసింది. దీని ప్రకారం, బ్యాంకులు ఇకపై తమ రుణ రేట్లను తప్పనిసరిగా రెపో, మూడు నెలలు లేదా ఆరు నెలల బ్యాండ్లపై లభించే వడ్డీరేట్లకు లేదా ఫైనాన్షియల్ బెంచ్‌మార్క్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రచురించే ఇతర బెంచ్‌మార్క్ రేట్లకు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. దీనితో ఆర్‌బీఐ రెపో తగ్గిస్తే, ఆ ప్రయోజనం త్వరితగతిన కస్టమర్‌కు అందుబాటులోనికి రావడానికి వీలు కలుగుతుంది. బ్యాంకులు తమకు లభించిన రెపో రేటు ప్రయోజనాన్ని కస్టమర్లకు బదలాయించడం లేదని, ఆర్థిక మందగమనానికి ఇది ఒక కారణమనీ వస్తున్న విమర్శల నేపథ్యంలో ఆర్‌బీఐ తాజా సర్క్యులర్ జారీ అయ్యింది.

ప్రస్తుత పరిస్థితిపై నిరుత్సాహం...

''ప్రస్తుతం నిధుల సమీకరణ-వ్యయ మిగులు ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్) విధానాన్ని బ్యాంకులు అనుసరిస్తున్నాయి. అయితే వివిధ కారణాల వల్ల ఆర్‌బీఐ విధానపరమైన రేటు నిర్ణయ బదలాయింపు ప్రక్రియ ఎంసీఎల్ఆర్ మార్గంలో ఆలస్యం అవుతోంది''అని కూడా ఆర్‌బీఐ తన సర్క్యులర్‌లో తెలిపింది. కాగా ఇప్పటికి దాదాపు 12 బ్యాంకులు తమ రుణ రేటును రెపోను అనుసంధానించడం జరిగింది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు- రెపో (ప్రస్తుతం 5.4 శాతం) గడచిన నాలుగు ద్వైమాసికాల్లో 1.1 శాతం తగ్గిన నేపథ్యంలో పలు బ్యాంకులు తమ రుణ రేటును తగ్గిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఆగస్టు వరకూ రెపో 0.75 బేసిస్ పాయింట్లు తగ్గితే, (అటు తర్వాత 35 బేసిస్ పాయింట్లు) బ్యాంకులు మాత్రం 0.30 శాతం మాత్రమే ఈ రేటును కస్టమర్లకు బదలాయించాయని ఆర్‌బీఐ స్వయంగా పేర్కొంది. అయితే రెపోకు బ్యాంకింగ్ రుణ రేటు మరింతగా అనుసంధానం కావాల్సి ఉందని కూడా ఆర్‌బీఐ స్పష్టం చేస్తోంది.

రేటు తగ్గించిన ఐసీఐసీఐ

ప్రైవేటు రంగ బ్యాంకింగ్ దిగ్గజం- ఐసీఐసీఐ బ్యాంక్ రుణ రేటును 10 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) తగ్గించింది. నిధుల సమీకరణ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్)ను అన్ని మెచ్యూరిటీలపై తగ్గించినట్లు బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. దీనితో ఏప్రిల్ నుంచీ బ్యాంక్ రుణ రేటు 0.20 శాతం తగ్గించినట్లయ్యింది. కొత్తగా తగ్గించిన రేట్లు సెప్టెంబర్ 1 నుంచీ అమల్లోకి వస్తాయని బ్యాంక్ పేర్కొంది. తాజా నిర్ణయం నేపథ్యంలో ఏడాది రేటు 8.55 శాతానికి తగ్గుతుంది. గృహ, ఆటో, వాణిజ్య రుణాలకు ఏడాది రుణ రేటే ప్రామాణికం కావడం గమనార్హం. ఇక ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 8.30 శాతానికి తగ్గుతుంది. కాగా ఐసీఐసీఐ బ్యాంక్ ప్రత్యర్థిగా ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏడాది రుణ రేటు ప్రస్తుతం 8.60%గా ఉంది. యాక్సిస్ బ్యాంక్ రేటు 8.55 శాతంగా ఉంది.

భారీ డిస్కౌంట్లను ప్రకటించిన మారుతీ

రూ. 1.12 లక్షల వరకు తగ్గింపు

న్యూఢిల్లీ: దేశీ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) తాజాగా భారీ డిస్కౌంట్లను ప్రకటించింది. మోడల్ ఆధారంగా రూ. 1.12 లక్షల వరకు తగ్గింపు ఇస్తున్నట్లు బుధవారం వెల్లడించింది. విటారా బ్రెజా, స్విఫ్ట్, డిజైర్, సియాజ్ కార్లకు ఈ స్థాయి వరకు డిస్కౌంట్ వర్తిస్తుందని వివరించింది. విటారా బ్రెజాకు కస్టమర్ ఆఫర్ రూ. 50,000, ఎక్స్ఛేంజ్ ఆఫర్ రూ. 20,000, కార్పొరేట్ ఆఫర్ రూ. 10,000, ఐదేళ్ల వారెంటీ కలుపుకుని మొత్తంగా రూ. 1.01 లక్షల వరకు డిస్కౌంట్ ఉన్నట్లు తెలియజేసింది. ఇదే తరహాలో అన్ని వాహనాలకు ఆఫర్ ఉన్నట్లు స్పష్టంచేసింది. ఆల్టో, ఆల్టో కే10 పెట్రోల్ వేరియంట్లకు రూ.65,000 వరకు ఆఫర్ ప్రకటించింది. స్విఫ్ట్ పెట్రోల్ వేరియంట్‌కు రూ. 50,000 డిస్కౌంట్.. డీజిల్ వేరియంట్‌కు రూ.77,700 డిస్కౌంట్ ఇస్తోంది. డిజైర

ప్రభుత్వానికి ఎన్‌టీపీసీ డివిడెండ్ రూ.2,473 కోట్లు

ఎన్‌టీపీసీ 2018-19 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2,473.63 కోట్ల తుది డివిడెండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించినట్టు ప్రకటించింది. కంపెనీ ఈక్విటీ మూలధనంలో ఇది 25 శాతం. డివిడెండ్ చెల్లించడం వరుసగా ఇది 26వ సంవత్సరమని ఎన్‌టీపీసీ పేర్కొంది.

ఆగస్టులో సేవలూ నెమ్మదే!

సేవల రంగం ఆగస్టులో నెమ్మదించింది. ఐహెచ్‌ఎస్ మార్కిట్ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ప్రకారం- ఆగస్టులో 52.4గా ఉంది. జూలైలో ఈ సూచీ 53.8 వద్ద ఉంది. ఆగస్టులో తయారీ రంగం కూడా పేలవ పనితనాన్ని ప్రదర్శించినట్లు పీఎంఐ పేర్కొంది. జూలైలో 52.5గా ఉన్న ఈ సూచీ ఆగస్టులో 51.4కు పడింది. అయితే ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగానే భావించడం జరుగుతుంది. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. ఈ లెక్కన గడచిన 25 నెలలుగా పీఎంఐ 50 పైనే ఉండడం గమనార్హం. కాగా సేవలు, తయారీ కలిసిన కాంపోజిట్ ఇండెక్స్ కూడా 53.9 నుంచి 52.6కు పడిపోవడం గమనార్హం.

టాప్ 25 స్టార్టప్స్‌లో ఓయో..

ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ 'లింక్డ్ ఇన్' ప్రకటించిన తాజా సమాచారం ప్రకారం.. గడిచిన ఏడాదికాలంలో దేశంలోని టాప్ 25 స్టార్టప్స్ 18,000 మందిని తమ సంస్థల్లోకి తీసుకున్నాయి. ఈ జాబితాలో ఓయో హోటల్స్ అండ్ హోమ్స్, క్యూర్ డాట్ ఫిట్, ట్యాప్‌చీఫ్, రేజర్‌పే, అకో జనరల్ ఇన్సూరెన్స్, ఎంఫైన్, ఉడాన్, డున్జో, స్టాన్జా లివింగ్ సంస్థలు ఉన్నాయి.

పర్యాటకులు మెచ్చిన దేశాల్లో భారత్‌కు 34వ స్థానం

డబ్ల్యూఈఎఫ్ వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం.. ట్రావెల్ అండ్ టూరిజం కాంపిటేటీవ్‌నెస్ ఇండెక్స్ (టీటీసీఐ)లో భారత్ 34వ స్థానానికి చేరుకుంది. రెండేళ్ల కిందట 40 వద్ద ఉన్న ఈ ర్యాంక్ ఏకంగా ఆరు స్థానాలు మెరుగుపడింది.

క్రిసిల్ వృద్ధి రేటు కోత

భారత స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు అంచనాలను దేశీయ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ 6.9 శాతం నుంచి 6.3 శాతానికి తగ్గించింది. మందగమన ధోరణి ఊహించినదానికన్నా విస్తృతంగా, తీవ్రంగా ఉండడం తన నిర్ణయానికి కారణమని పేర్కొంది.

బలపడిన రూపాయి

డాలర్ మారకంలో రూపాయి ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో బుధవారం 27 పైసలు బలపడింది. 72.12 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ల బలోపేతం దీనికి కొంత కారణమయ్యింది. కాగా, భవిష్యత్తులో రూపాయిది బలహీనధోరణేనన్నది విశ్లేషణ.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	39,800	0
బంగారం (22 క్యారెట్లు)	37,900	0
వెండి (కిలో)	54,800	▲ 2,200
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	39,280	▲ 130
బంగారం (22 క్యారెట్లు)	37,410	▲ 120
వెండి (కిలో)	54,800	▲ 2,200
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	39,280	▲ 130
బంగారం (22 క్యారెట్లు)	37,410	▲ 120
వెండి (కిలో)	54,800	▲ 2,200
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	38,700	-
బంగారం (22 క్యారెట్లు)	35,840	-
వెండి (కిలో)	51,000	-
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	40,190	▲ 220
బంగారం (22 క్యారెట్లు)	37,380	▲ 200
వెండి (కిలో)	52,000	▲ 2500
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	40,450	▲ 140
బంగారం (22 క్యారెట్లు)	37,410	▲ 120
వెండి (కిలో)	54,800	▲ 2,200

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	56.49 రాత్రి 11.30కు	$ 53.94 మంగళవారం ముగింపు
బ్రెంట్	60.88 రాత్రి 11.30కు	$ 58.26 మంగళవారం ముగింపు

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 05-9-2019

విశాఖ	361-00
చిత్తూరు	358-00
వరంగల్	318-00
చెన్నై	365-00
ముంబై	370-00
విజయవాడ	342-00
నమక్కల్	344-00
గోదావరి	342-00
04-09-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	315-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.75
బెంగళూరు	340-00
కోల్‌కత్త	377-00
ఢిల్లీ	340-00

10,800పైన నిఫ్టీ క్లోజ్

- స్టాక్ మార్కెట్లకు స్వల్ప లాభాలు
- సెన్సెక్స్ 162 పాయింట్లు పెరుగుదల
- నిఫ్టీ 47 పాయింట్లు అప్
- మెటల్స్, బ్యాంకు స్టాక్స్‌కు మద్దతు

ముంబై: జీడీపీ వృద్ధి, ఆటోమొబైల్ విక్రయ గణాంకాలతో మంగళవారం భారీగా నష్టపోయిన ఈక్విటీ మార్కెట్లు బుధవారం కాస్త కోలుకున్నాయి. అంతర్జాతీయంగా సానుకూల పవనాలు కలిసొచ్చాయి. మెటల్, బ్యాంకు స్టాక్స్ లాభపడిన వాటిల్లో ముందున్నాయి. అయితే, సూచీలు ఇంట్రాడేలో భారీ అస్థిరతలను చవిచూశాయి. సెన్సెక్స్ 367 పాయింట్ల శ్రేణిలో కదలాడి చివరికి 162 పాయింట్ల పెరుగుదలతో (0.44శాతం) 36,725 వద్ద క్లోజ్ అయింది. ఇంట్రాడేలో 36,776 గరిష్ట స్థాయి, 36,409 కనిష్ట స్థాయిలను నమోదు చేసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ సైతం 10,859-10,746 శ్రేణిలో ట్రేడ్ అయి చివరికి 47 పాయింట్ల లాభంతో (0.43శాతం) ముగిసింది. హాంగ్‌కాంగ్‌లో మూడు నెలలుగా ఆందోళనలకు కారణమైన వివాదాస్పద బిల్లును అక్కడి ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం ప్రధానంగా సానుకూల పవనాలకు దారితీసింది. సంబంధిత బిల్లు చట్ట రూపం దాలిస్తే ఒప్పందాలు లేని చైనా, తైవాన్‌లకు అవసరమైన వ్యక్తులను అప్పగించే అధికారం దఖలు పడుతుంది. మంగళవారం సెన్సెక్స్ 770 పాయింట్లు, నిఫ్టీ 225 పాయింట్ల చొప్పున నష్టపోవడం తెలిసిందే.

మారుతికి అధిక నష్టాలు

సెన్సెక్స్‌లో 18 స్టాక్స్ లాభపడగా, 12 నష్టపోయాయి. అధికంగా లాభపడిన వాటిల్లో భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, టాటా స్టీల్, వేదాంత, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, హెచ్‌సీఎల్ టెక్, ఓఎన్‌జీసీ, ఐసీఐసీఐ బ్యాంకు, ఎల్‌అండ్‌టీ ఉన్నాయి. మారుతి అత్యధికంగా 3.64 శాతం నష్టపోయింది. గురుగ్రామ్, మనేసర్ ప్లాంట్లలో రెండు రోజుల పాటు ఉత్పత్తి కార్యకలాపాలకు విరామం ప్రకటించడం ఈ స్టాక్‌పై ప్రభావం చూపింది. సన్ ఫార్మా, టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఎంఅండ్‌ఎం, బజాజ్ ఆటో, ఆర్‌ఐఎల్ నష్టపోయిన వాటిల్లో ఉన్నాయి.

ఆసియా మార్కెట్ల ర్యాలీ

అంతర్జాతీయంగాను ఈక్విటీ మార్కెట్లు రాణించాయి. హాంగ్‌కాంగ్‌లో సానుకూల పరిణామాలతో అక్కడి హ్యాంగ్‌సెంగ్ సూచీ 4% వరకు ర్యాలీ చేసింది. షాంఘై కాంపోజిట్ సూచీ, నిక్కీ, కోస్పి కూడా 1% వరకు లాభపడ్డాయి. యూరోప్ మార్కెట్లు కూడా లాభాలతోనే ఆరంభమవడం గమనార్హం. చైనాతో చర్చలు సానుకూలంగానే జరుగుతున్నాయంటూ ట్రంప్ చేసిన ప్రకటన కూడా సానుకూలించింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	4,095
ఎన్‌ఎస్‌ఈ	30,840
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	15,02,055
ఎఫ్ఐఐ	-1,738
డీఐఐ	1,305

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	340.95	2.88
BPCL	366.25	2.82
IOC	120.55	2.81
DRREDDY	2,600.20	2.66
JSWSTEEL	215.3	2.45
BHARTIARTL	345	2.42
SBIN	274.8	2.38
VEDL	136.7	1.9
HINDALCO	181.5	1.74
UPL	562.85	1.72

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
MARUTI	5,805.20	-4.04
SUNPHARMA	426	-3.04
BRITANNIA	2,626.05	-3.02
TATAMOTORS	109.75	-2.57
ASIANPAINT	1,537.00	-2.52
TITAN	1,036.15	-2.22
INDUSINDBK	1,315.40	-2.12
M&M	506	-1.83
ZEEL	356.35	-1.29
EICHERMOT	15,620.00	-0.99

స్వల్పకాలానికి ఎఫ్‌పీఐ పెట్టుబడులపై ఒత్తిళ్లు: ఇండియా రేటింగ్స్!

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు (ఎఫ్‌పీఐలు) సంబంధించి సర్‌చార్జీని ప్రభుత్వం ఉపసంహరించుకున్నప్పటికీ, మానిటరీ పాలసీ సులభతరం అయినప్పటికీ.. సమీప కాలంలో ఎఫ్‌పీఐల నుంచి పెట్టుబడుల రాక ఒత్తిళ్లనే ఎదుర్కొంటుందని ఇండియా రేటింగ్స్ పేర్కొంది. ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో డిమాండ్ అంచనాల కంటే తక్కువగా ఉండడం, భౌగోళిక, వాణిజ్య ఉద్రిక్తతలతో భారత్‌లో ఆర్థిక వృద్ధి అవకాశాలు బలహీనపడుతున్నాయని తన నివేదికలో వివరించింది. దీంతో వర్ధమాన మార్కెట్ డెట్ సాధనాలకు డిమాండ్ క్షీణిస్తున్నట్టు తెలిపింది. అంతర్జాతీయ మానిటరీ పాలసీ పరిస్థితులు అనుకూలంగా మారుతున్నా కానీ, సమీప నుంచి మధ్య కాలానికి భారత్‌లోకి ఎఫ్‌పీఐల పెట్టుబడులు సమస్యలనే ఎదుర్కోనున్నాయని పేర్కొంది.

భారత్‌లో మరిన్ని పెట్టుబడులు

సీఎన్‌హెచ్ ఇండస్ట్రియల్ ప్రణాళిక

న్యూయార్క్: పారిశ్రామిక, వ్యవసాయ సంబంధిత వాహనాల తయారీ సంస్థ సీఎన్‌హెచ్ ఇండస్ట్రియల్ భారత్‌లో వచ్చే ఐదేళ్ల కాలంలో మరిన్ని పెట్టుబడులు పెడుతుందని ఆ సంస్థ సీఈవో హ్యూబర్టస్ ముహాసెర్ తెలిపారు. ఆర్థిక వృద్ధి నిదానించినప్పటికీ ముఖ్యంగా తక్కువ హార్స్ పవర్‌తో కూడిన ఉత్పత్తుల విభాగంలో తాము పెట్టుబడులు పెడతామని ప్రకటించారు. ఐదేళ్ల ప్రణాళికలో భాగంగా అంతర్జాతీయంగా అన్ని విభాగాల్లోనూ ఉత్పత్తుల అభివృద్ధిపై 13 బిలియన్ డాలర్ల మేర ఇన్వెస్ట్ చేయనున్నట్టు ముహాసెర్ తెలిపారు. ఇందులో కొంత మేర భారత్‌లోనూ పెట్టుబడులు ఉంటాయన్నారు. నిర్మాణరంగ ఎక్విప్‌మెంట్ వాహనం 'క్రాలర్ ఎక్స్‌కవేటర్'ను వచ్చే ఏడాది భారత్‌లో విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఇటాలియన్-అమెరికన్ కంపెనీ అయిన సీఎన్‌హెచ్ ఇండస్ట్రియల్‌కు ప్రస్తుతం మన దేశంలో మూడు తయారీ యూనిట్లు ఉన్నాయి. ఇందులో ఒకటి కేస్, కాంపాక్టర్ బ్రాండ్ల వాహనాల తయారీకి సంబంధించినది. మిగిలిన రెండూ న్యూ హాలండ్ బ్రాండ్ ట్రాక్టర్లు, హార్వెస్టర్లకు సంబంధించిన వ్యవసాయ సంబంధిత వాహనాల తయారీవి.

అంతర్జాతీయ వాణిజ్య సదస్సుకు పల్సస్ సీఈవో శ్రీనుబాబు

హైదరాబాద్: పల్సస్ సీఈవో డాక్టర్ గేదెల శ్రీనుబాబు గ్రీస్‌లో ఈ నెల 6 నుంచి 8 వరకు జరగనున్న అంతర్జాతీయ సదస్సులో సాఫ్ట్ వేర్ టెక్నాలజీస్ పార్క్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా పాల్గొననున్నారు. కేంద్ర మంత్రి హర్ దీప్ పురి నేతృత్వంలోని భారత్ బృందంలో శ్రీనుబాబు ఒక సభ్యుడిగా ఎంపికయ్యారు.

జియోనీ నుంచి ఎఫ్9 ప్లస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్‌ఫోన్ల రంగంలో పోటీకి జియోనీ సై అంటోంది. తాజాగా ఎఫ్9 ప్లస్ పేరుతో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను బడ్జెట్ ధరలో ప్రవేశపెట్టింది. ఆన్‌డ్రాయిడ్ 9 పై ఆపరేటింగ్ సిస్టమ్, 3జీబీ ర్యామ్, 6.26 అంగుళాల హెచ్‌డీ ప్లస్ ఫుల్ వ్యూ డ్యూడ్రాప్ నాచ్ డిస్‌ప్లే, స్మార్ట్ ఇమేజ్ సెన్సార్‌తో 13 ఎంపీ, 2 ఎంపీ కెమెరా, 13 ఎంపీ ఆర్టిఫీషియల్ ఇంటెల్లిజెన్స్ సెల్ఫీ కెమెరా, 1.65 గిగాహెర్ట్జ్ ఆక్టాకోర్ ప్రాసెసర్‌ను పొందుపరిచింది. 2 నానో సిమ్ స్లాట్స్, మైక్రో ఎస్డీ స్లాట్, 32 జీబీ ఇంటర్నల్ మెమరీ, ఫింగర్‌ప్రింట్ షటర్, ఫేస్ అన్‌లాక్ వంటి ఫీచర్లను జోడించింది. 4,050 ఎంఏహెచ్ బ్యాటరీ దీనికి అదనపు హంగు. ధర రూ.7,690 ఉంది. 2 రంగుల్లో లభిస్తుంది.

పండుగల సీజన్‌పై ఆటో రంగం ఆశలు

డిమాండ్ ఊపందుకుంటుందనే అంచనాలు

న్యూఢిల్లీ: వచ్చే పండుగల సీజన్‌లో అమ్మకాలు పెరిగేందుకు అవకాశం ఉందని దేశీ ఆటో రంగం భావిస్తోంది. రివర్స్ గేర్‌లో ప్రయాణిస్తోన్న విక్రయాలు ఈ సీజన్‌లోనైనా ముందుకు కదులుతాయనే కొండంత ఆశతో ఉంది. ఒక్కసారిగా అమ్మకాలు జూమ్ అనే అవకాశాలు కనుచూపు మేరలో లేనప్పటికీ.. ప్రతికూల వాతావరణం నుంచి పండుగల సీజన్‌లో ఈ రంగం నెమ్మదిగా బయటపడేందుకు మాత్రం ఆస్కారం ఉందని అంచనావేస్తున్నట్లు హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌సీఐఎల్) సీనియర్ వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్ (మార్కెటింగ్ - సేల్స్) రాజేష్ గోయెల్ అన్నారు. 'దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లో ఇప్పటికే పండుగల సీజన్ ప్రారంభమైంది. ఈ ఏడాదిలో అమ్మకాలు జోరందుకునే అవకాశాలు తక్కువని భావిస్తున్నా. అయితే, క్రమంగా గాడిన పడేందుకు మాత్రం ఈ పండుగల సమయం సరైనదనిగా భావించవచ్చు. ఇక గతంలో ఎన్నడూ లేని విధంగా డిస్కౌంట్లు కూడా ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చిలో కార్ల ధరలు మరింత చౌకగా ఉంటాయనే అంచనలో వినియోగదారులు ఉంటే మాత్రం.. ఆ సమయంలో రిజిస్ట్రేషన్ క్షిష్టతరంగా ఉంటుంది. అందుచేత కొనుగోలుదారులకు ఇదే సరైన సమయంగా భావిస్తున్నా' అని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఎఫ్ఏడీఏ) నిర్వహించిన వార్షిక ఆటో రిటైల్ సమావేశంలో గోయెల్ వ్యాఖ్యానించారు. ఒక్కసారే అమ్మకాలు పెరిగేందుకు అవకాశాలు లేకపోయినా.. వచ్చే నెల నుంచి క్రమంగా ఊపందుకునేందుకు అవకాశం ఉందని భావిస్తున్నామని టయోటా కిర్లోస్కర్ మోటార్' (టీకేఎం) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ రాజా అన్నారు.

ఎంక్వైరీలు పెరగడమే సంకేతం..

ప్రస్తుతం కస్టమర్ల ఆఫర్లు అధిక స్థాయిలో ఉన్నాయి. ఇది సానుకూల అంశం కాగా, షోరూంలకు పెరిగిన ఎంక్వైరీల (కొనుగోలుదారుల నుంచి కార్లకు సంబంధించిన విచారణ) ఆధారంగా ఈ పండుగల సీజన్‌లో అమ్మకాలు గాడిన పడతాయని అంచనావేస్తున్నట్లు మారుతి సుజుకి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాశాంక్ శ్రీవాస్తవ వివరించారు.

డీసీఐఎల్‌కు అపార సాంకేతిక పరిజ్ఞానం

ఎండీ రాజేష్ త్రిపాఠి

విశాఖపట్నం: భారతదేశ డ్రెడ్జింగ్ అవసరాలను 70 శాతం వరకూ తీర్చగల శక్తి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీసీఐఎల్)కు ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ త్రిపాఠి తెలిపారు. ముంబైలో 'డ్రెడ్జింగ్ ఇన్ ఇండియా' పదో వార్షిక సదస్సులో ఆయన పాల్గొన్నారు. విశాఖపట్నం నుంచి సముద్రంలో పూడిక తీయడం, నిర్వహణ, సముద్రతీర పోషణ, భూమి పునరుద్ధరణ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీలో పూడిక తీసే పూర్తి స్థాయి అనుభవం, సాంకేతిక పరిజ్ఞానం సంస్థ కలిగి ఉందని చెప్పారు. డీసీఐఎల్‌ను నాలుగు ఓడరేవులు కన్సెస్షన్ స్వాధీనం చేసుకున్న తరువాత ప్రస్తుతం భౌగోళిక విస్తరణతో పాటు లోతులేని చోట్ల పూడిక తీత, సముద్ర నిర్మాణం, ఇసుక మైనింగ్, డ్రెడ్జింగ్ ఆగ్రిగేట్స్, మెరైన్ కన్సల్టెన్సీగా వైవిధ్యమైన సేవలు అందిస్తోందన్నారు. ఇండో-బంగ్లాదేశ్ ప్రొటోకాల్ కింద లోతట్టు జల మార్గాల అభివృద్ధి, సాగర్‌మాల ప్రాజెక్ట్, తీర ప్రాంత అభివృద్ధి, రాబోయే హరిత క్షేత్ర ఓడరేవులు, భారత నదులలో కొత్త విభాగాన్ని పరిగణనలోకి తీసుకోవడానికి కేంద్రం ఇటీవల ప్రేరేపించినందున డీసీఐఎల్ అధిక వృద్ధి పథంలో నడిచేందుకు సిద్ధంగా ఉందన్నారు. పర్యావరణపూర్వక పూడికతీత పద్ధతుల్లో ప్రత్యేక పరిజ్ఞానం డీసీఐఎల్‌కు ఉందన్నారు.

ఎన్‌హెచ్‌ఏఐ పటిష్టంగానే ఉంది

- ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడం లేదు
- పైప్‌లైన్‌లో ఎన్నో ప్రాజెక్టులు చైర్మన్ సిన్హా ప్రకటన
- ఆదాయాలూ బాగున్నాయని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఎటువంటి ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడం లేదని చైర్మన్ ఎస్ఎన్ సిన్హా స్పష్టం చేశారు. చాలా బలమైన స్థితిలోనే ఎన్ఎచ్ఏఐ ఉందని, ప్రణాళికలో ఎన్నో ప్రాజెక్టులు కూడా ఉన్నట్టు తెలిపారు. గతేడాది 3,300 కిలోమీటర్ల మేర రహదారుల ప్రాజెక్టులను చేపట్టగా, ప్రస్తుత ఏడాది 4,500 కిలోమీటర్ల మేర ప్రాజెక్టులను నిర్మించనున్నామని ఆయన చెప్పారు. ''ఎన్‌హెచ్ ఏఐకు అనిశ్చయ నష్టాలు రూ.3 లక్షల కోట్ల మేర ఉంటాయని మీడియాలోని కొన్ని సెక్షన్లలో కథనాలు వచ్చాయి. ''అనిశ్చయ నష్టాలను వారు సరిగా అర్థం చేసుకోకపోవడం లేదా ఆ గణాంకాలను పొరపాటుగా పేర్కొనడం జరిగింది. అనిశ్చయ నష్టాలన్నవి సహజంగానే అస్పష్టతతో ఉంటాయి. మా పరిశీలన, చెల్లింపుల రేషియో ప్రకారం చూస్తే ఆ స్థాయి నష్టాలేమీ ఉండబోవు. ఎన్‌హెచ్‌ఏఐ నుంచి క్లెయిమ్ బాధ్యతలన్నవి రూ.70,000 కోట్ల వరకు ఉంటాయి'' అని సిన్హా వివరించారు. అదే సమయంలో తమకు ఎన్నో రూపాల్లో ఆదాయం ఉందని వివరించారు. అనిశ్చితిని సృష్టించడానికే సంబంధిత కథనాలను సృష్టించినట్టుగా ఉందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పటికీ గడిచిన ఏడాదితో పోలిస్తే వెయ్యి కిలోమీటర్ల మేర అదనంగా రహదారులను ఈ ఏడాది నిర్మించనున్నట్టు చెప్పారు. బడ్జెట్ నుంచి మరిన్ని నిధులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు తెలిపారు. జాతీయ రహదారుల నుంచి వచ్చే ఆదాయానికి అదనంగా, మార్కెట్ నుంచి నిధులను కూడా సమీకరించనున్నట్టు చెప్పారు. ఈ ఏడాది చివరికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)ను తీసుకువస్తామని, కేబినెట్ ఆమోదం కోసం వేచి చూస్తున్నట్టు వెల్లడించారు.

మౌలిక రంగం వృద్ధి ఎలా..!

మౌలిక రంగం ప్రతినిధులతో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం సమావేశమయ్యారు. వృద్ధి, ఉపాధి కల్పన వంటి అంశాల్లో ఈ రంగానికి కీలక పాత్ర ఉన్న నేపథ్యంలో- ఆర్థికమంత్రి జరిపిన ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. మౌలికరంగం పురోగతికి తీసుకోవాల్సిన చర్యలపై ఆర్థికమంత్రి ఈ సమావేశంలో దృష్టి సారించినట్లు సమాచారం. ఆర్థిక మందగమనం నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై గత నెల నుంచీ ఆర్థికమంత్రి వివిధ వర్గాలతో సమావేశమవుతున్న సంగతి తెలిసిందే. నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్, ఫైనాన్స్ సెక్రటరీ రాజీవ్ కుమార్‌సహా ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్ ఎస్ఎన్ సిన్హా, హెచ్‌సీసీ సీఎండీ అజిత్ గులాబ్‌చంద్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో రిలయన్స్ నేవల్

న్యూఢిల్లీ: వ్యాపారవేత్త అనిల్ అంబానీ గ్రూప్‌నకు చెందిన సంస్థలు మరింత సంక్షోభంలోకి కూరుకుపోతున్నాయి. తాజాగా రిలయన్స్ నేవల్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్‌నేవల్) తీవ్ర నిధుల కొరత ఎదుర్కొంటున్నట్లు వెల్లడించింది. దీంతో ఇప్పటికే పొందిన ఆర్డర్లను పూర్తి చేయడంపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొంది. 'పలు సవాళ్ల కారణంగా కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది. రుణ పరిష్కార ప్రణాళిక ఇంకా సిద్ధం కాకపోవడంతో తీవ్ర నిధుల కొరత నెలకొంది. ఫలితంగా ప్రస్తుత ప్రాజెక్టుల పురోగతి దెబ్బతింటోంది. గడువులు పొడిగించాల్సి వస్తోంది. దీంతో క్లయింట్ల నమ్మకం కోల్పోవాల్సి వస్తోంది' అని వార్షిక నివేదికలో రిలయన్స్ నేవల్ సీఈవో దేబాశీస్ బీర్ పేర్కొన్నారు. కొత్త డిఫెన్స్ కాంట్రాక్టులు లేకపోవడంతో రుణాలపై వడ్డీలు చెల్లించేందుకు సరిపడా ఆదాయాలు కూడా లేవని, ఇది ఆర్థిక ఒత్తిడిని మరింతగా పెంచేసిందని పేర్కొన్నారు.

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	364.35	361.3
ASIAN PAINT	1535.15	1576.75
AXIS BANK	647.3	645.7
BAJAJ AUTO	2735.7	2764.2
BAJAJ FINSE	7023.1	7026.3
BAJAJ FINAN	3250.25	3258.5
BHARTI AIRT	345.7	336.85
BPCL	363.55	356.2
BRITANNIA I	2635.45	2707.85
CIPLA LTD	471.4	469.55
COAL INDIA	182.15	181.05
EICHER MOTO	15642.4	15775.8
GAIL (INDIA)	127.3	126.8
GRASIM INDU	694.05	696.25
HCL TECHNOL	1125.65	1108.35
HDFC LTD	2100.1	2089.9
HDFC BANK L	2247.75	2210.95
HERO MOTOCO	2566.1	2557.45
HINDALCO	181.65	178.4
HUL	1846.6	1841.85
INDIABULLS	458.3	454.55
ICICI BANK	397.5	392.15
INDUSIND BA	1317.6	1343.95
BHARTI INFR	248.05	248.25
INFOSYS LIM	821.3	814.25
INDIAN OIL	120.35	117.25
ITC LTD	243.25	241.55
JSW STEEL L	214.8	210.15
KOTAK MAHIN	1426.45	1414.3
LARSEN & T	1308.05	1294.4
MAHINDRA &M	505.7	515.45
MARUTI SUZU	5830.75	6049.7
NTPC LTD	119.45	117.65
ONGC	119	117.15
POWER GRID	196.9	197.05
RIL	1201.15	1206.4
SBI	275.1	268.4
SUN PHARMAC	426.45	439.35
TATA MOTORS	109.5	112.65
TATA STEEL	339.25	331.4
TCS	2245.4	2251.6
TECH MAHIND	703.25	704.5
TITAN COMPA	1037.2	1059.65
ULTRATECH C	3876.5	3885.55
UPL LIMITED	561.05	553.35
VEDANTA LIM	136.7	134.15
WIPRO LTD	256.05	253.65
YES BANK LI	59.45	58.75
ZEE ENTERTA	355.5	361

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1319.6	1329.75
ACC LIMITED	1440.95	1451.3
AMBUJA CEME	190.9	193.35
ASHOK LEYLA	62.6	65.35
BAJAJ HOLDI	3304.5	3262.7
BANDHAN BAN	452.15	454.55
BANK OF BAR	93.3	91.45
BHEL	50.1	49.35
BIOCON LIMI	231.3	225.4
BOSCH LIMIT	13394.55	13789.3
CADILA HEAL	230.25	228.95
COLGATE PAL	1245.25	1248.9
CONTAINER C	502.9	491.95
DABUR INDIA	442.2	443.05
DLF LIMITED	163.95	163.55
AVENUE SUPE	1524.85	1508
GENERAL INS	170.9	172.5
GODREJ CONS	582.9	599.75
HAVELLS IND	636	652.6
HDFC AMC LI	2573.95	2652.3
HDFC LIFE I	535.65	536.75
HINDUSTAN P	257.2	256.8
HINDUSTAN Zinc	214.8	213.25
ICICI LOMBA	1145.45	1189.95
ICICI PRU L	427.4	423.55
VODAFONE ID	5	5.1
INTERGLOBE	1641.2	1624.7
L&T FINANCE	91.35	91.9
LUPIN LIMIT	741.95	735.5
M

బాలభారతం సినిమాలో
ఓ పాట ఉంటుంది..
అర్జునుడు బాణాలతో
ఓ నిచ్చెన వేస్తే..
భీముడు ఆ మెట్లు ఎక్కుతూ
అంతరిక్షానికి చేరుకుంటాడు
అంతరిక్షం అంచుల దాకా
నిచ్చెన వేయడం ఆనాటి
కవి కల్పన కావొచ్చు..

కానీ సాంకేతికత
అభివృద్ధి చెందిన
ఈ రోజుల్లో
నిర్మించలేమా?
ఎంచక్కా చేయొచ్చు
కానీ కొంచెం
రివర్స్‌గా ఆలోచిద్దాం
అంటున్నారు
శాస్త్రవేత్తలు..

నింగికి నిచ్చెన వేద్దామా?

స్పేస్ ఎలివేటర్..
ప్రపంచవ్యాప్తంగా అందరిలో ఆసక్తి రేకెత్తించిన అంశం ఇది. భూమ్మీది నుంచి బలమైన ఉక్కుతాళ్లతో ఓ లిఫ్ట్ లాంటిది నిర్మించడం తద్వారా జాబిల్లితో పాటు ఇతర గ్రహాలను సులువుగా చేరుకోవడం ఆ ఆలోచన వెనుక ఉన్న ఉద్దేశం. అయితే అందుబాటులో ఉన్న పదార్థాలు, టెక్నాల జీలతో ఈ అంతరిక్ష నిచ్చెన కట్టడం దాదాపు అసాధ్యమని తేలింది. తాజాగా కొలంబియా, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ శాస్త్ర వేత్తలు స్పేస్ ఎలివేటర్ నిర్మాణానికి వినూత్న ప్రతిపాదన చేశారు. నిచ్చెన భూమ్మీది నుంచి కాకుండా.. చందమామ నుంచి వేలాడుతూ ఉండటం ఈ తాజా ఆలోచన!

అంతరిక్ష ప్రయోగాల ఖర్చు కోట్లల్లో ఎందుకుంటుందో తెలుసా? భూమి గురుత్వాకర్షణ శక్తి మొత్తాన్ని అధిగమించేంత శక్తి అవసరం కాబట్టి.. బోలెడంత ఇంధనం అవసరమవుతుంది కాబట్టి. సమీప భవిష్యత్తులోనే జాబిల్లిపై మకాం పెట్టాలని అగ్రరాజ్యాలు ఆలోచి స్తుండగా.. ఎలన్ మస్క్ వంటివాళ్లు ఇంకో నాలుగేళ్లలో అంగారకు డిపై కాలనీ ఏర్పాటు చేస్తామంటున్నారు. కాబట్టి ఇలాంటివి సాధ్యం కావాలంటే స్పేస్‌లైన్ సూచిస్తున్న నిచ్చెన లాంటివి అత్యవసరమవు తాయి. కొలంబియా, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల ప్రతి పాదన ప్రకారం.. జాబిల్లిపై బలమైన తీగ లాంటిదాన్ని బిగించి దాన్ని భూస్థిర కక్ష్య వరకు వేలాడేలా చేస్తారు. భూమ్మీది నుంచి వెళ్లే రాకెట్లు.. ఈ తీగ కొనకు చేరుకుంటాయి. అక్కడే పార్క్ అవుతాయి. ఆ తర్వాత వ్యోమగాములు ఈ తీగ వెంబడి ఇంకో రాకెట్‌లో సులువుగా జాబిల్లిని చేరుకుంటారు. అంతరి క్షంలో ఎలాంటి అడ్డంకులు ఉండవు కాబట్టి తక్కువ శక్తితోనే ఎక్కువ దూరం ప్రయాణించవచ్చు. ఈ శక్తిని కూడా సౌరశక్తితో అక్కడికక్కడే ఉత్పత్తి చేసుకోవచ్చు. ఈ స్పేస్‌లైన్‌ను నిర్మించేందుకు అవసరమైన అన్ని టెక్నాలజీలు, పదార్థాలు అందుబాటులోనే ఉన్నాయని జెఫైర్ పెనెరీ అనే శాస్త్రవేత్త తెలిపారు.

గ్రహాలను అందుకునేందుకు..

ఎంతో కీలకం...

అతితక్కువ ఖర్చుతో వ్యోమగాములను జాబిల్లికి చేర్చడం మాత్రమే కాకుండా.. భవిష్యత్తులో ఇతర గ్రహాలకు వెళ్లేందుకు కూడా స్పేస్‌లైన్ కీలకమైన నిర్మాణం కానుందని వివరించారు. భవిష్యత్తులో ఈ స్పేస్‌లైన్ నిర్మాణమంటూ జరిగితే.. దాన్ని టెలిస్కోపులు, అంతరిక్ష పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు వాడుకోవచ్చని జెఫైర్ అంటు న్నారు. భూమి, జాబిల్లి తాలూకు గురుత్వశక్తులు సమానంగా.. వ్యతిరేక దిశలో ఉండే లంగ్రాంజ్ పాయింట్ ప్రాంతంలో ఇతర వ్యవస్థలను ఏర్పాటు చేయొచ్చని తెలిపారు. పూర్తి వివరాలు ఏఆర్ఎక్స్ ఐవీ ప్రీ ప్రింట్‌లో ప్రచురితమయ్యాయి.

సాక్షి నాలెడ్జ్ సెంటర్

మౌత్‌ఫ్రెష్‌తో జాగ్రత్త..

ఉదయాన్నే పళ్లు తోముకున్న తర్వాత మౌత్‌వాష్‌తో మరోసారి నోటిని శుభ్రం చేసుకో వడం కొందరికి అలవాటు. కానీ ఇలా చేయడం వల్ల వ్యాయామం చేస్తే వచ్చే లాభాలు కాస్తా తగ్గిపోతాయని అంటున్నారు ఫ్లైమౌత్ యూనివ ర్సిటీ శాస్త్రవేత్తలు. సాధారణంగా వ్యాయామం చేసిన వెంటనే మన రక్తపోటు కొంచెం పెర గడం.. ఆ తర్వాత తగ్గుతుంటుంది. వ్యాయామం చేసేటప్పుడు నైట్రిక్ యాసిడ్ ఉత్పత్తి పెరిగిపోయి రక్తనాళాలు వ్యాకోచం చెంది శరీరంలోని అవయవాలకు, కండరాలకు తగినంత ఆక్సిజన్ అందడం వల్ల రక్తపోటు తగ్గు తుందని అంచనా. వాసోడైలేషన్‌అని పిలిచే ఈ ప్రక్రియ వ్యాయామం చేసేటప్పుడు మాత్రమే జరుగుతుందని ఇప్పటివరకు అనుకునేవారు. కానీ ఆ తర్వాతకూడా చాలాసమయం పాటు ఇది కొనసాగడం శాస్త్రవేత్తలకు ఆశ్చర్యం కలిగించింది. కారణం ఏంటోతెలుసుకునేందుకు జరిపిన పరిశోధనల్లో నోటిలోని ఓ బ్యాక్టీరియా నైట్రేట్లతో జరుపుతున్న రసాయన చర్యలు కార ణమని స్పష్టమైంది. నైట్రిక్ ఆక్సైడ్ క్షీణించే క్రమంలో నైట్రేట్లు ఏర్పడుతుంటాయి. నోటి

లోని కొన్ని రకాల బ్యాక్టీరియా ఈ నైట్రేట్లను కాస్తా నైట్రైట్లుగా మార్చి.. మళ్లీ నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తి అయ్యేందుకు దోహదపడుతున్నాయి. మౌత్‌వాష్ కారణంగా ఈ బ్యాక్టీరియా నశించిపోతుండటంతో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిలో తగ్గుదల నమోదవుతోంది.

సిన్ సిన్.. సూపర్ కార్..

కారు భలే ఉంది కదూ! దీనిపేరు సిన్. లాంబొర్గినీసంస్థ తయారు చేసింది.. ఈకారులో ప్రపంచంలోనే మొదటిసారిగా సూపర్ కెపాసిటర్ వాడారు. బోలెడంత విద్యుత్తు నిల్వ ఉంచుకోగల సామర్థ్యం వీటి సొంతం. అలాగని మనకు కావాల్సినప్పుడు వాడుకుంటామంటే కుద రదు. ఎంత వేగంగా చార్జ్ చేసుకోవచ్చో.. అంతే వేగంగా డిశ్చార్జ్ కూడా అవుతుంది. కాకపోతే తక్కువ స్థలంలో ఎక్కువ విద్యుత్తు నిల్వ చేయడం సాధ్యం కాదు. ఇలాంటి లక్షణాలున్న సూపర్ కెపాసిటర్లను లాంబొర్గిని తన సిన్ కారులో ఉపయోగించింది. అత్యంత శక్తిమంతమైన ఇంజిన్ (785 హార్స్‌పవర్)తో వచ్చే సిన్‌లో 25 కిలోవాట్ల మోటారు ఉంది. రెండింటినీ కలిపి చూస్తే.. దీని హార్స్‌పవర్ 819కు చేరుతుంది. దీనికి అద నంగా సూపర్ కెపాసిటర్లు ఉంటాయి. వంద కిలోమీటర్ల వేగాన్ని అందు కునేందుకు సిన్‌కు పట్టే సమయం 2.8 సెకన్లు మాత్రమే. తక్కువ సమ యంలో ఎక్కువ మోతాదులో విద్యుత్తు అందించేందుకు సూపర్ కెపాసి టర్లు ఉపయోగపడతాయి. బ్రేకులు వేసినప్పుడు వృథా అయ్యే శక్తిలో అత్యధికం ఈ సూపర్ కెపాసిటర్లలో విద్యుత్తుగా స్టోర్ అవుతుంది. ఇలాంటి కార్లు 63 మాత్రమే అందుబాటులోకి రానున్నాయి. త్రీడీ టెక్నా లజీలో ముద్రించిన విడిభాగాలను ఈ సూపర్ కారులో వాడారు!

దోస్త్ ఫారిన్ పోవొద్దని..

- ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ చేసిన ప్రబుద్ధుడు
- స్నేహితుడిచ్చే పార్టీలు దూరమవుతాయనే ఉద్దేశంతోనే..
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

శంషాబాద్: స్నేహితుడు ఇస్తున్న విందులు, లభిస్తున్న విలాసాలు దూరమైపోతాయని అతడి విదేశీ ప్రయాణాన్ని రద్దు చేయడానికి ఓ ప్రబు ద్ధుడు చేసిన నిర్వాకమిది. శంషాబాద్ ఎయిర్‌పో ర్టులో బాంబు పేలుస్తానంటూ బెదిరింపు మెయి ల్‌తో భద్రతాధికారులు, పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించిన ఓ వ్యక్తి జైలు పాలయ్యాడు. శంషాబాద్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం శంషాబాద్ అంతర్జా తీయ విమానాశ్రయానికి చెందిన కస్టమర్ సపోర్ట్ మెయిల్‌కు కాలేరు సాయిరాం అన్న ఐడీతో ఓ సందేశం వచ్చింది. అందులో 'ఐ వాంట్ బాంబ్ బ్లాస్ట్ ఇన్ ఎయిర్‌పోర్టు టుమారో'అని ఉంది. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మెయిల్ ఐడీ మహబూబాబాద్ జిల్లా కేసముద్రా నికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాలేరు సాయి రాందిగా గుర్తించారు. ప్రస్తుతం అతడు ఉప్పల్ లోని ఫిర్జాదిగూడలో నివాసముండటంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. కెనడాలో ఉన్నత చదువుల కోసం సాయిరాం కొంతకాలంగా ప్రయత్నిస్తున్నాడు. వరంగల్‌కు చెందిన తన స్నేహితుడు శశికాంత్ హైదరాబాద్‌లో ఎంటెక్ చదువుతూ అమీర్‌పేట్‌లో ఉంటున్నాడు. సాయి రాం మొదటిసారి వీసా రాకపోవడంతో రెండో సారి ఆగస్టు 5న తన వివరాలన్నింటిని పీడీఎఫ్ ఫైల్‌గా చేసి శశికాంత్ ఇంటికి వెళ్లి అక్కడి నుంచి కెనడా వీసాకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ సమ యంలో శశికాంత్ సాయిరాం వివరాలను తస్క రించాడు. సాయిరాం వెళ్లిన తర్వాత కెనడా ఇమి గ్రేషన్‌కు అసభ్యకరమైన సందేశాలను సాయిరాం మెయిల్ ఐడీ ద్వారా పంపాడు. ఈ విషయమై సాయిరాంకు అక్కడి నుంచి సమాచారం రావడం తో వెంటనే రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ జరుగుతోంది.

మరోసారి చెడగొట్టాలని..

కెనడాలో ఉన్నత చదువుల కోసం మరోసారి సాయిరాంకు అవకాశం రావడంతో సెప్టెంబర్ 4న కెనడా వెళ్లడానికి అంతా సిద్ధం చేసుకున్నాడు. ఈ సారి సాయిరాం ప్రయాణాన్ని ఎలాగైనా చెడగొట్టా లని శశికాంత్ నిర్ణయించుకున్నాడు. సెప్టెంబర్ 3న సాయిరాం ఐడీతో శంషాబాద్ విమానాశ్రయం లోని కస్టమర్ సపోర్ట్ మెయిల్ ఐడీకి ఎయిర్‌పో ర్టులో బాంబు పేలుస్తానంటూ సందేశం పంపా డు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. కాలేరు సాయిరాం ద్వారా వివరాలను సేకరించి శశికాంత్‌ను అదుపులోకి తీసుకుని విచా రించడంతో నేరం అంగీకరించాడు. అతడి నుంచి ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎయిర్ పోర్టు భద్రతకు భగ్నం కలిగించే విధంగా వ్యవహ రించినందుకుగాను వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌పై సింగరేణి ప్రకటనలు

దక్షిణ మధ్య రైల్వే ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఇక సింగరేణి ప్రకటన లతో నిండిపోనుంది. సింగరేణి బొగ్గు గనుల సంస్థకు సంబంధించిన ప్రకటనలు 21 బోగీలపై కనిపించనున్నాయి. ఈ మేరకు ఆ సంస్థతో దక్షిణ మధ్య రైల్వే ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.50 లక్షలను సింగరేణి సంస్థ దక్షిణ మధ్య రైల్వేకు చెల్లిస్తుంది. రైలు బయటే కాకుండా లోపలి భాగంలో కూడా కొంతమేర ప్రకటనలు ఉంటాయి. ప్రయాణికు లకు సూచనలు ఉండే ప్రాంతం, ఇతర కొన్ని నిర్ధా రిత ప్రాంతాలు మినహా మిగతా భాగాల్లో ప్రకట నలు వేసుకునేందుకు అనుమతించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సరుకు రవాణాలో ఉండే ప్రముఖ సంస్థలతో ఒప్పందం చేసుకోవాలని నిర్ణ యించింది. ప్రస్తుతం రైల్వేలో బొగ్గు ఎక్కువగా రవాణా అవుతుంది. దీంతో ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కస్టమర్‌గా కొనసాగుతోంది. ఈ మేరకు ఇటీవల అధికారులు చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు.

2016 తెలంగాణ TET-I పేపర్ పస్ట్ ఉత్తీర్ణత 134/150
2017 తెలంగాణ TET-I పేపర్ పస్ట్ కర్నూలు 139/150
2019 AP పేపర్ SI మహిళా విభాగం పేపర్ 1 లో ప్రథమ
కృష్ణా జిల్లా, అమరావతి
ప్రగతి DSC
TET-I + SGT
నిర్వహణ ప్రారంభం : 11-9-2019, సాయంత్రం 4-32 నిలకు
98852 72474, 73821 78356

MARUTI SUZUKI
NEXA

THE BEST OFFERS
OF THE YEAR

LIMITED PERIOD OFFERS ONLY
VALID TILL 30th SEPTEMBER 2019

BRAND	BALENO (P)	BALENO (D)	IGNIS	S-CROSS	CIAZ (P)	CIAZ (D)
CONSUMER OFFER*	₹15,000	₹20,000+5 YEAR WARRANTY	₹30,000	₹50,000+5 YEAR WARRANTY	₹25,000	₹25,000+5 YEAR WARRANTY
EXCHANGE OFFER	₹15,000	₹15,000	₹20,000	₹30,000	₹30,000	₹30,000
CORPORATE OFFER	₹5,000	₹10,000	₹7,000	₹10,000	₹10,000	₹10,000
TOTAL SAVINGS#	₹35,000	₹62,400	₹57,000	₹1,12,900	₹65,000	₹87,700

Contact us at
1800-200-[6392]
1800-102-[NEXA]
www.nexaexperience.com
NOW YOU CAN ALSO BOOK ONLINE

NALGONDA: NEXA NALGONDA NORTH (PAVAN MOTORS PVT. LTD. PH: 9100051403), KARIMNAGAR: NEXA RAMPUR (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 8897096633), WARANGAL: NEXA WARANGAL EAST (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 9133398806), NIZAMABAD: NEXA NIZAMABAD EAST (VARUN MOTORS PH: 9160991616), KURNOOL: NEXA KURNOOL WEST (MSA MOTORS PH: 9133307830), TIRUPATI: NEXA RENIGUNTA ROAD (BHARGAVI AUTOMOBILES PH: 7730894444), ANANTAPUR: NEXA GOOTY ROAD (SRI DURGA MARUTHI AUTOMOTIVES PVT. LTD. PH: 9100790507), HYDERABAD: NEXA HYDERNAGAR (ACER MOTORS PVT. LTD. PH: 7995075830), NEXA GACHIBOWLI (JAYABHERI AUTOMOTIVE PH: 8688796666), NEXA SOMAJIGUDA (SAI SERVICE PH: 23336633,34,35,36, 7337531111), NEXA BANJARA HILLS (VARUN MOTORS PH: 7878033666), NEXA JUBILEE (RKS MOTORS PH: 9989511111), NEXA LB NAGAR (KALYANI MOTORS PH: 9100102762), NEXA LUMBINI PARK (RKS MOTORS PH: 9553211111, 9010624000), NEXA MALAKPET (GEM MOTORS INDIA PVT. LTD. PH: 9912345830), NEXA KUKATPALLY (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 8897972200), SECUNDERABAD: NEXA SECUNDERABAD (MITHRA NEXA AUTOMOBILES PH: 9515048048), NEXA SAINIKPURI (VARUN MOTORS PH: 8000033666), NEXA BOWENPALLY (AUTOFIN LIMITED PH: 8886630939), VIJAYWADA: NEXA MG ROAD (PARAMSHIVA MOTORS PH: 0866-2484129, 7893833959), NEXA RING ROAD (VARUN MOTORS PH: 7799994679, 8662541513), GUNTUR: NEXA AUTONAGAR (JAYALAXMI AUTOMOBILES PH: 863-2261000, 9573945678), NELLORE: NEXA AYYAPA TEMPLE (BHARGAVI AUTOMOBILES PH: 7095393333), BHIMAVARAM: NEXA BHIMAVARAM WEST (NOVELTY REDDY AND REDDY PH: 9133378630), VIZAG: NEXA DASAPALLA HILLS (VARUN MOTORS PH: 0891-2733222, 7799812226, 9885438355), NEXA VIP ROAD (JAYABHERI AUTOMOTIVES PH: 9100980764, 8008333556), RAJAMUNDRY: NEXA RAJAMUNDRY EAST (SB MOTOR CORP PH: 8297784119).

*Offer may vary from variant to variant. #Total savings include Consumer Offer + Exchange Offer + Highest Corporate Offer and 5 year warranty (2 year standard warranty + 3 year extended warranty) on NEXA Diesel cars.

connect
A REVOLUTIONARY WAY TO CONNECT TO YOUR CAR
- Vehicle Tracking
- Emergency Alert
- Driving Behaviour Analysis
- Live Vehicle Status
- Vehicle Alerts

Offered separately as Genuine NEXA Accessory

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

epaper.sakshi.com